www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

కమ్మ మహానాడు 2026

8 ఫిబ్రవరి, 2026 - ఆదివారం, మ॥ 3.30 గం॥లకు
సేందమంగళం
శ్రీ పెరంబదూర్, తమిళనాడు
(చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి)

ఆదివారం | 8-2-2026 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 333 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం, తిథి: సప్తమి తె. 5:01 తదుపరి అష్టమి, నక్షత్రం: స్వాతి తె. 5:03 తదుపరి విశాఖ, వర్జ్యం: ఉ.8:40-10:26, దుర్ముహూర్తం: సా.4:39-5:24, అమృతఘడియలు: రా.7:18-9:04, రాహుకాలం: సా.4:30-6:00, సూర్యోదయం:6:48, సూర్యాస్తమయం: 6:10 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



బిజినెస్ ప్లస్

ఎస్‌బీఐ లాభాలు అదుర్స్

క్యూ3లో రూ.21,028 కోట్లు

ముంబై: ఈ ఆర్థిక సంవత్సరం(2025-26)లో డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం(క్యూ3)లో ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ ఆర్థికంగా మంచి పనితీరు కనబరిచింది. ఈ కాలానికి బ్యాంకు అనుబంధ సంస్థలతో కలిసి (కన్సాలిడేటెడ్) రూ.1.85 లక్షల కోట్ల ఆదాయంపై రూ.21,317 కోట్ల నికర లాభం నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25) ఇదే కాలంలో నమోదైన రూ.18,853 కోట్లతో పోలిస్తే బ్యాంకు లాభం 13.06 శాతం పెరిగింది. అనుబంధ సంస్థల ఆర్థిక ఫలితాలను మినహాయించినా (స్టాండలోన్) ఎస్‌బీఐ ఈ క్యూ3లో రూ.1,40,915 కోట్ల ఆదాయంపై రికార్డు స్థాయిలో రూ.21,028 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25) ఇదే కాలంలో నమోదు చేసిన రూ.16,891 కోట్లతో పోలిస్తే ఇది 24.48% ఎక్కువ. అనుబంధ సంస్థ ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ నుంచి రూ.2,200 కోట్లు ప్రత్యేక డివిడెండ్‌గా అందడం క్యూ3లో బాగా కలిసి వచ్చిందని బ్యాంకు చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి చెప్పారు.

ఐసీఏఐ కొత్త ప్రెసిడెంట్‌గా ప్రసన్న కుమార్

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి బిజినెస్): ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) కొత్త ప్రెసిడెంట్‌గా డీ ప్రసన్న కుమార్ ఎన్నికయ్యారు. ఢిల్లీలోని ఐసీఏఐ భవన్‌లో ఈనెల 12న ప్రమాణం స్వీకారం చేయనున్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఆయన ఈ కొత్త బాధ్యతలను చేపట్టనున్నారు. వైజాగ్‌కు చెందిన ప్రసన్న కుమార్.. 1984లో చార్టర్డ్ అకౌంటెన్సీ(సీఏ) పూర్తి చేశారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



8వ తేదీ			
హైదరాబాద్	495	విజయవాడ	515
వరంగల్	497	గోదావరి	485
చిత్తూరు	563	విశాఖపట్నం	490
		డజను గుడ్లు రూ. 75	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	135	విజయవాడ	133
వరంగల్	135	గుంటూరు	128
కరీంనగర్	135	ఒంగోలు	128
మహబూబ్‌నగర్	135	చిత్తూరు	105
కర్నూలు	135	నెల్లూరు	110
విశాఖపట్నం	125	అనంతపురం	110
గోదావరి	133		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,56,600 ▲	1,43,550 ▲	2,80,000 ▲
విజయవాడ	1,62,500 ▲	1,51,000 ▲	2,65,000 ▲
విశాఖపట్నం	1,56,600 ▲	1,40,900 ▲	2,85,000 ▲
రాజమండ్రి	1,56,600 ▲	1,43,550 ▲	2,58,000 ▲
ప్రొద్దుటూరు	1,60,400 ▲	1,47,570 ▲	2,67,000 ▲



2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అనేక పన్ను మార్పులు చోటు చేసుకున్నాయి. మధ్య తరగతికి ఎలాంటి ఉపశమనం లేకపోయినా, పన్నుల విధానంలో పలు మార్పులు చేశారు. ముఖ్యంగా ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆదాయ పన్ను (ఐటీ) చట్టం, 2025 అమల్లోకి వస్తున్నట్టు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. దీంతో ఐటీ రిటర్న్‌ల ఫైలింగ్, వివాదాల పరిష్కారం మరింత సులభం అవుతుందని మంత్రి తెలిపారు. దీనికి తోడు ఈ బడ్జెట్‌లో పేర్కొన్న పది ప్రధాన అంశాలు వ్యక్తిగత, వ్యాపార పన్ను చెల్లింపుదారులను ప్రభావితం చేయనున్నాయి. అవేంటంటే.. ?

వచ్చే ఆర్థిక సంవత్సరంలో పన్ను మార్పులివే..

విదేశాల్లో విద్య, వైద్యం

ఏటా లక్షలాది మంది భారతీయులు విద్య, వైద్యం కోసం విదేశాలకు వెళుతున్నారు. ఇందుకోసం పెద్ద మొత్తంలోనే ఖర్చవుతోంది. ఈ మొత్తాలపై ప్రభుత్వం 5 శాతం టీసీఎస్ వసూలు చేస్తోంది. ఏప్రిల్ 1 నుంచి పన్నును 2 శాతానికి కుదిస్తున్నట్టు ఆర్థిక మంత్రి సీతారామన్ తెలిపారు. డాలర్‌తో రూపాయి మారకం రేటు రోజురోజుకు పతనమవుతున్న ప్రస్తుత తరుణంలో విదేశాల్లోని తమ పిల్లల చదువులు, వైద్య ఖర్చుల కోసం డబ్బులు పంపే వారికి ఇది పెద్ద ఊరటనే చెప్పాలి.

ఎఫ్ అండ్ ఓపై బాదుడు

స్టాక్ మార్కెట్లో స్పెక్యులేషన్ ట్రేడింగ్ విపరీతంగా పెరిగిపోయింది. దీంతో చిన్న, రిటైల్ మదుపరులు సైతం ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌లోకి ప్రవేశించి భారీగా నష్టపోతున్నారు. దీన్ని కట్టడి చేసేందుకు బడ్జెట్‌లో ఈక్విటీ ఫ్యూచర్స్ లావాదేవీలపై విధించే సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ)ను 0.02 శాతం నుంచి 0.05 శాతానికి, ఆప్షన్స్‌పై విధించే ఎస్‌టీటీని 0.1 శాతం నుంచి 0.15 శాతానికి పెంచేశారు. దీంతో ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ భారంగా మారి రిటైల్ మదుపరులు దీనికి దూరమవుతారని ఆర్థిక మంత్రి ఆశ.

ఎన్‌ఆర్‌ఐల నుంచి ఆస్తుల కొనుగోలు

ఇప్పటివరకు దేశ పౌరులు ఎవరైనా ప్రవాస భారతీయుల (ఎన్‌ఆర్‌ఐ) నుంచి ఆస్తులు కొనాలంటే ట్యాక్స్ డిడక్షన్ అండ్ కలెక్షన్ అకౌంట్ నంబర్ (టీఏఎన్) పొందాల్సి వచ్చేది. ఇందుకు చాలా సమయం పట్టి ఆస్తుల రిజిస్ట్రేషన్ కూడా ఆలస్యమయ్యేది. బడ్జెట్‌లో చేసిన మార్పులతో ఇక కొనుగోలుదారు తమ పాన్ నంబరు ద్వారానే ఈ మొత్తాన్ని మినహాయించుకోవచ్చు. ఎన్‌ఆర్‌ఐల ఆస్తులు కొనేవారికి ఈ కొత్త నిబంధన చాలా మేలు చేయనుంది.

విదేశీ ఆస్తుల వెల్లడి

విదేశీ ఆస్తులు, ఆదాయాల వివరాలను బయట పెట్టేందుకు ఆర్థిక మంత్రి తన కొత్త బడ్జెట్‌లో ఆరు నెలల గడువు ఇచ్చారు. చిన్న పన్ను చెల్లింపుదారులు, విద్యార్థులు, ఉద్యోగులు, ఎన్‌ఆర్‌ఐలే లక్ష్యంగా ఆర్థిక మంత్రి ఈ వెసులుబాటు కల్పించారు. వెల్లడించని ఆస్తులు లేదా ఆదాయాల విలువ రూ.కోటి లోపు ఉంటే 30 శాతం ట్యాక్స్, 30 శాతం పెనాల్టీ కట్టి ప్రాసిక్యూషన్ నుంచి తప్పించుకోవచ్చు. పన్ను చెల్లించినప్పటికీ, రిటర్నుల్లో వెల్లడించని ఆస్తులు లేదా ఆదాయాల విలువ రూ.5 కోట్ల వరకు ఉంటే రూ.లక్ష చెల్లించి వాటిని క్రమబద్ధీకరించుకోవచ్చు.

ఐటీఆర్ డెడ్‌లైన్

ఐటీఆర్-1, ఐటీఆర్-2 ఫైలింగ్ డెడ్‌లైన్లలో ఎలాంటి మార్పు లేదు. ఏటా జూలై నెలాఖరు కల్లా ఈ రిటర్న్‌లు ఫైల్ చేయాలి. ఆడిట్ అవసరం లేని చిన్న చిన్న వ్యాపార సంస్థలు, ట్రస్టులు మాత్రం ఆగస్టు నెలాఖరు వరకు ఫైల్ చేయవచ్చు.

సవరించిన ఐటీ రిటర్న్‌ల ఫైలింగ్

చాలా మంది తమ ఐటీ రిటర్న్‌లు ఆలస్యంగా లేదా తప్పులతో ఫైల్ చేస్తుంటారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఇలాంటి పన్ను చెల్లింపుదారులు రిటర్న్ ఫైలింగ్ గడువు ముగిసిన 9 నెలల(డిసెంబరు)లోపు తమ రిటర్న్‌లను లేదా సవరించిన రిటర్న్‌లను కొద్దిపాటి పెనాల్టీ చెల్లించి ఫైల్ చేయవచ్చు. కొత్త ఐటీ చట్టంతో తప్పుల తడకలతో రిటర్న్ ఫైల్ చేసిన వారు ఇక 12 నెలల్లోపు(ఆపై ఏడాది మార్చిలోగా) సవరించిన రిటర్న్ ఫైల్ చేయవచ్చు. ఆలస్యంగా రిటర్నులు దాఖలు చేసేవారికి మాత్రం ఎలాంటి ఊరట లేదు. వీరు గడువు ముగిసిన తొమ్మిది నెలల్లోగా పెనాల్టీతో కలిపి రిటర్నులను ఫైల్ చేయాల్సిందే.

షేర్ల బైబ్యాక్‌లు

షేర్ల బైబ్యాక్‌ల కోసం కంపెనీలు ఖర్చు చేసే మొత్తాన్ని మూలధన లాభాలుగా పరిగణించి కార్పొరేట్ ప్రమోటర్ల మీద 22 శాతం, నాన్-కార్పొరేట్ ప్రమోటర్ల మీద 30 శాతం పన్ను విధించనున్నట్టు ప్రకటించారు. ఇదే సమయంలో వ్యక్తిగత ఇన్వెస్టర్లకు బైబ్యాక్‌లపై వచ్చే లాభాలను వారు ఆ షేర్లను ఉంచుకున్న గడువును బట్టి స్వల్ప లేదా దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను విధించనున్నట్టు ఆర్థిక మంత్రి ప్రకటించారు. దీంతో బైబ్యాక్ ఆఫర్లు తగ్గి పుష్కలంగా లాభాలు ఆర్జిస్తున్న కంపెనీలు ఆ మొత్తాన్ని డివిడెండ్‌లు లేదా కంపెనీల వ్యాపార విస్తరణ కోసం ఖర్చు చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు.

పన్ను చెల్లింపుదారులకు ఊరట

తక్కువ లేదా నిల్ డిడక్షన్ సర్టిఫికెట్ కోసం ప్రస్తుతం కొద్ది మొత్తంలో ఆదాయ పన్ను చెల్లించే వ్యక్తులు అసెసింగ్ అధికారులకు అప్లికేషన్ పెట్టి వారి చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఈ బడ్జెట్‌లో దీనికి ఫుల్‌స్టాప్ పెట్టారు. పన్ను చెల్లింపుదారులు ఇక ఈ సర్టిఫికెట్‌ను కొన్ని నిబంధనలకు లోబడి ఆటోమేటెడ్ పద్ధతిలో తీసుకోవచ్చు. వివిధ కంపెనీలలో షేర్లు, డిబెంచర్లు ఉన్న పన్ను చెల్లింపుదారుల కోసం ఫామ్-15జీ, ఫామ్-15 హెచ్ తీసుకొచ్చారు.

క్రిప్టో కరెన్సీల

క్రిప్టో కరెన్సీల లావాదేవీలను ప్రభుత్వం మరింత కఠినం చేసింది. ఈ వివరాలను ఎప్పటికప్పుడు ట్రేడింగ్ సంస్థలు ప్రభుత్వానికి తెలియజేయాలి. లేకపోతే రోజు రూ.200 చొప్పున జరిమానా పడుతుంది. తప్పుడు వివరాలు సమర్పిస్తే రూ.50,000 వరకు జరిమానా తప్పదు. క్రిప్టో ఆదాయం లెక్కల్లోకి రావడం లేదని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు ఇటీవల హెచ్చరించింది.

ఎస్‌జీబీ రూల్స్

సావరిన్ గోల్డ్ బాండ్స్ (ఎస్‌జీబీ) లాభాలనూ ఆర్థిక మంత్రి మూలధన లాభాల పన్ను పరిధిలోకి తెచ్చారు. ఇక నుంచి ఆర్‌బీఐ జారీ చేసినప్పుడు ఎస్‌జీబీలు కొని, గడువు ముగిసే (మెచ్యూరిటీ) వరకు అలాగే ఉంచుకున్న మదుపరులకు మాత్రమే మూలధన లాభాల పన్ను మినహాయింపు లభిస్తుంది. సెకండరీ మార్కెట్లో కొని లాభాలు పొందిన వారు మాత్రం.. వారు ఆ పెట్టుబడులను ఉంచుకున్న గడువును బట్టి 20 లేదా 12.5 శాతం చొప్పున మూలధన లాభాల పన్ను చెల్లించక తప్పదు.

ప్రపంచ ఇన్వెస్టర్లలో విశ్వాసం నింపే

బలమైన సంకేతం

అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ఇండస్ట్రీ వర్గాలు

న్యూఢిల్లీ: భారత్-అమెరికా మధ్య తాత్కాలిక వాణిజ్య ఒప్పందం కుదరడంపై పారిశ్రామిక వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ ఒప్పందం భారత మార్కెట్‌పై ప్రపంచ పరిశ్రమలు, ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని నింపే బలమైన సంకేతమని వారు అభిప్రాయపడ్డారు. అలాగే, ఎగుమతి వాణిజ్యంలో మన వస్తువుల పోటీతత్వాన్ని పెంచనుందని, ఆధునిక సాంకేతికతను అందుబాటులోకి తేనుందని, సరఫరా వ్యవస్థ స్థితిస్థాపకతకు దోహదపడనుందని ఇండస్ట్రీ వర్గాలు పేర్కొన్నారు.

ప్రపంచంలోని రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థల మధ్య ఆర్థిక సమన్వయ పురోగతిలో ఈ ఒప్పందం కీలక అడుగు. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం సుంకాల తగ్గింపు, నియంత్రణ అవరోధాల తొలగింపుతోపాటు అన్ని రంగాల్లో కొత్త వ్యాపార అవకాశాలకు బాటలు వేయనుంది. ప్రపంచ తయారీ హబ్‌గా భారత్ తన స్థానాన్ని బలోపేతం చేసుకుంటున్న తరుణంలో ఈ ఒప్పందం మన వస్తువుల పోటీతత్వాన్ని పెంచడంతోపాటు ఆధునిక సాంకేతికతను అందుబాటులోకి తేనుంది. సరఫరా వ్యవస్థనూ మెరుగుపరచనుంది.

- అనంత్ గోయెంకా, ఫిక్కీ ప్రెసిడెంట్

భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందాన్ని భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) స్వాగతిస్తోంది. రెండు దేశాల మధ్య సమగ్ర స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) కుదరడానికిది సరైన అడుగు. స్వేచ్ఛాయుత, ఊహించదగిన, నిబంధనల ఆధారిత వాణిజ్యానికి ఇరుదేశాల నిబద్ధత, విధానాల అమరిక, విశ్వాసాన్ని ఈ ఒప్పందం ప్రతిబింబిస్తోంది. ఇది ప్రపంచ పరిశ్రమలు, పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచే బలమైన సంకేతం.

- రాజీవ్ మెమానీ, సీఐఐ అధ్యక్షులు

ఈ ఒప్పందం సాంకేతిక భాగస్వామ్యంలో పురోగతి, తయారీలో నాణ్యత పెంపునకు తోడ్పడటంతోపాటు స్థిరంగా పారిశ్రామిక వృద్ధికి దోహదపడనుంది. ప్రపంచ మార్కెట్లతో మరింత ధీమాగా వాణిజ్యం నెరిపేందుకు కొత్త మార్గాలను తెరవనుంది.

- హర్ష్ సింఘానియా, జేకే పేపర్ సీఎండీ

ద్వైపాక్షిక వాణిజ్య బలోపేతం, తయారీలో సహకారం, రెండు ఆర్థిక వ్యవస్థల మధ్య వస్తు సరఫరా పెంపునకు ఇరు దేశాల నిబద్ధతను ఈ ఒప్పందం ప్రతిబింబిస్తోంది. ఇది మా వాహన విడిభాగాల తయారీ పరిశ్రమలకు సానుకూలం. మా ఉత్పత్తుల పోటీతత్వం పెంచడంతోపాటు సాంకేతికత సహకారాన్ని విస్తృతం చేసుకునేందుకు, ప్రపంచ వాహన విడిభాగాల సరఫరా వ్యవస్థలో విశ్వాసమైన భాగస్వామిగా భారత్ పాత్రను బలపరిచేందుకు ఈ అగ్రిమెంట్ తోడ్పడనుంది.

విక్రమ్‌పతి సింఘానియా, ఆటోమోటివ్ కాంపొనెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు

అమెరికాకు వజ్రాలు, రంగు రాళ్ల ఎగుమతిపై సుంకాల మినహాయింపు కీలక మలుపు. యూఎస్‌కు వీటి ఎగుమతులను పునరుద్ధరించడంతోపాటు మన ఉత్పత్తుల పోటీతత్వాన్ని మెరుగుపరచనుంది. అధిక సుంకాలతో ఇనాళ్లూ ఇబ్బందులెదుర్కొన్న భారత జెమ్స్ అండ్ జువెలరీ ఇండస్ట్రీకిది ఊతమివ్వనుంది. సుంకాల మినహాయింపు జాబితాలో ల్యాబ్‌లో తయారు చేసిన వజ్రాలు, సింథటిక్ జెమ్‌స్టోన్స్‌ను కూడా చేర్చాలని ప్రభుత్వాన్ని మా సమాఖ్య కోరడం జరిగింది.

- కిరీట్ భన్సాలీ, జీజేఈపీసీ చైర్మన్

ఔషధ రంగంలో భారత్- అమెరికా భాగస్వామ్యాన్ని బలపరచడం చాలా ముఖ్యం. ఎందుకంటే, ఔషధాల భద్రత జాతీయ భద్రతలో భాగం.

- సుదర్శన్ జైన్, ఐపీఏ సెక్రటరీ జనరల్

బస్తర్‌లో అభివృద్ధికి కొత్త శకం

- మావోయిస్టులపై ప్రభుత్వ చర్యలతో భయం, అవిశ్వాసం తొలగిపోయాయి
- 'బస్తర్ పండుమ్'లో రాష్ట్రపతి ముర్ము



బస్తర్ పండుమ్‌లో ఆదివాసీలతో రాష్ట్రపతి ముర్ము

జగదల్‌పూర్ (ఛత్తీస్‌గఢ్), ఫిబ్రవరి 7: మావోయిస్టులకు వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాత్మక చర్యల వల్ల బస్తర్ ప్రాంతంలో భయ వాతావరణం, అవిశ్వాసం తొలగిపోయాయని, అభివృద్ధికి కొత్త శకం ప్రారంభమైందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా జగదల్‌పూర్‌లో మూడు రోజుల పాటు జరిగే 'బస్తర్ పండుమ్' వేడుకలను రాష్ట్రపతి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముర్ము మాట్లాడుతూ.. హింసను వీడి, ప్రధాన స్రవంతిలో కలిసిన వారు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని విశ్వసించాలని, అదే విధంగా శాంతి మార్గంలో పయనించకుండా పక్కదారి పట్టించే ప్రయత్నాలకు లోనుకావొద్దని సూచించారు. 'బస్తర్ సహజ అందాలు, అద్భుతమైన సాంస్కృతిక సంపద ప్రజలను ఎల్లప్పుడూ ఆకర్షించాయి. అయితే దురదృష్టవశాత్తూ ఈ ప్రాంతం దశాబ్దాల పాటు మావోయిజం ముప్పు కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంది' అని పేర్కొన్నారు. నక్సలిజం యువత, గిరిజనులు, దళితులకు తీవ్ర నష్టం చేకూర్చిందన్నారు. మావోయిస్టు కార్యకలాపాలతో సంబంధం ఉన్నవారు ఇప్పుడు హింసను వీడుతున్నారని, శాంతి మార్గంలో పయనిస్తున్నారని చెప్పారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను తీసుకొచ్చిందని పేర్కొంటూ.. 'నియాద్ నెల్లనార్' అనే కార్యక్రమాన్ని ఈ సందర్భంగా రాష్ట్రపతి ప్రశంసించారు. గ్రామాల్లో విద్యుత్తు, రోడ్లు, తాగునీటి సదుపాయాలు కల్పించడంతో పాటు ఏళ్లుగా మూడపడిన పాఠశాలలు తెరుచుకుంటున్నాయని చెబుతూ.. 'ఇది చాలా సంతోషకరమైన దృశ్యం' అని పేర్కొన్నారు. ఒడిశాలోని ఒక చిన్న గ్రామానికి చెందిన తాను రాష్ట్రపతిగా మీ ముందు మాట్లాడుతున్నానని, ఇదే భారత ప్రజాస్వామ్య బలమని పేర్కొన్నారు.

ముంబై మేయర్‌గా రీతూ తావడే!

- బీజేపీ కార్పొరేటర్‌ను ఎంపిక చేసిన మహాయుతి
- ప్రకటించిన అమిత్ షా.. 11న ఎన్నిక



ముంబై మేయర్ అభ్యర్థిగా నామినేషన్ సమర్పిస్తున్న రీతూ

ముంబై, ఫిబ్రవరి 7: ముంబై మేయర్ అభ్యర్థిగా మహారాష్ట్రలోని అధికార మహాయుతి కూటమి రీతూ తావడేను ఎంపిక చేసింది. బీజేపీ నుంచి కార్పొరేటర్‌గా గెలిచిన ఆమె పేరును కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. బీజేపీ నుంచి మేయర్ అభ్యర్థిగా రీతూ తన నామినేషన్‌ను శనివారం అధికారులకు సమర్పించారు. ఫిబ్రవరి 11న ముంబై మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలు జరగనున్నాయి. డిప్యూటీ మేయర్‌గా శివసేనకు చెందిన సంజయ్ శంకర్‌ను ఎంపిక చేశారు. ఆయన కూడా శనివారం తన నామినేషన్‌ను సమర్పించారు. బృహన్‌ముంబై కార్పొరేషన్(బీఎంసీ)లో మొత్తం 227కార్పొరేటర్ స్థానాలు ఉన్నాయి. జనవరిలో ఈ కార్పొరేషన్‌కు జరిగిన ఎన్నికల్లో బీజేపీకి 89స్థానాలు, శివసేనకు 29స్థానాలు మొత్తం 118 సీట్లు(సగం కన్నా ఎక్కువ) వచ్చాయి. దీంతో, ఈ కూటమి అభ్యర్థే మేయర్, డిప్యూటీ మేయర్ అవుతారు. తద్వారా ముంబైకి మొట్టమొదటిసారి బీజేపీ నుంచి మేయర్ రానున్నారు. 1997నుంచి ముంబైలో శివసేన పార్టీకి చెందినవారే మేయర్‌గా ఉంటున్నారు. ఆ పార్టీ నుంచి మేయర్ అభ్యర్థి లేకపోవడం గడిచిన పాతికేళ్లలో ఇదే మొదటిసారి కావడం విశేషం. రీతూ మూడుసార్లు కార్పొరేటర్‌గా గెలిచారు. 2012లో బీజేపీలో చేరారు. గతంలో బృహన్‌ముంబై మునిసిపల్ కార్పొరేషన్(బీఎంసీ) ఎడ్యుకేషన్ కమిటీ చైర్‌పర్సన్‌గా కూడా పనిచేశారు. ఇక, శివసేనలో డిప్యూటీ మేయర్ పదవిని నలుగురు పంచుకునేలా అంతర్గతంగా ఒప్పందం జరిగింది. ఇందులో భాగంగా సంజయ్ శంకర్ మొదటి 15నెలలు డిప్యూటీ మేయర్‌గా ఉంటారు. ఇదిలా ఉండగా, 25ఏళ్లుగా ముంబైని ఏలిన శివసేన(ఉద్ధవ్) పార్టీకి ఈ ఎన్నికల్లో 65సీట్లు మాత్రమే వచ్చాయి. బీఎంసీ దేశంలోనే అత్యంత ధనికమైన కార్పొరేషన్. దీని బడ్జెట్ రూ.74,450కోట్లు కావడం విశేషం.

ద్రావిడ భాషా సంస్కృతులను కాపాడుకోవాలి

- సాహితీవేత్త ప్రొ. కాత్యాయనీ విద్మహే పిలుపు
- కర్నూలులో మొదలైన ప్ర.ర.వే. 8వ రాష్ట్ర మహాసభలు



కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాది ఆర్య భాషా సంస్కృతుల ఆధిపత్యం నుంచి దక్షిణాది రాష్ట్రాల ప్రజలు తమ అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నదని ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక (ప్ర.ర.వే.) నాయకురాలు ప్రొ. కాత్యాయనీ విద్మహే అన్నారు. దీనికోసం ద్రావిడ భాషా సంస్కృతుల వ్యాప్తికి ఉద్యమించాలని కోరారు. కర్నూలు నగరంలో శనివారం మొదలైన ప్ర.ర.వే 8వ రాష్ట్ర మహాసభల్లో ఆమె మాట్లాడారు. మహాసభల లక్ష్యాలను సభికులకు వివరించారు. ద్రావిడ భాషా సంస్కృతుల పరిరక్షణే లక్ష్యంగా ఉద్యమ నిర్మాణంలో భాగం కావాలని పిలుపునిచ్చారు. ప్రముఖ రచయిత, పరిశోధకుడు కల్లూరి భాస్కరం మాట్లాడుతూ, దేశంలో వేగంగా జరుగుతున్న పరిణామాలను అర్థం చేసుకోవాలంటే ప్రపంచ చరిత్రను వస్తుగతంగా పరిశీలించాల్సి ఉంటుందన్నారు. భాష, సాంస్కృతికపరంగానే కాకుండా, రాజకీయంగానూ ద్రావిడ భావజాలం ఎదగాలని ఆకాంక్షించారు. అన్య భాషల ప్రమేయంతో ద్రావిడ జాతి మనుడగకు ప్రమాదం ఏర్పడే పరిస్థితి ఉందని కల్లూరి భాస్కరం ఆందోళన వ్యక్తం చేశారు. 'ఆంధ్రజ్యోతి' పూర్వ సంపాదకుడు కె. శ్రీనివాస్ మాట్లాడుతూ, దక్షిణ దేశంలో ఎన్నో లిపిలేని భాషలపై పరిశోధనలు జరుగుతున్నాయని, చరిత్రను సరికొత్తగా అధ్యయనం చేయాల్సిన అవసరాన్ని ఈ ప్రయత్నాలు సూచిస్తున్నాయని పేర్కొన్నారు. 'ఆధునిక ద్రావిడ భాషా సాహిత్యాలు - సంస్కృతులు' అనే అంశంపై సామాజికవేత్త జి.భార్గవ, కవి గూండ్ల వెంకట నారాయణ మాట్లాడారు. ఈ సభలో 'అంబేడ్కర్' పుస్తకాన్ని కవి జి. వెంకటకృష్ణ ఆవిష్కరించగా, సాహిత్య విమర్శకుడు మెట్టు రవీందర్ పరిచయం చేశారు.

స్వీడన్ అందగత్తె కావాలా?

- అలాగే.. ఏర్పాటు చేసేయ్!
- అనిల్ అంబానీ-ఎప్‌స్టీన్‌ల మధ్య చర్చ.. నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: జెఫ్రీ ఎప్‌స్టీన్ డాక్యుమెంట్లలో భారతదేశానికి చెందిన ప్రముఖ వ్యాపార వేత్త అనిల్ అంబానీ పేరు కూడా వెలుగు చూసింది. 2017-19 మధ్య ఇరువురి మధ్య బలమైన చర్చలు, భేటీలు కూడా జరిగినట్టు ఎప్‌స్టీన్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అమెరికా న్యాయ విభాగం విడుదల చేసిన ఎప్‌స్టీన్ నివేదికలో స్వీడన్ అందగత్తెల గురించిన ప్రస్తావనతోపాటు బాలీవుడ్ భామల గురించి కూడా ఉండడం గమనార్హం. "స్వీడన్ అందగత్తె కావాలా?" అని ఎప్‌స్టీన్ మెసేజ్ చేయగా కేవలం 20 సెకన్ల వ్యవధిలోనే అనిల్ అంబానీ స్పందించి.. "అలాగే, ఏర్పాటు చేసేయ్!." అని సమాధానమిచ్చారు. అదే విధంగా ఎప్‌స్టీన్‌పై సెక్స్ కుంభకోణం అభియోగాలు నమోదై.. జైలుకు వెళ్లే వరకు అనిల్‌తో 2017-19 మధ్య.. అనేక సందేశాలు కొనసాగాయి. ఇరువురు ప్రపంచ పరిణామాలు, వ్యాపారాలతోపాటు.. మహిళల గురించి విస్తృతంగా చర్చించుకున్నారు. 2017, మార్చి 9న జరిగిన సంభాషణలో "మీరు ఎవరిని సజెస్ట్ చేస్తారు?." అని అనిల్ ప్రశ్నించగా.. ఎప్‌స్టీన్.. "ఓ పొడవాటి, అందమైన స్వీడిష్ మహిళ. ఎంతో మైమరపిస్తుంది." అని బదులిచ్చారు. దీనికి కేవలం 20 సెకన్ల వ్యవధిలోనే అనిల్ స్పందిస్తూ.. "ఏర్పాటు చేయ్!." అని పేర్కొన్నారు. అంబానీ కుటుంబానికి చెందిన పలు పుస్తకాలను కూడా ఎప్‌స్టీన్ ఆర్డర్ చేయడం గమనార్హం. అదేవిధంగా 2018లో అనిల్-ఎప్‌స్టీన్‌లు ప్యారిస్‌లో కలుసుకోవాలని భావించారు. కానీ, ఆ పర్యటన నిలిచిపోయింది. 2019లో తాను న్యూయార్క్‌కు వస్తున్నట్టు అనిల్ చెప్పగా.. ఎప్‌స్టీన్ ఆయనను ఆహ్వానించారు. అంతేకాదు, "న్యూయార్క్‌లో మీరు రహస్యంగా ఎవరినైనా కలవాలని అనుకుంటే నాకు చెప్పండి." అని ఎప్‌స్టీన్ వ్యాఖ్యానించారు. ఇక, ఇరువురు కూడా మన్‌హాట్టన్‌లోని ఎప్‌స్టీన్ ఇంట్లో భేటీ అయ్యారు.




www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



ఆదివారం | 8-2-2026

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal |Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

గుంటూరు సిటీ



క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జితేంద్రసింగ్, మంత్రి లోకేశ్, కేంద్ర మంత్రి పెమ్మసాని, వివిధ సంస్థల ప్రతినిధులు

క్వాంటమ్ గేమ్ చేంజర్

తొలి కంప్యూటింగ్ వ్యవస్థ అమరావతిలో

- డిసెంబరు నాటికి తొలి 'కంప్యూటర్' చేతికి
- దీంతో 35-40 ఏళ్లపాటు యువత భవిత బంగారమే
- కేవలం క్వాంటమ్‌కు మాత్రమే కాదు, లక్షల్లో నిపుణుల తయారీకీ నాంది పలుకుతున్నా
- క్వాంటమ్‌లో నోబెల్ తెస్తే 100 కోట్ల నజరానా: సీఎం
- అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ భవనాలకు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి శంకుస్థాపన
- 15 ప్రముఖ సంస్థలతో ఎంవోయూలు

11

త్వరలోనే క్వాంటమ్‌లో ఎంటెక్ కోర్సులు

రూ.6 వేల కోట్లతో నేషనల్ క్వాంటమ్ మిషన్: జితేంద్ర సింగ్

హైదరాబాద్‌లో ఐటీకి ప్రాధాన్యం ఇచ్చి హైటెక్ సిటీ ప్రారంభించాం. అది ఓ గేమ్ చేంజర్‌గా మారింది. అత్యున్నత ఫలితాలను ఇస్తోంది. ఇప్పుడు అమరావతిలో క్వాంటమ్ వ్యాలీని నిర్మిస్తున్నాం. ఇది కూడా ఒక విప్లవంగా మారుతుంది. - సీఎం చంద్రబాబు

'కల్తీ'లో హవాలా



తిరుమల నెయ్యి వ్యవహారంలో కొత్త కోణం

మాఫియా రాకెట్‌ను తలదన్నేలా హవాలా డీల్స్

- భోలే బాబా నుంచి విడతలవారీగా మళ్లింపు
- అందులో కొంత తిరిగి భోలే బాబాకు
- ఢిల్లీ, బెజవాడ, గ్వాలియర్, చెన్నై మీదుగా తిరుపతికి చేరిన 21 కోట్ల సొమ్ము
- వైష్ణవి సీఈవో చావ్డాకు 19.86 కోట్లు
- అక్కడి నుంచి ఎక్కడికి వెళ్లిందో?
- మంగళం దగ్గరే మంగళం పాడేశారు
- అంతిమ లబ్ధిదారుడెవరో కనిపెట్టని సిట్
- కమీషన్ ఏజెంట్ శ్రీనివాసన్‌కు 31 లక్షలు
- టీటీడీ డెయిరీ నిపుణుడు విజయభాస్కర్‌రెడ్డికి 75 లక్షలు.. ఇందులో 34 లక్షలు సిట్ సీజ్

● తమ తరఫున టీటీడీకి కల్తీనెయ్యి సరఫరా చేసినందుకు భోలే బాబా డెయిరీ నిర్వాహకులు రూ.19.86 కోట్లను హవాలా మార్గంలో వైష్ణవి డెయిరీ సీఈవో అపూర్వ చావ్డాకు పంపారు. తిరుపతిలోని మంగళం ఏరియాలో ఉన్న ఆయన ఇంటికి ఈ సొమ్ము చేరింది. తొలుత డబ్బును ఢిల్లీలో హవాలా ఏజెంట్ ఆశిష్ అగర్వాల్‌కు, ఆయన నుంచి మరో ఏజెంట్ పటేల్ లాలా భాయ్‌కు చేర్చగా.. లాలా భాయ్ ఆ నగదును తన మరో ముగ్గురు ఏజెంట్లకు చేర్చి వారి ద్వారా విడతల వారీగా చావ్డాకు పంపించారు. సిట్ ఇంత వరకే నిర్ధారించినట్లు తెలిసింది.

● నిజానికి టీటీడీకి నెయ్యి సరఫరా చేసినందుకు బిల్లులు దేవస్థానం నుంచే వైష్ణవి డెయిరీకి వచ్చాయి. కానీ డబ్బులు భోలే బాబా నుంచి హవాలా మార్గంలో వైష్ణవి డెయిరీ సీఈఓ చావ్డాకు చేరాయి. అంటే.. తెరవెనక ఆ డబ్బులు ఎవరి కోసమో పంపించారన్నది స్పష్టం. తిరుపతి దాకా చేరిన రూ.19.86 కోట్లు ఆ తర్వాత ఎక్కడికి వెళ్లాయి? ఆ డబ్బును చావ్డా ఎవరికి అందించారు? ఆ అంతిమ లబ్ధిదారుడు ఎవరు? అన్నది మిస్టరీగా మారింది. హవాలాతో సంబంధం లేకుండా నాటి టీటీడీ చైర్మన్ వైవీ పీఏ చిన్న అప్పన్న ఖాతాలో రూ.4.6 కోట్లు వచ్చిపడ్డాయి. ఆయనకంటే 'పెద్దవారికి' ఇచ్చేందుకు పెద్ద మొత్తంలో డబ్బును చావ్డాకు పంపించారా? ఈ ప్రశ్నకు సమాధానం కనిపెట్టాల్సింది సీబీఐ నేతృత్వంలోని సిట్‌నే.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారం ఓ అంతులేని కథలా సాగుతోంది! పాలే లేకుండా నెయ్యి తయారుచేసి దాదాపు రూ.250 కోట్ల విలువైన 60 లక్షల కిలోలు సరఫరా చేసిన కుట్రలో విస్తుపోయే నిజాలు వెల్లడవుతున్నాయి. తిరుమల శ్రీవారి ప్రసాదం లడ్డూలో కల్తీ నెయ్యి కుట్రలో హవాలా రాకెట్ బట్టబయలైంది. కల్తీ చేసిన నెయ్యిని టీటీడీకి అంటగట్టడంలో జరిగిన అక్రమాలను సీబీఐ సిట్ నిగ్గు తేల్చింది. కల్తీ నెయ్యిని సరఫరా చేయాలన్న ముందస్తు కుట్రను అమలు చేసి తద్వారా వచ్చిన సొమ్మును హవాలా మార్గంలో నడిపించి

మిగతా 12వ పేజీలో...



ముదురుతున్న ఫెవికాల్ బంధం!



కొత్త పలుకు

ఆర్కే విశ్లేషణ 2లో

తమ రాజకీయ ప్రత్యర్థులు అధికారంలో ఉన్నప్పుడే అటు జగన్ రెడ్డికి గానీ, ఇటు కేసీఆర్‌కు గానీ తమ ప్రాంత ప్రయోజనాలు గుర్తుకొస్తాయి.

రాయలసీమ ఎత్తిపోతల పథకం కోసం ఆందోళన మొదలెట్టిన జగన్ రెడ్డిని కేసీఆర్ అండ్ కో పల్లెత్తు మాట అనకపోవడానికి కారణం ఏమిటి? చంద్రబాబును తిడుతున్నట్టుగా జగన్ రెడ్డిని తెలంగాణ ద్రోహి అని ఒక్క రోజైనా విమర్శించారా? నిజానికి రాయలసీమ ఎత్తిపోతల పథకం వల్ల శ్రీశైలం జలాల్లో తెలంగాణకు నష్టం జరిగే అవకాశం ఉంది. చంద్రబాబు ప్రతిపాదిస్తున్న నల్లమలసాగర్ వల్ల తెలంగాణకు కలిగే నష్టం ఏమీ ఉండదంటున్నారు. అయినా గోదావరి జలాలను అక్రమంగా తరలించుకుపోతారా అని బీఆర్ఎస్ నాయకులు విమర్శిస్తున్నారు.

ఈ రెండు పార్టీలకూ చెందిన సోషల్ మీడియా విభాగాలు కూడా కలసికట్టుగా పనిచేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ రెడ్డికి మద్దతుగా బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలు రంగంలోకి దిగుతున్నారు. తెలంగాణలో కేసీఆర్‌కు కష్టం వస్తే వైసీపీ సోషల్ మీడియా రక్షణగా నిలబడుతోంది.

రాయలసీమ ప్రజలను రెచ్చగొట్టడం కోసం స్కెచ్ సిద్ధం చేస్తూనే మిగతా జిల్లాలలో కులాల కుంపట్లను రాజేయడం మొదలుపెట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కమ్మ-కాపు కులాల మధ్య విద్వేష బీజాలు నాటింది కూడా ఆ కుటుంబమే. దాదాపు మూడున్నర దశాబ్దాల తర్వాత ఈ రెండు కులాల వారూ ఒకే రాజకీయ వేదిక పంచుకుంటున్నారు. సహజంగానే ఇది జగన్ రెడ్డి కడుపు మంటకు కారణం అవుతోంది. కమ్మ-కాపులది డెడ్లీ కాంబినేషన్. ఈ కాంబినేషన్‌కు ఇప్పుడు బీసీలు, మాదిగలు, ముస్లింలు జత కలిశారు.

పవన్ కల్యాణ్ తెలుగుదేశంతో జట్టు కట్టకుండా అడ్డుకోవడం కోసం ఎన్నికలకు ముందు జగన్ రెడ్డి చెయ్యని ప్రయత్నం లేదు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమిలో విభేదాలు రాకపోతాయా అని ఏడాదిన్నరగా ఎదురుచూశారు. అలాంటి సంకేతాలు కనిపించకపోగా కనీసం మరో పదిహేనేళ్లపాటు కూటమి ఐక్యంగా ఉంటుందని, రాష్ట్ర భవిష్యత్ కోసం అది అవసరమని పవన్ కల్యాణ్ పదే పదే ప్రకటిస్తున్నారు. దీంతో కాపులను పవన్ కల్యాణ్ నుంచి దూరం చేయడానికి జగన్ అండ్ కో వ్యూహ రచనకు శ్రీకారం చుట్టారు.

తమ వ్యూహాన్ని అమలు చేయడానికి అనువైన సమయం కోసం ఎదురుచూస్తూ వచ్చారు. అంబటి రాంబాబు రూపంలో అటువంటి అవకాశం వచ్చిందని భావించి తమ వ్యూహాన్ని అమలు చేయడం మొదలెట్టారు.



మంటల్లో దగ్ధమవుతున్న బస్సు

మరో ట్రావెల్స్ బస్సు 'టెర్రర్'!

- హైదరాబాద్ నుంచి వస్తున్న ఏసీ స్లీపర్ బస్సు ఇంజిన్‌లో పొగలు, మంటలు
- సైడ్ మిర్రర్ నుంచి గమనించిన డ్రైవర్, క్లీనర్
- ప్రయాణికులను అప్రమత్తం చేసి దించేసిన సిబ్బంది
- ఆ వెంటనే మంటల్లో దగ్ధమైన బస్సు
- 39 మంది ప్రయాణికులు సురక్షితం
- ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల వద్ద ఘటన

10

వాడేది బీఎండబ్ల్యూ కారు.. చేసేవి చోరీలు!

- విశాఖ, కాకినాడ, రాజమండ్రిల్లో 62 దొంగతనాలు
- రూ.కోటి విలువైన చోరీ సొత్తు స్వాధీనం
- విశాఖలో ఇల్లాలు, హైదరాబాద్‌లో ప్రియురాలు.. దొరికింది విశాఖలో..

10

సాగుకు, పాడికి రక్షణ



ఒప్పందం వివరాలు వెల్లడిస్తున్న మంత్రి పీయూష్

అమెరికా గోధుమలు, బియ్యం సహా ప్రధాన వ్యవసాయ ఉత్పత్తులపై భారత సుంకాలు కొనసాగింపు

- ఆ దేశ పాడి ఉత్పత్తుల దిగుమతులకు నిరాకరణ
- కిలో రూ.100, ఆపై ధర ఉన్న యాపిల్స్‌కే అనుమతి
- అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఖరారు
- రష్యా చమురు కొనుగోలు నిలిపివేత హామీతో 25% అదనపు సుంకాలు తొలగించిన అమెరికా
- భారత్‌పై సుంకాలు 18 శాతానికి తగ్గింపు

న్యూఢిల్లీ/ వాషింగ్టన్, ఫిబ్రవరి 7: భారత్-అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఖరారైంది. ఒప్పందంలోని కీలక అంశాల (ఫ్రేమ్‌వర్క్)తో ఇరుదేశాల సంయుక్త ప్రకటన శనివారం విడుదలైంది. అమెరికా నుంచి చవకగా వ్యవసాయ, పాడి ఉత్పత్తులు భారీగా వచ్చిపడతాయన్న ఆందోళనకు చెక్‌పడింది. ఈ రంగాలకు చెందిన చాలా ఉత్పత్తుల దిగుమతులపై భారత్‌కే నియంత్రణ ఉండేలా ఒప్పందంలో విధివిధానాలు ఖరారయ్యాయి. అమెరికాతో

మిగతా 9వ పేజీలో...

భారత్, అమెరికాలకు శుభవార్త

మహిళలు, యువతకు ఉపాధి పెరుగుతుంది: ప్రధాని మోదీ

9

నరేందర్.. సరెండర్

- అమెరికాకు ప్రధాని లొంగుబాటు
- ఒప్పందంతో తీవ్ర నష్టం: కాంగ్రెస్

అమెరికా విడుదల చేసిన భారత మ్యాప్‌లో పీవోకే, అక్సాయ్ చిన్



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

ముదురుతున్న ఫెవికాల్ బంధం!

ఆంధ్రప్రదేశ్‌లో ఇంకా మొదలవలేదేమిటా అని అనుకుంటున్నామో లేదో మొదలెట్టేశారు. రాయలసీమకు అన్యాయం జరుగుతోందనీ, సీమ ఎడారి అవుతోందనీ కొన్ని గొంతులు ఆనవాయితీ ప్రకారం నిందించడం మొదలెట్టాయి. ఆ కుటుంబం అధికారంలో ఉంటే సీమ పచ్చగా మారిపోతుంది. అధికారం పోగానే సీమ ఎడారి అయిపోతుంది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో కులాల కుంపట్లు రాజుకుంటున్నాయి. ఇది కూడా ఆ కుటుంబం అధికారంలో లేనప్పుడే. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని వెంటనే ప్రారంభించకపోతే సీమ ఏమైపోవాలి అంటూ వైసీపీ ఆధ్వర్యంలో రెండు రోజుల క్రితం కర్నూలులో ఒక సభ నిర్వహించారు. ఎన్జీటీ ఆదేశాల వల్ల ఈ పథకం 2020లో జగన్మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడే ఆగిపోయింది. ఆ తర్వాత నాలుగేళ్లపాటు అధికారంలో ఉన్నప్పటికీ జగన్‌రెడ్డి దాని గురించి పట్టించుకోలేదు. ఇప్పుడు అధికారం కోల్పోగానే ఆ పథకం గుర్తుకు వచ్చింది. ఇంకేముందీ, ఆ కుటుంబం కోసం పనిచేసే కొంత మంది రాయలసీమ మోతుబరులు స్వరాలు సవరించుకుంటున్నారు. సీమకు అన్యాయం చేస్తారా? అంటూ గొంతు విప్పే పనిలో ఉన్నారు. ఇక్కడ కీలకమైన మరో అంశం కూడా ఉంది. జగన్‌రెడ్డి కోసం రాయలసీమకు చెందిన మోతుబరులే కాకుండా తెలంగాణకు చెందిన బీఆర్ఎస్ కూడా పనిచేస్తుంటుంది. రాయలసీమ ఎత్తిపోతల పథకం చేపట్టడం ద్వారా కృష్ణా జలాలను అక్రమంగా తరలించుకుపోతున్నారని భారత రాష్ట్ర సమితి గతంలో విమర్శించింది. ఇప్పుడు రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి కూడబలుక్కొని తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ నిర్వహించిన పోరుబాట గురించి భారత రాష్ట్రసమితి పట్టించుకోలేదు. తెలంగాణకు ద్రోహం చేయాలనుకోవడం ఏమిటి? అని జగన్‌రెడ్డిని నిలదీయలేదు. తెలుగుదేశం పార్టీ లేదా మరో పార్టీ ఈ పని చేసి ఉంటే బీఆర్ఎస్ నాయకులు నోటికి పనిచెప్పేవారు. కేసీఆర్ పత్రికలో గుండెలు బాదుకొనేవారు. వైసీపీ నిర్వహించిన సభ గురించి కేసీఆర్ పత్రికలో ఒక్క వార్త కూడా రాయలేదు. ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ఏ కార్యక్రమాన్ని చేపట్టినా తెలంగాణ ఎడిషన్‌లో కూడా ప్రముఖంగా ప్రచురించే జగన్‌రెడ్డి రోత మీడియాలో కూడా ఈ వార్త కనిపించలేదు. అంటే ఆంధ్రప్రదేశ్‌లో తాము చేసే రాజకీయాల వల్ల తెలంగాణలో బీఆర్ఎస్‌కు ఇబ్బంది కలగకూడదు అని జగన్ అండ్ కో భావిస్తున్నారన్నమాట! అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డి తన రాజకీయ ప్రయోజనం కోసం చేపట్టే కార్యక్రమాలను కేసీఆర్ సొంత మీడియా కప్పిపెడుతోంది. అంటే తెలంగాణ ప్రయోజనాల కన్నా జగన్‌రెడ్డి ప్రయోజనాలే కేసీఆర్ అండ్ కోకు ముఖ్యమని అర్థమవుతోంది. తమ రాజకీయ ప్రత్యర్థులు అధికారంలో ఉన్నప్పుడే అటు జగన్‌రెడ్డికి గానీ, ఇటు కేసీఆర్‌కు గానీ తమ ప్రాంత ప్రయోజనాలు గుర్తుకొస్తాయి. వారు అధికారంలో ఉంటే మాత్రం తమ ప్రాంత ప్రయోజనాలు పట్టవన్నమాట! రాయలసీమ ఎత్తిపోతల పథకం కోసం ఆందోళన మొదలెట్టిన జగన్‌రెడ్డిని కేసీఆర్ అండ్ కో పల్లెత్తు మాట అనకపోవడానికి కారణం ఏమిటి? చంద్రబాబును తిడుతున్నట్టుగా జగన్‌రెడ్డిని తెలంగాణ ద్రోహి అని ఒక్క రోజైనా విమర్శించారా? నిజానికి రాయలసీమ ఎత్తిపోతల పథకం వల్ల శ్రీశైలం జలాల్లో తెలంగాణకు నష్టం జరిగే అవకాశం ఉంది. చంద్రబాబు ప్రతిపాదిస్తున్న నల్లమలసాగర్ వల్ల తెలంగాణకు కలిగే నష్టం ఏమీ ఉండదంటున్నారు. పోలవరం నుంచి సముద్రంలో కలిసే వరద జలాలను వినియోగించుకోవడానికి నల్లమల సాగర్‌ను చంద్రబాబు ప్రతిపాదించారు. అయినా గోదావరి జలాలను అక్రమంగా తరలించుకుపోతారా అని బీఆర్ఎస్ నాయకులు విమర్శిస్తున్నారు. సముద్రంలో కలిసే జలాలను వాడుకుంటే తప్పేమిటి అని కేంద్ర జల సంఘం చైర్మన్ కూడా ప్రశ్నించడం గమనార్హం. నీళ్ల రాజకీయాలు తెలుగు నాట ఎప్పటి నుంచో ఉన్నాయి. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాయలసీమ కోసం తెలుగు గంగ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టగా, మిగులు జలాల ఆధారంగా కాకుండా నికర జలాల ఆధారంగానే ఆ పథకాన్ని చేపట్టాలని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అప్పట్లో నానా యాగీ చేశారు. అప్పటి నుంచి ఆ కుటుంబానికి అధికారం దూరం కాగానే రాయలసీమతో పాటు కులాల కుంపట్లు గుర్తుకు వస్తాయి. తెలంగాణ రాష్ట్రం విడిపోయిన తర్వాత గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోవడం కోసం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారు. దీనిపై ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న చంద్రబాబు గానీ, జగన్‌రెడ్డి గానీ అభ్యంతరం చెప్పలేదు. ఎందుకంటే, దుమ్ముగూడెం తర్వాత దిగువకు ప్రవహించే గోదావరి జలాల ఆధారంగానే పోలవరం నిర్మితమవుతోంది. ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి వచ్చే ఈ వరద జలాలను తెలంగాణ వినియోగించుకోలేదు. వినియోగించుకున్నా పోలవరం ప్రాజెక్టుకు ఇబ్బంది లేదు. ఎందుకంటే ప్రతి ఏటా కొన్ని లక్షల క్యూసెక్కుల నీరు గోదావరి దిగువన సముద్రంలో కలుస్తుంది. అయినా ఇటు కేసీఆర్, అటు జగన్‌రెడ్డి అధికారం కోల్పోయినందున నీటి రాజకీయాలకు తెరలేపారు. తెలంగాణ ప్రజల దృష్టిలో చంద్రబాబును దోషిగా చిత్రీకరించాలని కేసీఆర్, రాయలసీమ ప్రజల దృష్టిలో చంద్రబాబును ద్రోహిగా చిత్రీకరించాలని జగన్‌రెడ్డి ఎత్తుగడలు సిద్ధం చేసుకొని పరస్పర సహకారంతో అమలు చేస్తున్నారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మధ్య వైరం ముదురుతుండగా.. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు, జగన్‌రెడ్డి మధ్య మొదటి నుంచీ వైరం ఉంది. ఈ క్రమంలో తమ ప్రత్యర్థులను ఉమ్మడిగా ఎదుర్కోవాలని కేసీఆర్, జగన్‌రెడ్డి నిర్ణయించుకున్నారు. ఈ రెండు పార్టీలకూ చెందిన సోషల్ మీడియా విభాగాలు కూడా కలసికట్టుగా పనిచేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డికి మద్దతుగా బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలు రంగంలోకి దిగుతున్నారు. తెలంగాణలో కేసీఆర్‌కు కష్టం వస్తే వైసీపీ సోషల్ మీడియా రక్షణగా నిలబడుతోంది. రాజకీయ ప్రత్యర్థులపై ఉమ్మడిగా దాడి చేస్తున్నారు. తెలంగాణ రాజకీయాలతో చంద్రబాబుకు ఏమి పని అని ప్రశ్నిస్తున్న కేసీఆర్ అండ్ కో, ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో ఎందుకు వేలుపెడుతున్నారో వారికే తెలియాలి. తెలంగాణలో జల రాజకీయాలను బీఆర్ఎస్ ముమ్మరం చేయగా, రాయలసీమ హక్కుల పేరిట జల రాజకీయాలకు వైసీపీ తెరలేపింది. రాజకీయంగా కష్టం వచ్చినప్పుడల్లా తెలంగాణను రక్షణ కవచంగా కేసీఆర్ అండ్ కో ఎలా వాడుకొనే ప్రయత్నం చేస్తున్నారో ఆంధ్రప్రదేశ్‌లో అధికారం పోగానే వైఎస్ కుటుంబం కూడా రాయలసీమను అలా రక్షణ కవచంగా వాడుకుంటూ వస్తోంది. ఇద్దరిదీ ఒకే దారి.

> బూతు భాష అధికారిక భాషగా మారడం ఏమిటి? రేపటి తరానికి ఏమి నేర్పుతున్నాం? జగన్‌రెడ్డి రాజకీయ అరంగేట్రానికి ముందు రాజకీయాల్లో ఇలాంటి ముతక భాష అంతగా వినిపించేది కాదు. పేర్ని నాని, జోగి రమేశ్, అంబటి రాంబాబు వంటి వారు కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు ఇలాంటి ముతక భాష వాడిన దాఖలాలు పెద్దగా లేవు. ఇప్పుడు వారు నోరు తెరిస్తే బూతులు ప్రవహిస్తున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు బూతులు మాత్రమే మాట్లాడిన కొడాలి నాని ఇప్పుడు ఎక్కడ ఉంటున్నారో తెలియదు. అలాంటి వారి దుస్థితి గమనిస్తూ కూడా కొంత మంది వైసీపీ నాయకులు ఇప్పటికీ వైఖరి మార్చుకోకపోవడం వింతగా ఉంది.

కాపులను దూరం చేయడమే లక్ష్యం!

ఆంధ్రప్రదేశ్‌లో అధికార మార్పిడి జరిగి ఏడాదిన్నర అయినందున జగన్‌రెడ్డి తన వద్ద ఉన్న అస్త్రశస్త్రాలకు పదునుపెడుతున్నారు. రాయలసీమ ప్రజలను రెచ్చగొట్టడం కోసం స్కెచ్ సిద్ధం చేస్తూనే మిగతా జిల్లాలలో కులాల కుంపట్లను రాజేయడం మొదలుపెట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కమ్మ–కాపు కులాల మధ్య విద్వేష బీజాలు నాటింది కూడా ఆ కుటుంబమే. దాదాపు మూడున్నర దశాబ్దాల తర్వాత ఈ రెండు కులాలవారూ ఒకే రాజకీయ వేదిక పంచుకుంటున్నారు. సహజంగానే ఇది జగన్‌రెడ్డి కడుపు మంటకు కారణం అవుతోంది. కమ్మ–కాపులది డెడ్లీ కాంబినేషన్. ఈ కాంబినేషన్‌కు ఇప్పుడు బీసీలు, మాదిగలు, ముస్లింలు జత కలిశారు. దీంతో ఆంధ్రప్రదేశ్‌లో కూటమి బలమైన రాజకీయ వేదికగా రూపొందింది. ఈ కారణంగా గత ఎన్నికల్లో కూటమి 164 సీట్లలో గెలుపొందింది. అది కూడా భారీ మెజారిటీలతో. కమ్మ–కాపులు కలవకుండా ఇప్పటిదాకా అడ్డుకుంటూ వచ్చారు. జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు చోటుచేసుకున్న అరాచకాలను గమనించిన జనసేనాని పవన్ కల్యాణ్ పరిణతి ప్రదర్శించి తెలుగుదేశం పార్టీతో చేతులు కలిపారు. పవన్ కల్యాణ్ తెలుగుదేశంతో జట్టు కట్టకుండా అడ్డుకోవడం కోసం ఎన్నికలకు ముందు జగన్‌రెడ్డి చెయ్యని ప్రయత్నం లేదు. ఆ ప్రయత్నాలు ఏవీ ఫలించలేదు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమిలో విభేదాలు రాకపోతాయా అని ఏడాదిన్నరగా ఎదురుచూశారు. అలాంటి సంకేతాలు కనిపించకపోగా కనీసం మరో పదిహేనేళ్లపాటు కూటమి ఐక్యంగా ఉంటుందని, రాష్ట్ర భవిష్యత్ కోసం అది అవసరమని పవన్ కల్యాణ్ పదే పదే ప్రకటిస్తున్నారు. దీంతో కాపులను పవన్ కల్యాణ్ నుంచి దూరం చేయడానికి జగన్ అండ్ కో వ్యూహ రచనకు శ్రీకారం చుట్టారు. కాపులు పవన్ కల్యాణ్‌కు దూరమైతే కూటమి దానంతట అదే బలహీనపడుతుందన్నది వారి అభిప్రాయం. తమ వ్యూహాన్ని అమలుచేయడానికి అనువైన సమయం కోసం ఎదురుచూస్తూ వచ్చారు. అంబటి రాంబాబు రూపంలో అటువంటి అవకాశం వచ్చిందని భావించి తమ వ్యూహాన్ని అమలుచేయడం మొదలెట్టారు. రాజశేఖర్‌రెడ్డి శిష్యుడిగా రాజకీయాల్లోకి వచ్చిన అంబటి రాంబాబు 1989లో మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన తనను తాను కాపు నాయకుడిగా ఎప్పుడూ ప్రకటించుకోలేదు. కాపు జాతి కోసం తాను రాజకీయాల్లోకి రాలేదని, తాను కాపు నాయకుడిని కాదని ఆయనే స్వయంగా ప్రకటించుకున్నారు కూడా. తన ముగ్గురు కుమార్తెల్లో ఇద్దరికి కమ్మ సామాజికవర్గానికి చెందిన వారితో వియ్యం అందుకున్నారు. వాస్తవ నేపథ్యం ఇది కాగా, జగన్ అండ్ కో ఇప్పుడు అకస్మాత్తుగా రాంబాబును కాపు నాయకుడిగా మార్చివేశారు. నాలుగు రోజుల క్రితం అంబటి రాంబాబు ముఖ్యమంత్రి చంద్రబాబును పరుష పదజాలంతో దూషించారు. ప్రతిగా తెలుగుదేశం పార్టీకి చెందినవారు అంబటి రాంబాబు ఇంటిపై దాడి చేశారు. నిజానికి ఇది తెలుగుదేశం పార్టీ సంస్కృతి కాదు. అయితే జగన్‌రెడ్డి పాలనలో ఇలాంటి దాడులు పరిపాటిగా ఉండేవి. నాటి దాడుల బాధితులు ఇప్పుడు ప్రతీకారం తీర్చుకోవడం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ కారణంగానే గతంలో అడ్డగోలుగా ప్రవర్తించిన వారిపై ఇంకెప్పుడు చర్యలు తీసుకుంటారు? మీకు చేతకాదా? అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబును నిలదీస్తున్నారు. ప్రస్తుతం చంద్రబాబుది విచిత్రమైన పరిస్థితి. ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న కార్యకర్తలను సంతృప్తిపరచడానికి చట్టవిరుద్ధమైన చర్యలను అనుమతించలేని స్వభావం ఆయనది. దీంతో ఇటు కార్యకర్తలను సంతృప్తిపరచలేక, అటు చట్టవిరుద్ధ పోకడలను అనుమతించలేక చంద్రబాబు నలిగిపోతున్నారు. వైసీపీ నాయకులు ప్రవర్తించినట్టుగానే తెలుగుదేశం నాయకులు కూడా ప్రవర్తిస్తున్నారన్న అపవాదును మూటగట్టుకోవడానికి ఆయన ఇష్టపడటం లేదు. ఈ కారణంగానే అంబటి రాంబాబు, జోగి రమేశ్ ఇళ్లపై దాడులు చేసిన వారిపై కేసులు కట్టించి అరెస్టు చేయించారు. జగన్‌రెడ్డి హయాంలో అరెస్టుల సంగతి దేవుడెరుగు, కనీసం కేసులు కూడా ఉండేవి కావు. 'ముఖ్యమంత్రిగా ఉన్న నన్ను తిడితే మా వాళ్లకు బీపీ పెరిగి ఎక్కడైనా చిన్న చిన్న సంఘటనలు జరుగుతాయి. అందులో ఏముంది?' అని సీఎంగా ఉన్నప్పుడు జగన్‌రెడ్డి సమర్థించుకొనేవారు. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబును 'ల'కారాలతో దూషించినందున తెలుగుదేశం కార్యకర్తలకు కూడా బీపీ పెరిగి ఉంటుందని జగన్‌రెడ్డి సరిపెట్టుకోవడం లేదు. అలా సరిపెట్టుకోవాలనుకోవడం కూడా సరికాదు. దాడుల సంస్కృతిని ఖండించాల్సిందే. అయితే ఈ మొత్తం వ్యవహారంలో కులం కార్డును తెరపైకి తేవడం విశేషం. గతంలో కాంగ్రెస్ నాయకుడిగా, ఇప్పుడు వైసీపీ నాయకుడిగా చలామణి అవుతున్న అంబటి రాంబాబును ఉన్నపళంగా కాపు నాయకుడిగా మార్చిపడేశారు. దాడి జరిగిన వెంటనే కాపు నాయకుడిపై దాడి చేశారు అంటూ శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు వైసీపీ నాయకులు కొత్త పల్లవి అందుకున్నారు. కుట్రలు, కుతంత్రాలు, కపట నాటకాలను జగన్‌రెడ్డి పకడ్బందీగా అమలు చేస్తున్నారు అనడానికి కాపు కులం కార్డును తెరపైకి తేవడం నిదర్శనం. తాను అధికారంలో ఉన్నప్పుడు ఇదే అంబటి రాంబాబు, పేర్ని నాని వంటి కాపు సామాజిక వర్గానికి చెందిన వారితో కలసి జనసేనాని పవన్ కల్యాణ్‌తో పాటు కాపులను తిట్టించేవారు. కాపులను మురికి తిట్లతో అవమానించారు. ఇప్పుడు అవన్నీ మరిచిపోయి తన రాజకీయ ప్రయోజనాల కోసం కాపు కార్డును ఉపయోగిస్తున్నారు. రిమాండ్ ఖైదీగా రాజమండ్రి జైల్లో ఉన్న అంబటి రాంబాబును పరామర్శించడానికి కాపు ప్రతినిధులను పంపిస్తున్నారు. గత ఎన్నికలకు ముందు, పిఠాపురంలో పవన్ కల్యాణ్‌ను ఓడించలేకపోతే పేరు మార్చుకుంటానని ప్రకటించిన ముద్రగడ పద్మనాభం అన్నట్టుగానే తన పేరును పద్మనాభరెడ్డిగా మార్చుకున్నారు. ఇప్పుడు రెడ్డిగా మారిపోయిన ముద్రగడ కూడా రాంబాబును పరామర్శించిన వారిలో ఉండటం విశేషం. మొత్తంమీద అంబటి రాంబాబును కాపు నాయకుడిగా మార్చివేశారు. ముందు ముందు ఈ ముద్ర ఆయనకు నష్టం చేయవచ్చు. తన రాజకీయ ప్రయోజనాల కోసం ఎవరినైనా సమిధలుగా మార్చుకోవడానికి జగన్‌రెడ్డి వెనుకాడరు అనడానికి ఇదొక నిదర్శనం. చిరంజీవి కుటుంబానికి, కాపులకు విడదీయరాని బంధం ఉంది. ఈ కారణంగానే పవన్ కల్యాణ్‌ను కాపులు తమవాడిగా పరిగణిస్తున్నారు. చంద్రబాబు–పవన్ కల్యాణ్ మధ్య గొడవలు జరగడం లేదు కనుక కాపులను పవన్ కల్యాణ్ నుంచి దూరం చేయడం మినహా మరో ప్రత్యామ్నాయం లేదని భావించడం వల్లనే జగన్‌రెడ్డి కులం కార్డును బయటకు తీశారు. కమ్మ–కాపుల మధ్య మరోసారి వైషమ్యాలను సృష్టించే పని మొదలెట్టారు. ఈ ఎత్తుగడలను చంద్రబాబు–పవన్ కల్యాణ్ ఎలా ఎదుర్కొంటారో వేచిచూడాలి. పరామర్శలను అమితంగా ఇష్టపడే జగన్‌రెడ్డి యథావిధిగా అంబటి రాంబాబు కుటుంబాన్ని పరామర్శించారు. శుక్రవారం నాడు జోగి రమేశ్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ పరామర్శల సందర్భంగా జగన్‌రెడ్డి చేస్తున్న రచ్చ పరమ రోతగా ఉంటోంది. ఆయన పర్యటన అంటేనే జనం హడలిపోయే పరిస్థితి ఏర్పడింది. జోగి రమేశ్ కుటుంబాన్ని పరామర్శించడానికి జగన్ వెళ్లినప్పుడు ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. తన పరామర్శ యాత్రలో పాల్గొని ఇరువురు ప్రాణాలు కోల్పోవడంపై జగన్‌రెడ్డి కనీసం విచారం కూడా వ్యక్తం చేయకపోవడం ఆయన వికృత మనస్తత్వానికి నిదర్శనం. రెండు నిండు ప్రాణాలు పోయినప్పటికీ జగన్ మీడియా కూడా ఆ విషయం పట్టించుకోలేదు. తనకోసం వచ్చినవాళ్లు చనిపోతే కనీసం విచారం వ్యక్తం చేయని వ్యక్తి జననేత ఎలా అవుతాడు? తనకు అంతులేని జనాదరణ ఉందని చెప్పుకోవడానికి జనసమీకరణ చేసుకోవడంలో తప్పులేదు గానీ వచ్చిన వారి రక్షణ గురించి కూడా ఆలోచించాలి కదా? ఈ జన సమీకరణ నాటకం కొన్ని సందర్భాలలో రోతగానూ ఉంటోంది. జగన్‌రెడ్డికి నిజంగా అంత జనాదరణే ఉంటే కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కనీసం ఒక్క సీటు కూడా ఎందుకు రాలేదో చెప్పాలి. ఎంతటి జనాదరణ ఉన్న నాయకులైనా పెళ్లిళ్లు పేరంటాలకు వెళ్లినప్పుడు జనాలు తండోపతండాలుగా రారు కదా? జగన్‌రెడ్డి పెళ్లిళ్లకు వెళ్లినప్పుడు కూడా ఇదే షో చేస్తున్నారు. గత ఎన్నికల్లో తనను ఓడించినందుకు రాష్ట్ర ప్రజలందరూ పశ్చాత్తాపంతో తిండీ తిప్పలూ మాని ప్రాయశ్చిత్తం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారన్న భ్రమలో తాను బతుకుతూ రాష్ట్ర ప్రజలు కూడా అవే భ్రమల్లో బతకాలని జగన్ కోరుకుంటున్నట్టుగా ఉంది. జగన్‌రెడ్డి వైఖరి మొగుడిని కొట్టి మొగసాలకు ఎక్కినట్టుగా ఉంటుంది. రాజకీయ ప్రత్యర్థులపై అడ్డగోలుగా నోరు పారేసుకుంటున్న తన వాళ్లను ప్రోత్సహించకుండా కట్టడి చేస్తే ఏ గొడవా ఉండదు కదా? ప్రత్యర్థులను తిట్టమని ప్రోత్సహించి ఆ క్రమంలో అవాంఛనీయ సంఘటనలు జరిగితే గగ్గోలు పెట్టి ఏమి ప్రయోజనం?

> దాడులు–ప్రతిదాడుల సంస్కృతికి రాజకీయ పార్టీలు స్వస్తి చెప్పాలి. ఈ విషయంలో కూటమి నాయకులు సంయమనంతో బాధ్యత తీసుకోవాలి. మీరు అధికారంలో ఉన్నప్పుడు మా మీద దాడి చేశారు, ఇప్పుడు మేం అధికారంలో ఉన్నాం కనుక మీ మీద దాడి చేస్తాం అని భావిస్తే ఇద్దరి మధ్యా తేడా ఏముంటుంది?



> వైసీపీ నాయకులు ప్రవర్తించినట్టుగానే తెలుగుదేశం నాయకులు కూడా ప్రవర్తిస్తున్నారన్న అపవాదును మూటగట్టుకోవడానికి చంద్రబాబు ఇష్టపడటం లేదు. ఈ కారణంగానే అంబటి రాంబాబు, జోగి రమేశ్ ఇళ్లపై దాడులు చేసిన వారిపై కేసులు కట్టించి అరెస్టు చేయించారు. 'ముఖ్యమంత్రిగా ఉన్న నన్ను తిడితే మా వాళ్లకు బీపీ పెరిగి ఎక్కడైనా చిన్న చిన్న సంఘటనలు జరుగుతాయి. అందులో ఏముంది?' అని సీఎంగా ఉన్నప్పుడు జగన్‌రెడ్డి సమర్థించుకొనే వారు. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబును 'ల'కారాలతో దూషించినందున తెలుగుదేశం కార్యకర్తలకు కూడా బీపీ పెరిగి ఉంటుందని జగన్‌రెడ్డి సరిపెట్టుకోవడం లేదు. అలా సరిపెట్టుకోవాలనుకోవడం కూడా సరికాదు. దాడుల సంస్కృతిని ఖండించాల్సిందే.

> చిరంజీవి కుటుంబానికి, కాపులకు విడదీయరాని బంధం ఉంది. ఈ కారణంగానే పవన్ కల్యాణ్‌ను కాపులు తమవాడిగా పరిగణిస్తున్నారు. చంద్రబాబు–పవన్ కల్యాణ్ మధ్య గొడవలు జరగడం లేదు కనుక కాపులను పవన్ కల్యాణ్ నుంచి దూరం చేయడం మినహా మరో ప్రత్యామ్నాయం లేదని భావించడం వల్లనే జగన్‌రెడ్డి కులం కార్డును బయటకు తీశారు.

గతం గుర్తెరగాలి.. తీరు మారాలి!

ఏ పార్టీ వారైనా భాష విషయంలో సంయమనం పాటించాల్సిన తరుణం ఆసన్నమైంది. తెలుగునాట ఇటీవలి కాలంలో బూతులు సర్వసాధారణం అయ్యాయి. ఈ విషయంలో నాయకులను కట్టడి చేయడానికి చట్టం చేసే అవకాశం ఉందేమో ప్రభుత్వాలు పరిశీలించాలి. బూతు భాష అధికారిక భాషగా మారడం ఏమిటి? రేపటి తరానికి ఏమి నేర్పుతున్నాం? జగన్‌రెడ్డి రాజకీయ అరంగేట్రానికి ముందు రాజకీయాల్లో ఇలాంటి ముతక భాష అంతగా వినిపించేది కాదు. పేర్ని నాని, జోగి రమేశ్, అంబటి రాంబాబు వంటి వారు కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు ఇలాంటి ముతక భాష వాడిన దాఖలాలు పెద్దగా లేవు. ఇప్పుడు వారు నోరు తెరిస్తే బూతులు ప్రవహిస్తున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు బూతులు మాత్రమే మాట్లాడిన కొడాలి నాని ఇప్పుడు ఎక్కడ ఉంటున్నారో తెలియదు. ఆనాడు అధికార మదంతో రెచ్చిపోయిన ఆయన ఏం బావుకున్నారు? అలాంటి వారి దుస్థితి గమనిస్తూ కూడా కొంత మంది వైసీపీ నాయకులు ఇప్పటికీ వైఖరి మార్చుకోకపోవడం వింతగా ఉంది. అంతు తెలియని వైరస్ ఏదో సోకినట్టుగా వైసీపీ నాయకులు ప్రవర్తిస్తున్నారు. జగన్‌రెడ్డిని సంతృప్తిపరచడానికి తమ స్థాయిని తగ్గించుకొని ప్రవర్తించడం వల్ల సమాజంలో తమ ప్రతిష్ఠ దిగజారుతుందన్న వాస్తవాన్ని వారు గుర్తిస్తే మంచిది. దాడులు–ప్రతిదాడుల సంస్కృతికి కూడా రాజకీయ పార్టీలు స్వస్తి చెప్పాలి. ఈ విషయంలో కూటమి నాయకులు సంయమనంతో బాధ్యత తీసుకోవాలి. అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ నాయకులు కన్నూ మిన్నూ కానకుండా దాడులకు తెగబడ్డారు. తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంపై కూడా దాడి చేశారు. చంద్రబాబు ఇంటిపైన కూడా దాడి చేశారు. చివరికి ఏమైంది? ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయారు. నాటి సంస్కృతి పట్ల వెగటు కలగడం వల్లనే కదా ప్రజలు వైసీపీని 11 సీట్లకు పరిమితం చేశారు అన్న వాస్తవాన్ని కూటమి నాయకులు గుర్తుంచుకోవాలి. మీరు అధికారంలో ఉన్నప్పుడు మా మీద దాడి చేశారు, ఇప్పుడు మేం అధికారంలో ఉన్నాం కనుక మీ మీద దాడి చేస్తాం అని భావిస్తే ఇద్దరి మధ్యా తేడా ఏముంటుంది? రాష్ట్రంలో నాటి అరాచక పరిస్థితులు ఇకపై ఉండకూడదు అనే కదా జనం మిమ్మల్ని ఎన్నుకుంది? అధికారంలో ఉన్నప్పుడు దౌర్జన్యాలకు పాల్పడిన వారిని చట్టపరంగా మాత్రమే శిక్షించాలి. నోరు పారేసుకుంటున్న వారిని ప్రజల విజ్ఞతకే వదిలేయడం మంచిది. గతంలో నోరు పారేసుకున్న ఒక్కరైనా గత ఎన్నికల్లో గెలవగలిగారా? లేదే! జగన్‌రెడ్డి మనస్తత్వాన్ని రాష్ట్ర ప్రజలు అందరూ గ్రహించారు కనుకనే ఆయన పార్టీని చిత్తుగా ఓడించారు. బలప్రదర్శన పేరిట మరెంతో మంది ప్రాణాలు తీయడానికి కూడా ఆయన వెనుకాడరు. రాష్ట్రంలో అశాంతిని సృష్టించడానికి మరెన్నో వికృత క్రీడలకు తెరలేపుతారు. కూటమి నాయకులు, కార్యకర్తలను రెచ్చగొట్టడానికి మరిన్ని బూతులతో విరుచుకుపడవచ్చు. అధికారంలో ఉన్నందున సంయమనం పాటించాల్సిన బాధ్యత కూటమిపైనే ఉంటుంది. జగన్‌రెడ్డి నుంచి ఉదాత్తమైన రాజకీయాలను ఆశించలేము. తమది మంచి ప్రభుత్వం అని చెప్పుకొంటున్న కూటమి నాయకులైనా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తారని ఆశిద్దాం! త్వం శుంఠ అంటే త్వం శుంఠ అన్నట్టుగా పరిస్థితి మారకూడదు. నాటి పాపాలు వెంటాడుతున్నందున జగన్‌రెడ్డి ఇప్పుడు అన్యాయం, అక్రమం అని ఆక్రోశిస్తున్నా ప్రజలు పట్టించుకోవడం లేదు. అదే దుస్థితి తమకు ఎదురు కాకూడదని కూటమి నాయకులు గ్రహించాలి. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు కూడా ప్రతీకారం తీర్చుకోవాలన్న తమ వైఖరి మార్చుకోవాలి. పగ ప్రతీకారాలతో రగిలిపోతూ ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఒత్తిడి చేసే ప్రయత్నాలు మంచివి కావు. రాష్ట్రంలో ప్రశాంత పరిస్థితులు ఉండాలని, అభివృద్ధి జరగాలని మాత్రమే ప్రజలు కోరుకుంటున్నారు. నేరం చేసినవాళ్లను చట్ట ప్రకారం శిక్షించే అవకాశం కల్పించాలే గానీ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవాలని అనుకోవద్దు. అలా చేస్తే దొందూ దొందే అని ప్రజలు భావించే ప్రమాదం ఉంటుంది. తస్మాత్ జాగ్రత్త!


> జగన్‌రెడ్డి కోసం రాయలసీమకు చెందిన మోతుబరులే కాకుండా తెలంగాణకు చెందిన బీఆర్ఎస్ కూడా పనిచేస్తుంటుంది. రాయలసీమ ఎత్తిపోతల పథకం చేపట్టడం ద్వారా కృష్ణా జలాలను అక్రమంగా తరలించుకుపోతున్నారని భారత రాష్ట్ర సమితి గతంలో విమర్శించింది. ఇప్పుడు రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి కూడబలుక్కొని తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ నిర్వహించిన పోరుబాట గురించి భారత రాష్ట్రసమితి పట్టించుకోలేదు. తెలంగాణకు ద్రోహం చేయాలనుకోవడం ఏమిటి? అని జగన్‌రెడ్డిని నిలదీయలేదు.

అసూయపడదగిన సౌందర్యాత్మక అనుభూతి!

ఆధునిక భారతీయ సామాజిక శాస్త్రం ఆంద్రే బెటీల్ (30 సెప్టెంబర్ 1934– 3ఫిబ్రవరి 2026)తో ఆరంభమయింది. భారతీయ గ్రామీణ సమాజాన్ని మౌలిక దృక్పథంతో అధ్యయనం చేసి, భావితరాలకు ఒక విశాల విద్యాద్వారాన్ని తెరిచిన విద్వజ్జుడు బెటీల్. భారతదేశ సామాజిక నిర్మాణంలో కరడుగట్టిన సంప్రదాయ వ్యవస్థ నుంచి కులం, వర్గం, అధికారం ఆలంబనతో మరింత విభిన్నమైన, అసమానతల వ్యవస్థ ప్రభవించిన తీరుతెన్నులను 1965లో ప్రచురితమైన ఆయన పుస్తకం 'Caste, Class and Power: Changing Patterns of Social Stratification in a Tanjore Village' (కులం, వర్గం, అధికారం: తంజావూరు గ్రామంలో మారుతున్న వర్గీకరణ సంబంధాలు) ప్రతిభావంతంగా విశ్లేషించింది. ఇది, కేవలం మరొక గ్రామీణ సమాజ అధ్యయనం మాత్రమే కాదు, భారత రాజకీయాలను, సార్వత్రిక సామాజిక సిద్ధాంతంతో అనుసంధానించిన పరిశోధన అది. స్థానిక వాస్తవికతను సార్వత్రిక నియమబద్ధ ఆదర్శాలతో సమతుల్యం చేసిన మేధా కృషికి అదొక తార్కాణం. తమిళనాడులో బ్రాహ్మణ ఆధిపత్యంలోని ఒక గ్రామంలో ద్రావిడోద్యమ రాజకీయాలలో ప్రభవిస్తోన్న ధోరణులు, కుల పరమైన చైతన్యశీలత, ఆర్థిక, రాజకీయ సంఘటనల పర్యవసానాలు అన్నిటినీ బెటీల్ తన అధ్యయనంలో ఏకీకరించారు. వాటి పరిశీలనకు ఒక సమగ్ర భావనా చట్రాన్ని రూపొందించారు. మత, రాజకీయ, ఆర్థిక ఆధిపత్యాలు ఇంకెంత మాత్రం ఏకకేంద్రంగా లేని గ్రామీణ భారతంలో 'సంచిత అసమానతల నుండి చెదరగొట్టబడిన అసమానతలకు' (From Cumulative to dispersed inequalities) పరివర్తనను అర్థం చేసుకోవడానికి ఆయన పరిశోధన గ్రంథం.. 'కులం, వర్గం, అధికారం' ఇప్పటికీ విశేషంగా తోడ్పడుతున్నది. గ్రామీణ సమాజ గతిశీలతను 'సంచిత అసమానతల నుండి చెదరగొట్టబడిన అసమానతలకు' అన్న భావన ప్రతిభావంతంగా సంగ్రహపరిచింది. మరింత స్పష్టంగా చెప్పాలంటే ఒకే సమూహం అన్ని అధికారాలను కలిగి ఉన్న వ్యవస్థ విచ్ఛిన్నమై, వివిధ సమూహాలు వివిధ రకాల అధికారాలను కలిగి ఉన్న వ్యవస్థగా మారిన రీతిని అది వివరిస్తుంది. గ్రామీణ భారతదేశంలో ఇప్పటికీ అసమానతలు తీవ్రస్థాయిలో ఉన్నప్పటికీ వాటి స్వభావం మారిపోయింది. కులపరమైన నిచ్చెనమెట్ల వ్యవస్థలో ఒకే వ్యక్తులు అగ్రస్థానంలో ఉండడం, ఒకే వ్యక్తులు దిగువన ఉండే పరిస్థితి అనేది సమసిపోయినందున అసమానతలు చెల్లాచెదురైపోయాయని బెటీల్ పరిశోధన విశ్లేషించింది.

భారతదేశంలోనే కాకుండా పాశ్చాత్య దేశాలలో కూడా ఒక ఉత్కృష్ట మేధావిగా బెటీల్ గౌరవాదరాలు పొందారు. ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాలో మేధాసంపన్నమైన ఉపన్యాసాలను వెలువరించారు. ఈ విశ్వమేధావి హృదయం, మేధ సదా భారతీయతతో స్పందిస్తూ ఉండేవి. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో విశ్వవిద్యాలయాలు ఆయనను బోధన విధులు, పరిశోధనల నేతృత్వానికి ఆహ్వానించినప్పటికీ ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ (డీఎస్ఈ)లో మాత్రమే బోధించేందుకు ఆయన ఇష్టపడ్డారు. తన అధ్యాపక జీవితమంతా ఆ ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలోనే గడిపారు. సమున్నతమైన బాధ్యతలు నిర్వహించేందుకు అమెరికా, యూరోపియన్ దేశాలు ఆహ్వానించినప్పటికీ ఆయన భారత్‌కే ప్రాధాన్యం ఇచ్చారు. ఇదే విషయాన్ని ఆయన్ను ఎంతోమంది అడుగుతుండేవారు. డీఎస్ఈకే ఎందుకు ప్రాధాన్యమిచ్చారని నేనూ ఒకసారి ప్రశ్నించాను. అక్కడ బోధించడం, పనిచేయడం తనకు ఎంతో ఆనందాన్నిస్తోందన్నారు ఆయన. అంతకుమించి ఎలాంటి వివరణ ఇవ్వలేదు. అసలు నా ప్రశ్న పరిశీలనకు అనర్హమైనదిగా కొట్టివేస్తున్నట్టు ఆయన మాట ధ్వనించింది. తాను జాతీయవాదిననే ఘనమైన మాటలను ఆయన తన సమాధానంలో ఉపయోగించలేదు. ఒక సరళసత్యాన్ని అంతే నిరాడంబరంగా చెప్పారు: 'ఇక్కడ నేను సంతృప్తి పొందుతున్నాను'. ఆ సమాధానంలోని భావం నాకు అర్థమయింది. అవును, ఆ సంతృప్తి మేధాపరమైన సంతృప్తి. బెటీల్ వంటి సమున్నత విద్యావేత్తలు మాత్రమే అటువంటి సంతృప్తిని ఆకాంక్షిస్తారు.


బెటీల్ తరచు 'టైమ్స్ ఆఫ్ ఇండియా'కు వ్యాసాలు రాస్తుండేవారు. ఈ విషయంలో ఆయనొక పథనిర్దేశకుడు. గూఢమైన సామాజికశాస్త్ర అధ్యయనాంశాలను ప్రజల ఆసక్తులు, ఆందోళనలతో మిళితం చేసి ఆయన రాసిన వ్యాసాలు పాఠకులను బాగా ప్రభావితం చేసేవి. ప్రజా చర్చల ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడేందుకు బెటీల్ విశేషంగా దోహదం చేశారు. ఆయన రచనాశైలి సమ్మోహనంగా ఉండేది. ప్రసంగ బాణీ సమ్ముగ్ధపరిచేది. ఆయన వ్యాసాలు చదవడానికి పాఠకులు, ప్రసంగాలు వినడానికి శ్రోతలు ఆరాటపడేవారు. ఆయన వాక్యాలు చాలా స్ఫుటంగా ఉండేవి, అర్థస్ఫోరకంగా ఉండేవి, రమ్యంగా ఉండేవి. అసూయపడదగిన సౌందర్యాత్మక అనుభూతి నిచ్చే శైలి ఆయనది. ప్రజా వేదికలపై ఆయన వెలువరించే ఉపన్యాసాలు వినడానికి ఎంతో మంది వచ్చేవారు. మంచి సామాజిక శాస్త్రవేత్త కావాలని ఆకాంక్షించే యువ పరిశోధకులకు బెటీల్ ఒక సర్వోత్కృష్టమైన నమూనా.



ఆంద్రే బెటీల్ (1934 – 2026)

▪ దీపాంకర్ గుప్తా
సామాజిక శాస్త్రవేత్త
(ఇండియన్ ఎక్స్‌ప్రెస్)


ప్రసంగిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, వేదికపై మంత్రి ఆనం, ఎంపీ లావు, ఎమ్మెల్యే పుల్లారావు



కొండవీడులో ఉత్సవ శోభ

అట్టహాసంగా ఉత్సవాలు ప్రారంభం



కొండవీడు ఫెస్ట్ సైకత శిల్పం


హెలికాప్టర్ ప్రారంభిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే పుల్లారావు, జేసీ సంజనా సింహా


బోటు షికారులో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే పుల్లారావు


స్కూల్ విద్యార్థినుల సెల్ఫీ

యడ్లపాడు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కేరింతలు.. యువత సాహసాలు.. అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు.. చారిత్రక ప్రాశస్త్యాన్ని తెలియచేసే అద్భుత ప్రదర్శనలు.. సందర్శకుల సందడితో.. తొలిరోజు కొండవీడు ఉత్సవ శోభను సంతరించుకుంది. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారుల రాకతో కొండవీడు ఫెస్ట్-2026 శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పర్యాటకులు, సందర్శకులకు ఇబ్బందులు కలగకుండా


గీతాలాపన చేస్తున్న సమీరా భరద్వాజ్

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

- ప్రత్యేక ఆకర్షణగా శాండ్ ఆర్ట్, ఫ్లవర్ షో
- సాహస క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్న యువత
- శౌర్యానికి ప్రతీక కొండవీడు : కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని
- కొండపై శివాలయం పునః నిర్మాణానికి నిధులు : మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- పార్కు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తా : ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

ఎక్కడికక్కడ ఏర్పాట్లు, సౌకర్యాలు సమకూర్చడంతో తొలిరోజు కార్యక్రమాలు విజయవంతంగా సాగాయి. కాగా ఉత్సవాలను శనివారం ఉదయం కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు (మిగతా 6వ పేజీలో)

- అమరావతికి ప్రపంచస్థాయి గుర్తింపు
- వ్యాలీ పైలాన్ ఆవిష్కరణలో సీఎం చంద్రబాబు
- దార్శనికుడు చంద్రబాబు : కేంద్ర మంత్రి జితేంద్రసింగ్
- రాజధాని ఉద్దండరాయుని పాలెంలో అట్టహాసంగా భూమిపూజ



క్వాంటం విప్లవానికి.. పునాది



గుంటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): 'నేడు మనం క్వాంటం వ్యాలీ భవనాలకు పునాది వేయడం లేదు.. ప్రపంచ క్వాంటం విప్లవంలో భాగమయ్యే నిపుణులకు కూడా పునాది వేసుకుంటున్నాం. చెప్పాలంటే రేపటి తరాల భవితకు పునాది వేస్తున్నాం..' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. రాజధాని అమరావతిలోని ఉద్దండరాయునిపాలెంలో శనివారం క్వాంటం వ్యాలీ శంకుస్థాన కార్యక్రమం అట్టహసంగా జరిగింది. తొలుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, మంత్రి లోకేశ్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఫైలన్‌ను ఆవిష్కరించారు. అనంతరం కేంద్ర, రాష్ట్ర మంత్రులు, టీసీఎస్, ఐబీఎం తదితర దిగ్గజ టెక్‌సంస్థల ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. క్వాంటం వ్యాలీ శంకుస్థాపన అనేది అమరావతి, ఆంధ్రప్రదేశ్‌తో పాటు భారతదేశానికి కూడా చారిత్రాత్మక దినమన్నారు. ప్రపంచశ్రేణి ప్రమాణాలతో అమరావతి క్వాంటమ్ వ్యాలీ భారత క్వాంటమ్ భవిష్యత్‌ని నిర్దేశించే ప్రదేశంగా మారుతుందన్నారు. ఐటీని అందుకుని హైదరాబాద్‌లో హైటెక్‌సిటీని ప్రారంభించామని, అది ఒక గేమ్ చేంజర్‌గా మారి ఫలితాలు ఇచ్చిందన్నారు. ఇప్పుడు అదే తరహాలో క్వాంటం (మిగతా 6వ పేజీలో)


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ తదితరులు





ఎన్నికల పంచాయతీ

- ఓటర్ల జాబితాపై ఎన్నికల కమిషన్ ఆదేశాలు
- మార్చి 9 కల్లా పూర్తి చేయాలని ఉత్తర్వులు
- ఏప్రిల్‌లో ముగియనున్న పాలకవర్గాల పదవీ కాలం

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

పల్లెల్లో పంచాయతీ ఎన్నికల వాతావరణం. ఏప్రిల్‌లో పాలకవర్గాల పదవీ కాలం ముగియనుంది. ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సమాయత్తమవుతోంది. మార్చి 9 కల్లా పంచాయతీల వారీ గా ఓటర్ల జాబితా రూపొందించాలని ఆదేశి స్తూ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసిం ది. అయితే ఎన్నికలు నిర్వహిస్తారా లేదా అన్న సందేహాలు రాజకీయ పార్టీ నేతల్లో నెలకొన్నాయి. 2026 జనవరి 1



నాటి అసెంబ్లీ నియోజకవర్గాల జాబితాను అర్హత తేదీగా స్వీకరించి పాం-1లో పేర్కొన్న నియమం 5 ప్రకారం వార్డు విభజన చేయలని కమిషన్ సూచిం చింది. అన్ని పంచాయతీల్లో మార్చి 9న ఓటర్ల జాబితాలను ప్రచురించాలని ఆదేశించింది.

ఎన్నికల కమిషన్ ఉత్తర్వులతో పంచాయతీల్లో ఓటర్ల జాబితా రూపొందించేందుకు సంబంధింత అధికార సిబ్బంది ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మునిసిపాల్టీల్లో విలీనమైన నేపథ్యంలో గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధి లో దాదాపు 69 పంచాయతీలకు ఎన్నికలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఈసారి ఆయా పంచాయతీలకు ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతు న్నారు. గతంలో పల్నాడు జిల్లాలో 519 పం చాయతీలకు ఎన్నికలు జరిగాయి. వీటిలో వెయ్యి లోపు జనాభా కలిగినవి 69, వెయ్యికి పైగా జనాభా కలిగిన పంచాయతీలు 451 ఉన్నాయి. గుంటూరు జిల్లా లో వెయ్యిలోపు జనాభా ఉన్న పంచాయతీలు 25, వెయ్యికి పైగా జనాభా ఉన్న పంచాయతీలు 202 ఉన్నాయి. బాపట్ల జిల్లాలో ఈ సంఖ్య 66, 350గా ఉంది. రాజకీయ నేతలు ఎన్నికల ప్రక్రియపై దృష్టి సారిస్తున్నారు.

సర్వే విధుల్లో అలసత్వం

- 20 మంది సెక్రటరీలకు నోటీసులు

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే(యుఎఫ్ఎస్) నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన 20 మంది వార్డు సచివాలయ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు జీఎంసీ కమిషనర్ కె.మయూర్‌అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు 100 శాతం సర్వే పూర్తి చేయాలని టెలికాన్ఫరెన్స్ ద్వారా ఆదేశిస్తున్నా.. పలువురు సెక్రటరీలు లక్ష్యం కంటే చాలా తక్కువ స్థాయిలో సర్వే పూర్తి చేసినట్లు గమనించామన్నారు. ఈ క్రమంలో విధుల్లో 20 మంది బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించి నోటీసులు జారీ చేశామన్నారు.

విద్యాహక్కు ప్రవేశాలకు ఆహ్వానం

20 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులకు అవకాశం

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం(ఆర్‌టీఈ) ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశం కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో డాక్టర్ సలీంబాష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనల ప్రకారం ఐదేళ్లు నిండిన విద్యార్థినీ విద్యార్థులకు ఒకటో తరగతిలో ఈ చట్టం ద్వారా ప్రవేశం కల్పిస్తామన్నారు. స్టేట్, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ సిలబస్ ఉన్న అన్ని పాఠశాలల్లో ప్రవేశం పొందవచ్చన్నారు. విద్యా హక్కు చట్టం ద్వారా ఒకటో తరగతిలో 25 శాతం సీట్లకు అడ్మిషన్లు కల్పిస్తామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు రేషన్ కార్డు, ఓటర్ ఐడీ, తల్లిదండ్రుల ఆధార్, విద్యుత్ బిల్లు, డ్రైవింగ్ లైసెన్స్, పిల్లల వయసు ధ్రువీకరణ పత్రం తదితర వివరాలతో ఈ నెల 20 నుంచి మార్చి 10 లోగా https://cse.ap.gov.in అనే వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు.



ముగిసిన విజ్ఞాన్ మహోత్సవ్ 6



పాఠశాల విద్యార్థులతో కళకళ

- మెడికల్ ఎగ్జిబిషన్‌కు పెరుగుతున్న సందర్శకులు
- రోజుకు రెండు వేల మంది రాక

6

ఆడిట్‌లో అవినీతిపై.. విచారణ



జ్యోతి ఎఫెక్ట్

- 200 అభ్యంతరాలు.. రూ.3.47 కోట్లు
- అనుమానాస్పద క్లియరెన్సులపై వివరాల సేకరణ

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని ఆడిట్ విభాగం పని తీరుపై విచారణకు రంగం సిద్ధమైంది. 'ఆడిట్‌లో అవినీతి' అనే శీర్షికన ఈ నెల 1న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఆడిట్ అభ్యం తరాలకు సంబంధించిన అంశాలు ఫైళ్లలోనే మాయంపై అధికారులు వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. వర్సిటీ పరిధిలో ఉన్న 178 ఆడిటెడ్ సంస్థలపై పర్యవేక్షణ బాధ్యత వహిస్తున్న ఆడిట్ వింగ్, ఆర్థిక క్రమశిక్షణను కాపాడాల్సిన స్థితిలో ఉండగా, అక్కడే నిబంధనలకు విరుద్ధమైన నిర్ణయాలు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 88 సంస్థలకు చెందిన 200 ఆడిట్ అభ్యంతరాలు సుమారు రూ.3.47 కోట్ల విలువైన వాటిని ఆడిట్ బృందాలు గుర్తించాయి. ఒకే వ్యక్తి ఏకపక్షంగా వాటిని రద్దు చేసినట్లు రికార్డులు సూచిస్తున్నాయి. ప్రభుత్వ ఆడిట్ నియమావళి ప్రకారం ప్రతి ఫైల్ మేకర్, చెక్కర్, ఫైనల్ అప్రూవల్ స్థాయి దాటాల్సి ఉంటుంది. కానీ వర్సిటీ ఆడిట్ విభాగంలో ఈ మూడు స్థాయి లూ ఒకే వ్యక్తి ద్వారానే జరిగిపోతున్నాయన్న విమ ర్శలున్నాయి. గుర్తించిన లోపాలు, ఆర్థిక అసం గతులు ఆడిటర్లకు తెలియకుండానే తొలగిపోతున్నాయన్న ఆరోపణలు పరిస్థితిని మరింత గంభీరంగా మారుస్తున్నాయి. ఇలా చేయడం (మిగతా 6వ పేజీలో)

అసాధారణ క్లియరెన్సులు ఇలా..

- లాంలో రూ.1.07 కోట్ల విలువ గల 35 అభ్యంతరాలు
- తిరుపతిలో రూ.15.8 లక్షల విలువ గల 18 అభ్యంతరాలు
- మార్టూరులో రూ.14.39 లక్షల విలువ గల 16 అభ్యంతరాలు
- కృషి విజ్ఞాన కేంద్రం రస్తకుంటబాయిలో రూ.70.78 లక్షల విలువ గల 10 అభ్యంతరాలు
- డాక్టర్ ఎన్టీఆర్ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ బాపట్లలో రూ.12.59 లక్షల విలువ గల 15 అభ్యంతరాలు
- ఈ ఐదు సంస్థల్లోనే పెద్ద మొత్తంలో అభ్యంతరాలు తొలగించగా మిగిలిన సంస్థల విషయంలో ఎంత మొత్తం క్లియరైందన్నది ఇంకా వెలుగులోకి రాలేదు.

బడ్జెట్‌కు సై.. ఎజెండాకు నై

డీసెంట్ తెలిపి జడ్పీటీసీలు వాకౌట్

- నిధులు కేటాయించడం లేదంటూ నిరసన
- చైర్‌పర్సన్ క్రిస్టీనా మాటను లెక్కచేయని సభ్యులు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి సంఘ సమావేశం వాడివేడిగా జరిగింది. మిగులు బడ్జెట్ ఆమోదానికి ఇష్టత చూపిన జడ్పీటీసీలు ఎజెండా ఆమోదానికి అంగీకరించలేదు. గత స్థాయి సంఘ సమావేశంలో కూడా ఇదే కారణంతో ఎజెండా తిరస్కరణకు గురవడం గమనార్హం. జడ్పీ కార్యాలయంలో శనివారం జరిగిన ఈ సమావేశానికి చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా అధ్యక్షత వహించారు. అకౌంట్స్ ఆఫీసర్ పులగూర శామ్యూల్‌పాల్ బడ్జెట్ వివరాలను తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.54 కోట్ల 10 లక్షల 5 వేల ఆదాయానికి రూ.51 కోట్ల 40 లక్షల 15 వేల ఖర్చుతో, రూ.2 కోట్ల 69 లక్షల 90 వేల మిగులు బడ్జెట్‌కు ఒకటో స్థాయి సమావేశంలో ఆమోదం లభించింది. అయితే సమావేశ ఎజెండాను ఆమోదించబోమంటూ ఒకటో స్థాయి సంఘ సభ్యులు చిట్టిబాబు, వేణుగోపాలరెడ్డి, తుమ్మ విజయ్‌ప్రతాప్‌రెడ్డి, కాట్రగడ్డ మస్తాన్ రావు వ్యతిరేకించారు. తమకు సంబంధించిన అభివృద్ధి పనులకు వర్క్ ఆర్డర్లు ఇవ్వడంలేదని డీసెంట్ నోటీసులు ఇచ్చి వాకౌట్ చేశారు. సమావేశం అనంతరం వర్క్ ఆర్డర్లు ఇప్పిస్తానని చైర్‌పర్సన్ హామీ ఇచ్చినా వారు అంగీకరించలేదు. ఒకటి, మూడు, నాలుగు, ఏడు స్థాయి సంఘ సమావేశాలు అధ్యక్షుల ఆధ్వర్యంలో కొనసాగగా, రెండో, ఐదో, ఆరో స్థాయి సంఘ సమావేశాలు కోరం లేక వాయిదా పడ్డాయి. మూడో స్థాయి సమావేశానికి వైస్‌చైర్మన్ సొంటిరెడ్డి నర్సిరెడ్డి అధ్యక్షత వహించారు. రిజిస్ట్రేషన్ శాఖ నుంచి జడ్పీకి రూ.35 కోట్లకు పైగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని చైర్‌పర్సన్ ప్రశ్నించారు. ఉన్నతాధికారులతో చర్చించి నిధుల విడుదలకు చర్యలు తీసుకుంటామని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు స్పష్టం చేశారు. పారిశుధ్యం, గ్రామాల్లో కొనసాగుతున్న పనుల పురోగతిపై అధికారులను చైర్‌పర్సన్ నిలదీశారు. జడ్పీ నిధులతో ముద్రించిన 'విద్యా జ్యోతి' పుస్తకం మంచి ఫలితాలు ఇస్తోందని బాపట్ల డీఈవో శివబాబు తెలిపారు. విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం, 'విద్యాజ్యోతి' కార్యక్రమాలు విద్యా ప్రమాణాల పెంపునకు దోహదపడుతున్నాయని గుంటూరు డీఈవో అలీంబాష తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ వీర్ల జ్యోతిబసు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టీనా, హాజరైన సభ్యులు

నాటకాన్ని బతికించడం ప్రభుత్వ బాధ్యత

- తెలుగు నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ
- వైభవంగా సాగుతున్న నాటక మహోత్సవం

6

వర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాపాడాలి

ఏఎన్‌యూ ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తి రక్షించి, విద్యలో సామాజిక న్యాయం హామీ ఇవ్వాలి ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఏఎన్‌యూ ప్రధాన గేటు వద్ద శనివారం విద్యా సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గండు శివ, కార్యదర్శి యశ్వంత్ రఘువీరు, ఏఎన్‌యూ కమిటీ ఇంచార్జి నాసరయ్య మాట్లాడుతూ విద్యారంగంలో సంస్కరణలు చేపడతామని చెబుతూ.. కేంద్ర ప్రభుత్వం ఇటీవల వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ -2025 బిల్లును తీసుకురావడం బాధాకరమన్నారు. ఈ బిల్లు ద్వారా ఉన్నత విద్యపై కేంద్రం నియంత్రణ చేస్తూ రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా, రాష్ట్రాల హక్కులను కాలరాస్తుం దని మండిపడ్డారు. ఇది కార్పొరేట్ల విద్యా సంస్థల బిల్లు అని, ఉన్నత విద్యను విధ్వం సం చేయడమే నన్నారు. అఖిల్, డేవిడ్, ఖాసీం, బన్నీ, ప్రసాద్ ఖాజా, అమర్, నరసిం హా, గణేష్, పాలం నాసరయ్య పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	140, 149, 160
చికెన్ విత్ స్కిన్(కిలో)	268.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	278.00

కాపు కార్పొరేషన్ నిధులు దారి మళ్లించిన ద్రోహి జగన్

● డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబునాయుడు



గుంటూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో కార్పొరేషన్‌లో ఉన్న రూ.500 కోట్ల నిధులను వేరే పథకాలకు దారి మళ్లించిన నిజమైన కాపుల ద్రోహి జగన్ అని జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ వడ్రాణం హరిబాబునాయుడు మండిపడ్డారు. గుంటూరులోని తన కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ హయాంలోనే కాపులకు తీవ్ర అన్యాయం జరిగిందని స్పష్టం చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కాపు కార్పొరేషన్ ద్వారా సుమారు రూ.3500 కోట్లను కాపు సామాజిక వర్గానికి అందించడం జరిగిందని గుర్తుచేశారు. మాజీ మంత్రి అంబటి వ్యవహారంలో గొంతెత్తుతున్న కాపు నాయకులు గతంలో పవన్ కల్యాణ్‌ను, ఆయన కుటుంబ సభ్యులను వైసీపీ నాయకులు ఇష్టం వచ్చినట్లు తిట్టినప్పుడు ఏమైపోయారని ప్రశ్నించారు. వైసీపీ చేసే కుల, కుట్ర రాజకీయాలను నమ్మే స్థితిలో ప్రజల్లేరన్నారు.

పురుగు మందుల ల్యాబరేటరీ తనిఖీ



తనిఖీ చేస్తున్న వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ మనజీర్ జీలాని సమూన్

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గుంటూరు లోని పురుగు మందుల ల్యాబొరేటరీని వ్యవసాయ శాఖ డైరెక్టర్ డా. మనజీర్ జీలాని సమూన్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పురుగుమందుల శాంపిల్స్ పరీక్ష విధానం, విశ్లేషణ ఫలితాలను ఇన్‌సైట్ యాప్‌లో నమోదు చేసే విధానంపై వ్యవసాయ శాఖ సహాయ వ్యవసాయ సంచాలకులు సిహెచ్. తిరుమలదేవి, ల్యాబరేటరీ అనలిస్టులను అడిగి తెలుసుకున్నారు. ల్యాబొరేటరీని మరింత సదుపాయాలతో అభివృద్ధి చేయాలని సూచించారు. ఎన్ఏబీ ఎల్ (నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్) గుర్తింపు సాధించేలా కృషి చేయాలని ఆదేశించారు.

పీజీ పరీక్ష ఫలితాలు విడుదల

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎంఏ ఇంగ్లీష్, జర్నలిజం, థియేటర్ ఆర్ట్స్, ఎంబీఏ మూడవ సెమిస్టర్ ఫలితాలను శనివారం పరీక్షల నిర్వహణ అధికారి ఆలపాటి ప్రసాద్ రావు విడుదల చేశారు. రీవాల్యుయేషన్ ఫీజు రూ.1860 చెల్లించి, ఈ నెల 16లోపు దరఖాస్తుచేసుకోవాలని తెలిపారు. ఫలితాలను ఏఎ న్యూ వెబ్‌సైట్‌లో పొందుప రిచినట్లు చెప్పారు.

అంబటి వ్యవహారానికి కులం రంగు సరికాదు

● అఖిల భారత కాపు సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి రాజామాస్టారు

గుంటూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రస్తుతం చర్చనీయాంశమైన మాజీ మంత్రి అంబటి రాంబాబు వ్యవహారానికి కాపు కులం రంగు పులమటం మాజీ సీఎం జగన్‌రెడ్డి రాజకీయ కుట్రలో భాగమని అఖిల భారత కాపు సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి రాజా మాస్టారు ధ్వజమెత్తారు. గుంటూరులో కాపు సమాఖ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబటి రాంబాబు వివాదం ఆయన వ్యక్తిగతమన్నారు. గుంటూరు జిల్లాలో ఉన్న కాపులెవరూ అంబటికి సంఘీభావం తెలిపే ఆలోచనలో లేరన్నారు. వాస్తవానికి అంబటి వ్యవహార శైలిని సాక్షాత్తూ ఆ పార్టీ గుంటూరు జిల్లా నాయకులే ఈసడించు కుంటున్నారన్నారు. గతంలో అంబటి రాంబాబు కాపులను తాగుబోతులుగా, తిరుగుబోతులుగా దూషించినప్పుడు వైసీపీలో ఉన్న కాపులు ఎక్కడ గడ్డి పీకుతున్నారని మండిపడ్డారు. కాపులకు అన్నివిధాల మేలు చేసిన రాజకీయ పార్టీ టీడీపీ అనేది జగమెరిగిన సత్యమన్నారు. నాడు ఎన్టీఆర్, నేడు చంద్రబాబు కాపులకు రాజకీయంగా, విద్యా పరంగా, ఆర్థికంగా కొండంత మేలు చేశారని స్పష్టం చేశారు. చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌ను టీడీపీ, జనసేన, బీజేపీలోని కాపులను అంబటి హీనంగా మాట్లాడినప్పుడు వైసీపీ కాపు నాయకులు ఎందుకు నోరు మెదప లేదో ఆత్మపరిశీలన చేసుకుంటే మంచిదన్నారు.



గంజాయి విక్రేతల అరెస్టు

● 3.5 కేజీల గంజాయి స్వాధీనం

కాకుమాను, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గంజాయిను తరలి స్తున్న ముఠాను అరెస్టు చేసి, వారి నుంచి 3.5 కేజీల గంజా యిను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పృథ్వీ ఏక్‌నాథ్ శనివా రం తెలిపారు. పెదనందిపాడు - బాపట్ల ప్రధాన రహదారి లో కరుణ రూరల్ గోడౌన్ వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో దేవరకొండ రంజిత్‌కుమార్, జూటు చైతన్య ప రమేశ్వరరావు, జొన్నకూటి ఉదయ్‌కిరణ్, మల్లెల ఆరాధన రా జా, పొట్టూరు గణేష్ వద్ద గంజాయిని స్వాధీనం చేసుకు ని..నిందితులను గుంటూరు డీఎస్పీ భానోదయ వద్ద హాజరు పరిచినట్లు తెలిపారు. పోలీస్ సిబ్బంది నరసింహా, అశోక్, ప్ర సాద్, శ్రీను, చిరంజీవి, తదితరులున్నారు.

విలువలతో కూడిన విద్యతో కీర్తి

● రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు



చాగంటి కోటేశ్వరరావును సన్మానిస్తున్న వీసీ, రెక్టార్, రిజిస్ట్రార్

ఏఎన్‌యూ ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్యతో కీర్తి చేకూరుతుందని ప్రవచన కర్త, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవాల్లో భాగంగా వ్యక్తిత్వ నిర్మాణం, నైతిక విలువలు అనే అంశంపై వర్సిటీలో చాగంటి ఉపన్యసించారు. మనిషి పెరిగే కొద్దీ ప్రేమ, దయ, క్షమా గుణం ఉందని, చదువు వల్ల వినయ విధేయతలు రావాలన్నారు. వీసీ గంగాధరరావు మాట్లాడుతూ.. ఎంత ఎదిగినా విలువలేని జీవితం వ్యర్థమన్నారు. ముందుగా చాగంటి కోటేశ్వరరావు, ఉపకులపతి కె.గంగాధరరావు, రెక్టార్ శివరామ్‌ప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం జ్యోతి ప్రజ్వలన చేశారు. పీజీ కోఆర్డినేటర్ కృష్ణారావు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లింగరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం 540 అడుగులు

విజయపురిసౌత్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం శనివారం నాటికి 540 అడుగులు ఉంది. ఇది 188.32 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8529, ఎడమ కాలువ ద్వారా 8022 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 22893 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బిసి ద్వారా 2200 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సి ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 41944 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 41944 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



అన్న క్యాంటీన్లో టిఫిన్ చేస్తున్న మహిళలతో మాట్లాడుతున్న కమిషనర్ మయూర్ అశోక్

అన్న క్యాంటీన్లలో పరిశుభ్రత పాటించాలి

● కమిషనర్ కే మయూర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : అన్న క్యాంటీన్లలో పరిశుభ్రత పాటించాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. చుట్టుగుంట సెంటర్ లోని అన్న క్యాంటీన్‌ని శనివారం కమిషనర్ పరిశీలించి ఆహారం తీసుకుంటున్న వారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని అన్న క్యాంటీన్లలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆహారం తీసుకుంటున్న వారితో మాట్లాడి, ఆహార నాణ్యత, రుచిపై అడిగి తెలుసుకొని, ఏమైనా సమస్యలు ఉంటే తెలియచేయడానికి ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అభివృద్ధి పనులలో నిర్దేశిత ప్రమాణాలు పాటించాలి

నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులలో నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తూ, గడువు మేరకు పూర్తి చేసేలా ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. నల్లపాడు మెయిన్ రోడ్డు నుంచి రైల్వేస్టేషన్ రోడ్డులో జరుగుతున్న మేజర్ డ్రెయిన్ నిర్మాణ పనులు, తెలగమాంబ చెరువుని పరిశీలించి, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ నల్లపాడు రైల్వేస్టేషన్ రోడ్‌లో జరుగుతున్న మేజర్ డ్రైన్ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలన్నారు. నల్లపాడు తెలగమాంబ చెరువులో జరుగుతున్న జంగిల్ క్లియర్‌ని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకొని, రెండు రోజుల్లో రెవెన్యూ, ఇరిగేషన్, జీఎంసీ అధికారులతో సంయుక్త సమావేశం నిర్వహించాలని ఎస్‌ఈ, సీపీలను ఆదేశించారు. వార్డు సచివాలయ కార్యదర్శులతో మాట్లాడుతూ యూనిఫైడ్ సర్వే, ఆస్తి పన్ను వసూళ్లు నూరు శాతం పూర్తి చేయాలన్నారు. పర్యటనలో సీపీ రాంబాబు, ఎస్‌ఈ వెంకటేశ్వరరావు, ఈఈలు సుందర్రామిరెడ్డి, విష్ణు, డీసీపీ సూరజ్, ఇంజనీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సకాలంలో పనులు చెల్లించాలి : కమిషనర్

సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధిలో భాగస్వాములు కావాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ కోరారు. అంకిరెడ్డిపాలెంలోని జి.ఇమాన్యుయేల్ తన ఖాళీ స్థలానికి సంబంధించి రూ.7 లక్షలు పన్ను చెల్లించడంపై శనివారం నగర కమిషనర్ తమ చాంబర్‌లో అభినందించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరాభివృద్ధిలో పన్నులు ఎంతో కీలకమని, నగరపాలక సంస్థకు బకాయి ఉన్న ప్రతి ఒక్కరూ చెల్లించాలన్నారు. ఇప్పటికే వార్డుల వారీగా డిమాండ్ నోటీసులు, స్లిప్స్ పంపిణీకి అడ్మిన్ కార్యదర్శులకు అందించామన్నారు. పన్ను చెల్లింపుదారులకు వీలుగా క్యాష్ కౌంటర్లను కూడా ఉదయం 8 నుంచి రాత్రి 7 గంటల వరకు పనిచేసేలా సిబ్బందిని కేటాయించామన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, రెవెన్యూ అధికారి రెహ్మాన్, ఇన్‌స్పెక్టర్ వినాయకరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షేక్ లాల్‌వజీర్, పాల్గొన్న టీడీపీ నాయకులు

గల్లా మాధవిపై వైసీపీ దిగజారుడు రాజకీయం

● టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ లాల్ వజీర్

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆదేశాలతో పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవిపై వైసీపీ దిగజారుడు రాజకీయం చేస్తుందని టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ లాల్ వజీర్ మండిపడ్డారు. స్థానిక అరండల్‌పేట, టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గల్లా మాధవిని ఎదుర్కొనే దమ్ము లేక ఇటువంటి విమర్శలకు దిగుతున్నారని అన్నారు. నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే అన్ని విధాలుగా అభివృద్ధి చేశారని, అభివృద్ధిపై చర్చకు రావాలని వైసీపీ నాయకులకు సవాల్ విసిరారు. టీడీపీ అమ్ములపొదిలో బ్రహ్మాస్త్రం గల్లా మాధవి అని అన్నారు. జగన్ పర్యటన సందర్భంగా అంబటి ఇంట్లో దేవుడి గదిలో ఉన్న వస్తువులతో సహా మొత్తం లూటీ చేశారని, దీనికి జగనే సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ బాజీ మాస్టర్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధిని ఓర్వలేక వైసీపీ నాయకులు వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని అన్నారు. వైసీపీ నాయకులు నోటిని అదుపులో పెట్టుకోకపోతే ఆ పార్టీకి ప్రజలే శాశ్వత సమాధి కడతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో షేక్ ఆదంషఫీ, షేక్ జాన్ సైదా, షేక్ ఇల్లాహి, షేక్ ఇర్షాద్, ఎండి ఖాళీలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


హృదయ లయబద్ధత తప్పితే ప్రాణాంతకమే

● కార్డియాజిస్ట్ డాక్టర్ సోమశేఖర్



కార్డియాలజిస్టులకు జ్ఞాపికలు అందజేస్తున్న రామకృష్ణ, సేవకుమార్

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గుండె లయ బద్ధత తప్పితే ప్రాణాంతక పరిస్థితులు ఏర్పడతాయని కార్డియాజిస్ట్ డాక్టర్ జి సోమశేఖర్ తెలిపారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) హాలులో శుక్రవారం రాత్రి గుండె జబ్బులపై వైద్యులకు నిర్వహించిన నిరంతర వైద్య విద్యలో ఆయన ప్రసంగించారు. సభకు ఐఎంఏ గుంటూరు నగర అధ్యక్షుడు డాక్టర్ టీ సేవకుమార్ అధ్యక్షతవహించారు. సాధారణ పరిమితికి దాటి తక్కువ/ఎక్కువ సార్లు హృదయ స్పందన జరిగితే లయబద్ధత తప్పే ప్రమాదం ఉంటుందని డాక్టర్ సోమశేఖర్ వివరించారు. దీనిని తొలి దశలో గుర్తించి పేస్ మేకర్ వంటి చికిత్సలు చేయడం ద్వారా పరిస్థితిని అదుపులోకి తేవచ్చని డాక్టర్ సోమశేఖర్ తెలిపారు. మరో కార్డియాలజిస్ట్ డాక్టర్ బుచ్చిబాబు మాట్లాడుతూ పేస్ మేకర్లలో ప్రస్తుతం పలు రకాలు అందుబాట్లోకి వచ్చాయన్నారు. ఆయా రోగుల్లో హృదయ స్పందనల్లో లోపాలను బట్టి వీటిని అమరుస్తామన్నారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీరామ్ మాట్లాడుతూ నేడు పరిస్థితుల కారణంగా పేస్ మేకర్‌లు అవసరం అవుతున్న రోగుల సంఖ్య పెరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఎంఏ నగర కార్యదర్శి బీ సాయికృష్ణ, కార్డియాలజిస్ట్ గాజుల రామకృష్ణ, వైవీఎస్ ప్రభాకర్, ఎం.నాగేశ్వరరావు డీ అమర్, బీబీ అప్పారావు పాల్గొన్నారు.



రాజధాని అమరావతిలో క్వాంటం వ్యాలి శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌తో పాటు హాజరైన ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ - గుంటూరు (ఆంధ్రజ్యోతి).

అడ్డం తిరిగిన బిడ్డర్

● మిర్చి యార్డు క్యాటరింగ్ టెండర్లలో లోపించిన శాస్త్రీయత

● ధర పేర్కొనకుండానే నోటిఫికేషన్ జారీ

● ఎల్ 1 బిడ్డర్ తక్కువగా కోట్ చేశారని తిరస్కరణ

గుంటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డు(గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ) టెండర్లలో సాంకేతిక అంశాలను విస్మరించారు. కేటరింగ్ చార్జీలు పొందుపరచకుండానే టెండర్ నిర్వహించి ఎల్1ను కాదని ఎల్2 బిడ్డర్‌ని ఎంపిక చేయడంతో వివాదం తలెత్తింది. అన్ని అర్హతలు ఉంటే ఎల్1 బిడ్డర్‌కే నిబంధనల ప్రకారం కాంట్రాక్టు కేటాయించాలి. అయితే ఎల్1 బిడ్డర్ బాగా తక్కువ ధరకి కేటరింగ్ చేస్తానని కోట్ చేశాడని, రేపటి రోజున నాణ్యత తక్కువగా ఆహార పదార్థాలు సప్లై చేసినా, రైతులకు సరిపడా భోజనం పెట్టకపోయినా సమస్యలు వస్తాయని తాము ఎల్2 బిడ్డర్‌ని ఎంపిక చేశామని అధికారులు తెలిపారు. దీనిపై ఎల్1 బిడ్డర్ తాను టెండర్ నిబంధనల మేరకు భోజనం పెట్టకపోతే అప్పుడు ఎలాంటి చర్య అయినా తీసుకోవచ్చని, అలా కాకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయం ఎలా తీసుకొంటారని గట్టిగా ప్రశ్నిస్తూ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చినట్లు సమాచారం. దీంతో కేటరింగ్ సర్వీసు వాయిదా పడింది.

గతేడాది నిత్యం ఒక్కో రైతుపై అల్పాహారం, భోజనానికి రూ.132.65 పైసలు ఖర్చు పెట్టారు. వైసీపీ హయాంలో అయితే ఏకంగా రూ. 150 చెల్లించారు. ఈ రెండు నిర్ణయాలు రాజకీయ నేతల సిఫార్సుల మేరకు జరిగినవన్న విషయం బహిరంగ రహస్యమే. ప్రతీ రోజు రెండు ఇడ్లీ, చట్నీ, కారంపొడి, టీ, సోమ, బుధ, శుక్రవారంలో అయితే కట్టె పొంగలి (సాంబారుతో), మంగళ, గురువారంలో టమాటబాత్ వడ్డించాలి. మధ్యాహ్న భోజనంలో స్వీటు, గుడ్డు, బీపీటీ/సోనామసూరి బియ్యంతో తయారు చేసిన అన్నం, పప్పు, 50 గ్రాముల వేపుడు కూర, రోటీ పచ్చడి, సాంబారు, ఇగురు కూర(శాకాహారం), గడ్డపెరుగు, అప్పడాలు/గొట్టాలు/చక్రాలు వడ్డన చేయాల్సి ఉంటుంది.

అంచనా లోపం..

టెండర్ నిబంధనల ప్రకారం మార్కెటింగ్ అధికారులు తొలుత తాము నిర్ణయించిన మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం పెడితే ఎంత ధర అవుతుందో అంచనాలు వేయించాలి. ఇందుకోసం ఎస్ఎస్ఆర్ వర్గాలను కూడా సంప్రదించవచ్చు. అప్పుడు ఆ అంచనా విలువతో టెండర్ నోటిఫికేషన్ పిలిస్తే కాంట్రాక్టర్లు లెస్, ఎక్సెస్‌లు వేస్తారు. ఈ నిబంధన పాటించకపోవడంతో ప్రస్తుత సీజన్ టెండర్లలో ఎల్1 బిడ్డర్ రూ.88, ఎల్2 బిడ్డర్ రూ.99కి వేశారు. అలాంటప్పుడు ఎల్1 బిడ్డర్‌నే ఎంపిక చేయాలి. అతను నిబంధనలకు లోబడి సరఫరా చేయకపోతే చర్యలు తీసుకొని బ్లాక్ లిస్టు చేసి ఎల్2 బిడ్డర్‌ని అనుమతించొచ్చు. ఇది చేయకపోవడంతో ఇప్పటి వరకు బిడ్డర్ ఎంపిక ప్రక్రియ పూర్తి కాలేదు. మరోవైపు గత నెలలో మంత్రి అచ్చెన్నాయుడు సమావేశం నిర్వహించినప్పుడు యార్డులో ఉచిత భోజనం సర్వీసు ప్రారంభించాలని రైతులు కోరారు. దీనిపై వెంటనే చర్య తీసుకోవాలని మంత్రి ఆదేశించి నెల దాటుతోన్నా అమలుకు నోచుకోలేని పరిస్థితి ఏర్పడింది.

అసెంబ్లీకి రాకుండా జగన్ డ్రామాలు

● గుంటూరు, తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్



మాట్లాడుతున్న నసీర్ అహ్మద్

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నప్పుడు ప్రజల దగ్గరకు రాకుండా పరదాల చాటున దాక్కున్న జగన్ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీ కమిటీ ఛైర్మన్ నసీర్ అహ్మద్ విమర్శించారు. మంగళగిరిలోని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ చేస్తోన్న రాజకీయ యాత్రలతో వైసీపీకి చెందిన ఇద్దరు మృతికి కారణమయ్యారని, మంచి భవిష్యత్తు ఉన్న ఇలాంటి వారిని పొట్టనబెట్టుకున్నారని మండిపడ్డారు. మృతి చెందిన వారికి కూటమి ప్రభుత్వం తరపున ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నామని చెప్పారు. వైసీపీకి చెందిన టీమ్ 11 మాత్రం ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకుంటూ అసెంబ్లీ గడప తొక్కకపోవడమేమిటని ప్రశ్నించారు. తాడేపల్లి నుంచి గుంటూరుకు రావడానికి 32 కిలోమీటర్ల దూరాన్ని ఏడు గంటలు చేశారంటే జగన్‌ను ఏమనాలని ప్రశ్నించారు. హంతకుడైన పిన్నెల్లి కోసం, డ్రగ్స్ దందా నడుపుతున్న కొండారెడ్డి కోసం, నకిలీ మద్యం కేసులో ముద్దాయిల కోసం, దళితులను కిడ్నాప్ చేసి కిరాతకంగా హత్యగావించిన కిరాయి గూండాల కోసం జగన్ యాత్రలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని ఓర్వలేక ఇలాంటి చీప్ పాలిటిక్స్ చేస్తున్నారని చెప్పారు.

ఎమ్మెల్యేను సత్కరించిన బీజేపీ నాయకులు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌ను శనివారం బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా నియమితులైన మిర్చియార్డు డైరెక్టర్ శ్రావణ కుమారి, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్‌లను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలో కూటమి పార్టీలు మరింత సమన్వయంతో కలసి పని చేయాల్సిన అవసరముందని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం నసీర్ అహ్మద్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సురేష్ జైన్, షేక్ సాంబశివరావు, జితేంద్ర గుప్తా, మైలవరపు ప్రవీణ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మార్చి 5న సివిల్స్ అభ్యర్థులకు మోడల్ పరీక్ష

● ఎంపికైన వారికి ఉచిత వసతి, శిక్షణ

● డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఛైర్మన్ పీవీ లక్ష్మయ్య

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : సివిల్స్‌కు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు మార్చి 5న ఉచిత మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్టు డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఛైర్మన్, ఏపీ పశు వైద్య మండలి బోర్డు అధ్యక్షుడు డాక్టర్ పీవీ లక్ష్మయ్య తెలిపారు. గుంటూరు, పశు వైద్యశాల ప్రాంగణంలోని వైద్య మండలి బోర్డు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పారా అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్, వెంకటపాటి విద్యా దీవెన ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తునట్టు చెప్పారు. ఈ ఏడాది ప్రముఖ సామాజికవేత్త సిబిఆర్ ప్రసాదు సహకారంతో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్తున్నట్టు చెప్పారు. మోడల్ పరీక్షలలో ప్రతిభ కనబరిచిన 200 మంది అభ్యర్థులను ఎంపిక చేసి, మహిళా అభ్యర్థులకు ఇబ్రహీంపట్నంలోని కేతనకొండలో, పురుషులకు వినుకొండలో మూడు సంవత్సరాల పాటు ఉచిత శిక్షణ, ఉచిత వసతి సదుపాయాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను మార్చి 1లోపు అందజేయాలని, 5న పరీక్ష, 10వ తేది నుంచి తరగతులు ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. వివరాలకు 78420 54669 నెంబర్లో సంప్రదించాలని సూచించారు. జూన్ నుంచి 6 నుంచి 12వ తరగతి విద్యార్థుల కోసం పాఠశాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సామాజిక సేవకుడు సీబీఆర్ ప్రసాద్, పల్నాడు జిల్లా వీహెచ్‌పీ నాయకుడు భాగవతుల రవికుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీవీ లక్ష్మయ్య, పాల్గొన్న సామాజిక వేత్త సీబీఆర్ ప్రసాదు తదితరులు

సామాజిక న్యాయ పరిరక్షణకు ఉద్యమం : ముప్పాళ్ల

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శత వార్షికోత్సవాల స్ఫూర్తితో ప్రజాస్వామ్యం, లౌకికత, సామాజిక న్యాయ పరిరక్షణ కోసం పోరాటాలకు సిద్ధమవుతున్నట్టు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. గుంటూరు, సీపీఐ కార్యాలయంలో శనివారం పచ్చల శివాజీ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సభ్యుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న మతోన్మాద రాజకీయాలు ప్రజల మధ్య విభజనకు దారి తీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ప్రజాస్వామ్యాన్ని రక్షించాలంటే రానున్న ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని కోరారు. ఈనెల 12న జరిగే సార్వత్రిక సమ్మెలో రైతాంగం, కార్మిక వర్గాలు, అన్ని ప్రజా సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి కోటా మాల్యాద్రి మాట్లాడుతూ మెడికల్ మాఫియా దోపిడీకి వ్యతిరేఖంగా ఈనెల 14న జిల్లా స్థాయిలో ధర్నాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో జంగాల అజయ్‌కుమార్, మేడా హనుమంతరావు, అకిటి అరుణ్‌కుమార్, వలీ, పుప్పాల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఐదుగురు పేకాట రాయుళ్ళు అరెస్టు

గుంటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సంగడిగుంట వడ్డెర బజారు జీరోలైను ఎదురు ఇంటిలో పేకాట రాయుళ్ళపై టాస్క్ ఫోర్స్ బృందం దాడులు చేసింది. ఐదుగురు పేకాట రాయుళ్ళను అదుపులోకి తీసుకుని 5 సెల్ ఫోన్‌లు, మూడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, రూ.20,390 నగదు సీజ్ చేశారు.

మిర్చియార్డులోకి వాహనాల ప్రవేశానికి తొలగిన అడ్డంకి

గుంటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మిర్చియార్డు వద్ద నల్లపాడు రోడ్డులో నిర్మిస్తోన్న ఫ్లైవోవర్ బ్రిడ్జి కింది నుంచి వాహనాలు ప్రవేశించడానికి అడ్డంకులను ఎన్‌హెచ్‌ఏఐ తొలగించింది. అండర్ పాస్ కోసం శ్లాబు నిర్మాణాన్ని ఆ సంస్థ పూర్తి చేసింది. ఇప్పటికే వాహనాలు రాకపోకలు కూడా సాగిస్తున్నాయి. దీంతో పల్నాడు, ప్రకాశం, కర్నూలు జిల్లాల నుంచి వచ్చే మిర్చి టిక్కీల వాహనాలు యార్డు వద్ద నేరుగా ఎడమ వైపునకు తిరిగి లోనికి ప్రవేశించొచ్చు. చుట్టుగుంట వైపు నుంచి వెళ్లే వాహనాలు సర్వీసు రోడ్డులో నుంచి లోనికి వెళ్లొచ్చు. అయితే సీజన్‌లో మాత్రం వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే సమయంలో పోలీసుల/గార్డులు అక్కడ అందుబాటులో ఉండి క్రమబద్ధీకరించాల్సి ఉంటుంది. వచ్చే ఏడాదికి ఫ్లైవోవర్ పనులు పూర్తి అయిపోయే అవకాశం ఉండటంతో ఈ సంవత్సరం యార్డు వద్ద కొంత అసౌకర్యం తప్పదన్న అభిప్రాయం వ్యక్తమౌతుంది. ఈ నేపథ్యంలో గేట్లు అన్ని తెరిచి సరుకుని లోనికి అనుమతించాలని రైతులు, వ్యాపారస్థులు మార్కెటింగ్ శాఖని కోరుతున్నారు.



మిర్చియార్డులోకి సరుకు వాహనాల రాకపోకలకు అడ్డంకిని తొలగించిన ఎన్‌హెచ్‌ఏఐ

షిర్డీ సాయి ఆధ్యాత్మిక సేవా సమితి సేవలు ప్రశంసనీయం

● నగర మేయర్ రవీంద్ర, భాష్యం రామకృష్ణ

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గోరంట్ల వెంకటేశ్వర కాలనీలోని షిర్డీ సాయి ఆధ్యాత్మిక సేవాసమితి అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, భాష్యం సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ తెలిపారు. సేవ సమితి 25 వార్షికోత్సవం సందర్భంగా శనివారం గోరంట్ల ఐడీ హాస్పిటల్‌లో రోగులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనాధ ఆశ్రమంలో వృద్ధులను పరామర్శించి, వారికి అందుతున్న సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ ఓవీ రమణచే స్థాపించబడిన ఈ సంస్థ పేదల సంక్షేమానికి, అనాధల ఆశ్రయం కల్పించడంలో ఎంతోసేవ చేస్తుందన్నారు. తల్లిదండ్రులు లేని అనాధలను, ఎవరూ లేని నిరుపేదలను అక్కున చేర్చుకొని నిస్వార్థంగా షిర్డీ సాయి ఆధ్యాత్మిక సేవాసమితి అందిస్తున్న సేవలు ఎంతో గర్వకారణం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వరప్రసాద్, పద్మావతి, మాజీ సర్పంచ్ సుబ్బారావు, కమిటీ అధ్యక్షులు ఓరుగంటి విశ్వనాథం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఆలయంలో జరిగిన పూజలో పాల్గొన్న నగర మేయర్ రవీంద్ర, భాష్యం రామకృష్ణ తదితరులు

ఘనంగా విశ్వనాథ సంస్కృతి పురస్కార ప్రదానం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై, దివంగత జై వెంకటేశ్వరరావు ఆకాంక్ష విశ్వనాథ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో విశ్వనాథ సంస్కృతి పురస్కార ప్రదాన వేడుక శనివారం ఘనంగా జరిగింది. కార్యక్రమాన్ని దేవస్థానం ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు ప్రారంభించారు. అనంతరం తెలుగు నెరవు, విశ్వనాథ సాహిత్య అకాడమీ వ్యవస్థాపకులు రమేష్, డాక్టర్ మద్దినేని సింహ కౌటిల్య చౌదరి తదితరులు హాజరై సంపూర్ణ అంకమ్మ కథల గాయకుడు చలంచర్ల దానం అంకయ్యకు శాలువా పూలమాల, నగదుతో విశ్వనాథ సంస్కృతి పురస్కారాన్ని అందజేశారు. అనంతరం వంతలకోటి సాంబమూర్తి కళామండలి డాక్టర్ బొంతల కోటి శంకరరావు భాగవత బృందం చే తూర్పు భాగవతం భామాకలాపం నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో బి.మురళీకృష్ణ, అకాడమీ కార్యదర్శి మోదుగుల రవికృష్ణ, కోశాధికారి డాక్టర్ సెట్లం చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

అమరావతికే మణి కిరీటం...క్వాంటం వ్యాలీ

● తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో క్వాంటం వ్యాలీ తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని, ఒక విధంగా రాజధాని అమరావతికి క్వాంటమ్ వ్యాలీ మణికిరీటంగా మారనుందని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అన్నారు. క్యాంపు కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలోని లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసే కార్యక్రమం జరిగింది. లబ్ధిదారులకు రూ.56.86 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం నసీర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్ ఉన్న నాయకుడని, గతంలో హైటెక్ సిటీ నిర్మాణంతో లక్షల మంది యువత భవితను బంగారుమయం చేశారని చెప్పారు. ఇప్పుడు అమరావతికి క్వాంటమ్ వ్యాలీ కంప్యూటర్ తీసుకొచ్చారన్నారు. దీని ద్వారా రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు రానున్నాయని తెలిపారు. ఇప్పటివరకు నియోజకవర్గ వ్యాప్తంగా రూ.9.28 కోట్ల చెక్కులను పంపిణీ చేశామన్నారు. రాష్ట్రానికే సంజీవనిగా ఉన్న జీజీహెచ్‌లో సంపూర్ణ మౌలిక వసతులు కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల కాలంలోనే కార్పొరేట్ వైద్యాన్ని పేదలకు దరిచేర్చామని చెప్పారు.

అమరావతి క్వాంటం వ్యాలీతో ఏపీలో సరికొత్త సాంకేతిక విప్లవం

● పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గల్లా మాధవి

గుంటూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్వాంటం టెక్నాలజీ రంగంలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ చేతుల మీదుగా తుళ్లూరు ఉద్దండరాయునిపాలెంలో క్వాంటం వ్యాలీ భవనానికి శంకుస్థాపన జరగడం రాష్ట్ర భవిష్యత్తుకు చారిత్రాత్మక ఘట్టమని, క్వాంటం వ్యాలీకి రాష్ట్ర ప్రభుత్వం 50 ఎకరాలు కేటాయించి, దేశంలోనే మొదటి 133 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్‌ను అమరావతిలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆగస్టు నాటికి క్వాంటం వ్యాలీ భవనం నిర్మాణం పూర్తి చేసి, డిసెంబరు నాటికి క్వాంటం కంప్యూటర్‌ను అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళుతోందని, క్వాంటం వ్యాలీ రాష్ట్రానికి "క్వాంటం నెర్వ్ సెంటర్"గా మారనుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి ప్రముఖ సంస్థలు క్వాంటం వ్యాలీలో భాగస్వాములు కావడం అమరావతికి అంతర్జాతీయ గుర్తింపు తెస్తుందని, భారత్‌లో మొదటి క్వాంటం ఇన్నోవేషన్ సెంటర్ అమరావతిలో ఏర్పడటం రాష్ట్ర యువతకు గొప్ప అవకాశాలను కల్పిస్తుందని ఎమ్మెల్యే గల్లా మాధవి తెలిపారు. క్వాంటం కంప్యూటింగ్ వైద్యరంగం, కమ్యూనికేషన్ రంగాల్లో పెనుమార్పులు తీసుకురానుందని, ఈ ఆవిష్కరణల ప్రభావం రాబోయే రోజుల్లో మరింత స్పష్టంగా కనిపిస్తుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

క్వాంటం కంప్యూటింగ్ హబ్‌గా మారనున్న నవ్యాంధ్ర

● క్వాంటం రీసెర్చి ల్యాబ్ సీఈవో కార్తీగణేష్ దురే

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర క్వాంటం కంప్యూటింగ్‌కు హబ్‌గా మారనుందని క్వాంటం రీసెర్చ్ ల్యాబ్స్ ఫౌండర్, సీఈవో కార్తీగణేష్ దురె అన్నారు. చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో 'స్టెప్ ఇంటూ ఫ్యూచర్ - ఇంట్రడక్షన్ టు క్వాంటం కంప్యూటింగ్' అనే అంశంపై శనివారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఇప్పటి నుంచే ఇందుకు సిద్ధం కావాలని, క్వాంటం కంప్యూటింగ్ ఆంధ్రప్రదేశ్ నుండే శ్రీకారం చుడుతూ అమరావతిలో భారతదేశ తొలి క్వాంటమ్ ఎకోసిస్టమ్ శంకుస్థాపన జరగడం దేశానికి శుభపరిణామమని కార్తీగణేష్ దురే అన్నారు. క్వాంటం కంప్యూటింగ్ ద్వారా సమాచారాన్ని ప్రాసెస్ చేసే విధానం, సంక్లిష్ట సమస్యలను వేగంగా పరిష్కరించే సామర్థ్యం, జాతీయ భద్రతకు అందించే భరోసా అని అన్నారు. క్వాంటమ్ టెక్నాలజీలో నైపుణ్యం సాధించిన విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో విస్తృత అవకాశాలు లభిస్తాయని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తెలిపారు. ఇటువంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కార్యక్రమాలు విద్యార్థులను గ్లోబల్ స్థాయి టెక్నాలజీ నిపుణులుగా తీర్చిదిద్దేందుకు దోహదపడతాయని కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, వివిధ విభాగాల హెచ్ఓడీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్తీగణేష్‌దురే, పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులు

డ్రైవర్ చంద్రమౌళికి సత్కారం

కంచికచర్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి గుంటూరు వెళ్తున్న ట్రావెల్స్ స్లీపర్ బస్సు ప్రమాదంలో శుక్రవారం అర్ధరాత్రి ప్రయాణికులను సురక్షితంగా కాపాడిన గుంటూరుకు చెందిన డ్రైవర్ మామిడాల చంద్రమౌళిని అందరూ అభినందిస్తున్నారు. బస్సు వెనుక భాగం నుంచి పొగలు, మంటలు రావడాన్ని గమనించిన చంద్రమౌళి వెంటనే అప్రమత్తమై బస్సును ఆపి, నిద్రమత్తులో ఉన్న ప్రయాణికులను లేపి, సురక్షితంగా కిందకు దించారు. చంద్రమౌళిని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు, రూరల్ డీసీపీ బి.లక్ష్మీనారాయణ, నందిగామ ఏసీపీ ఏబీజీ తిలక్ ప్రత్యేకంగా అభినందించారు. చంద్రమౌళిని నందిగామ రూరల్ సీఐ డి.చవాన్, కంచికచర్ల ఎస్ఐ పి.విశ్వనాథ్, ఎస్ఐ-2 జి.నాని నరేంద్ర సత్కరించారు.


11వ తేదీలోపు అంబటిని కోర్టులో హాజరుపరచండి

● పీటీ వారెంట్ విషయంలో కోర్టు ఆదేశం

గుంటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : పట్టాభిపురం సీఐను బెదిరించిన కేసులో నిందితుడైన మాజీ మంత్రి అంబటి రాంబాబును ఈ నెల 11వ తేదీ లోపు కోర్టుకు హాజరుపరచాలని కోర్టు ఆదేశించింది. సీఎం చంద్రబాబును దూషించిన కేసులో ఇటీవల నల్లపాడు పోలీసులు అరెస్టు చేయగా ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్నాడు. మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో నిర్మించడానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ చేపట్టిన కార్యక్రమం రోజు నిబంధనలకు విరుద్ధంగా భారీ హంగామాతో ర్యాలీగా కలెక్టరేట్ వైపు వెళుతుండగా టీజేపీఎస్ కళాశాల ఎదుట అభ్యంతరం చెప్పిన పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లుపై ఎగబడ్డారు. బారికేడ్‌లను నెట్టుకుంటూ వెళుతూ సీఐని దుర్భాషలాడారు. దీనిపై పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ కేసును అరండల్‌పేట సీఐ ఆరోగ్యరాజు దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఈ కేసులో పోలీసులు కోర్టులో పీటీ వారంట్ దాఖలు చేయగా ఈ నెల 11లోపు కోర్టులో హాజరుపరచాలని కోర్టు ఆదేశించింది. అదేవిధంగా పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మరో రెండు కేసులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా వైసీపీ నిర్వహించిన నిరసన కార్యక్రమం సందర్భంగా కూడా పెద్ద సంఖ్యలో కార్యకర్తలతో కలెక్టరేట్ వైపు వెళుతుండగా టీజేపీఎస్ కళాశాల ఎదుట మరోసారి పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లుపై గొడవపెట్టుకుని బెదిరింపులకు దిగి బారికేడ్లను నెట్టుకుంటూ వెళ్ళిపోయారు. దీనిపై కూడా పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అలాగే సోషల్ మీడియాలో పోస్టులపై అంబటి రాంబాబు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమో దు చేయలేదని నిరసిస్తూ పట్టాభిపురం స్టేషన్ మెట్లపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీనిపై కూడా కేసు నమోదైంది. ప్రస్తుతం ఈ రెండు కేసులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ కేసుల్లో కూడా పోలీసులు కోర్టులో పీటీ వారెంట్ దాఖలు చేయనున్నారు. ఇదిలాఉంటే సీఎం చంద్రబాబును దూషించిన కేసులో అరెస్ట్ అయిన అంబటి రాంబాబును కస్టడీకి ఇవ్వాలని నల్లపాడు పోలీసులు కోర్టులో కస్టడీ పిటీషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం ఈ పిటీషన్‌పై కోర్టులో విచారణ జరుగుతోంది. ఇదిలాఉంటే సీఎంను దూషించిన ఘటనపై రాష్ట్ర వ్యాప్తంగా అంబటిపై పలు కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయా కేసులన్నిం టిని క్వాష్ చేయాలని కోరుతూ హైకోర్టులో అంబటి రాంబాబు పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరగాల్సి ఉంది.

కొండవీడులో ఉత్సవ శోభ





కొండవీడులో ఏర్పాటుచేసిన శాండ్ ఆర్ట్స్

(3వ పేజీ తరువాయి)

ప్రారంభించారు. తొలుత చారిత్రక కట్టడాలను, గొలుసుకట్టు చెరువులను, శాండ్ ఆర్ట్, ఫ్లవర్‌షో గ్యాలరీలను వారు పరిశీలించారు. వెదుళ్ల చెరువులో బోటింగ్ చేశారు.

పర్యాటకంగా అభివృద్ధి చేయాలి

పెమ్మసాని ప్రసంగిస్తూ శౌర్యానికి, సంస్కృతికి సజీవ సాక్ష్యం చారిత్రక కొండవీడు కోట అన్నారు. ఎంతో విశిష్టత కలిగిన ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలన్నారు. ఎత్తైన కొండలు, పచ్చదనం, మెలికలు తిరిగిన ఘాట్‌రోడ్డుతో కొండవీడు ప్రకృతి ప్రేమికులకు ఓ వరమన్నారు. ఎంతో చరిత్ర కలిగిన ఈ ప్రాంత సాహిత్య, శిల్ప, చిత్ర కళలను భావితరాలకు తెలియచేయాలన్నారు. శత్రువులు దాడిచేయకుండా ఎత్తైన ప్రదేశంలో కోట నిర్మాణం, దశాబ్దాల క్రితమే నీటి సంరక్షణకు గొలుసుకట్టు చెరువుల ఏర్పాటు, సంస్కృతి సంప్రదాయాలకు, కళలకు ప్రాధాన్యం ఇవ్వడం కొండవీడులో గమనించదగిన అంశాలన్నారు. మంత్రి ఆనం ప్రసంగిస్తూ తెలంగాణలో గోల్కొండ మాత్రమే ఉందని, మన రాష్ట్రంలో ఉత్తరకోస్తా నుంచి రాయలసీమ వరకు ఎన్నో చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాంతాలు ఉన్నాయన్నారు. కొండవీడు ఆధ్యాత్మిక, చారిత్రక ప్రాంతంగా విలసిల్లడం దీని ప్రత్యేకత అన్నారు. కొండపై శివాలయం పునఃనిర్మాణానికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఎంతో చరిత్ర కలిగిన ఈ ప్రాంతం గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్య తెలియని రోజుల్లోనే నీటి నిల్వ కోసం కొండవీడు కొండలపై గొలుసుకట్టు చెరువులు నిర్మించడం అద్భుతమన్నారు. రిజర్వు ఫారెస్ట్‌గా ఉన్నందున ఇక్కడ జూపార్కు ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి ప్రసంగిస్తూ రాజధానికి సమీపంలోని కొండవీడును ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అనువైన ప్రాంతమని తెలిపారు. టెంపుల్ టూరిజంగా కొండవీడును మారుస్తామన్నారు. కొండవీడులోని చారిత్రక ఆనవాళ్లను, శాసనాలను పునరుద్ధరిస్తామన్నారు. ఈ ప్రాంత అభివృద్ధిలో భాగస్వామిగా మారేందుకు గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి అంగీకరించడం అభినందనీయమన్నారు. మంత్రులను, ఎమ్మెల్యేలను తీసుకొచ్చి ఈ ప్రాంత అభివృద్ధికి సహకరించాలని అసెంబ్లీ సమావేశాల్లో కోరతామన్నారు.

అభివృద్ధిలో భాగస్వామ్యం : నడికట్టు రామిరెడ్డి

ఎంపీ లావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటిల సూచనల మేరకు కొండవీడుకోట అభివృద్ధికి సహకారం అందిస్తామని గోల్కొండ గ్రూపుసంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో మాజీమంత్రి నన్నపనేని రాజకుమారి, గ్రంథాలయసంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, జేసీ సంజనా సింహా, డీఎఫ్‌వో కృష్ణప్రియ, ఆర్డీవో మధులత తదితరులు పాల్గొన్నారు.

సందడే సందడి..

కొండవీడు ఉత్సవాల తొలిరోజు కార్యక్రమాలు సందడిగా సాగాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెలీరైడ్, బోటింగ్, ట్రెక్కింగ్, హార్స్‌రైడ్‌లకు పలువురు ఆసక్తి చూపారు. తొలుత ఘాట్‌రోడ్డు ప్రారంభంలో చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన హెలీరైడ్‌ను ఎమ్మెల్యే ప్రత్తిపాటి, కలెక్టర్ కృతికాశుక్లా ప్రారంభించగా హెలికాప్టర్ ఎక్కేందుకు సందర్శకులు ఆసక్తి చూపారు. చెరువులకు వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన శాండ్ ఆర్ట్, ఫ్లవర్ షో సందర్శకులను కట్టిపడేశాయి. ఫుడ్‌కోర్టులు, వివిధ రకాల స్టాళ్లు సందర్శకులతో కిటకిటలాడాయి. కొండ దిగువన ఘాట్ మార్గంలో ఏర్పాటు చేసిన స్టాల్‌లో అరకు కాఫీని పలువురు రుచి చూశారు. లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో అమ్మవారిని సందర్శించారు. కొండలపైన చారిత్రక కట్టడాలను, ప్రాకారాలను, బురుజులను సందర్శకులు వీక్షించారు. కొండవీడు చరిత్రను తెలిపే బోర్డులను ఆసక్తిగా తిలకించారు. చిల్డ్రన్స్ పార్కులో చిన్నారులు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. చెక్‌పోస్టు సమీపంలో పర్యాటకశాఖ యోగా కార్యక్రమం నిర్వహించగా ఆసనాలను పలువురు తిలకించారు. సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను, అతిథులను ఆకట్టుకున్నాయి.

ఆకట్టుకున్న వందేమాతరం ప్రదర్శన

కొండవీడు ఉత్సవాల్లో భాగంగా జాతీయ గీతం-150 సంవత్సరాలు అనే అంశంపై కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వశాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్(సీబీసీ) ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభించారు. బకింగ్ చంద్రచటోపాధ్యాయ అరుదైన చిత్రాలు, వందేమాతర గీతానికి సంబంధించిన చారిత్రక విశేషాలను ప్రదర్శించగా పలువురు ఆసక్తిగా గమనించారు. ఈ గీతంలోని ప్రతి పదం నేటికీ ప్రేరణని చ్చేదిగా, వికసిత్ భారత్ సాధనకు మార్గదర్శకంగా నిలుస్తుందని కేంద్ర, రాష్ట్ర మంత్రులు తెలిపా రు. సీబీసీ అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్ మాట్లా డుతూ తొలిరోజే వెయ్యిమందికి పైగా విద్యార్థులు ప్రదర్శనను తిలకించినట్లు చెప్పారు. విద్యార్థులకు తక్షణ వందేమాతరం క్విజ్ పోటీని నిర్వహించి బహుమతులు అందజేశామన్నారు.



పాటల లోగోను ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్రమంత్రి ఆనం రాంనారాయణరెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే పుల్లారావు తదితరులు



ఉత్సవాలను తిలకిస్తున్న ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్, కలెక్టర్ కృతికా శుక్లా



హెలికాప్టర్‌లో వెళుతున్న ఎమ్మెల్యే పుల్లారావు, కలెక్టర్ కృతికా శుక్లా, ఆర్డీవో మధులత



స్కిట్ ప్రదర్శిస్తున్న జబర్దస్త్ టీం



కొండవీడు ఫెస్ట్ సమావేశంలో మాట్లాడుతున్న నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

పాఠశాల విద్యార్థులతో కళకళ

● మెడికల్ ఎగ్జిబిషన్‌కు పెరుగుతున్న సందర్శకులు
● రోజుకు రెండు వేల మంది రాక

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన మెడికల్ ఎగ్జిబిషన్ మెడ్‌ఫ్యూజన్-26 పాఠశాల, కళాశాల విద్యార్థులతో శనివారం కళకళలాడింది. పలు ప్రైవేటు విద్యా సంస్థలు తమ విద్యార్థులను బస్సుల్లో వైద్య కళాశాలకు చేర్చాయి. వారాంతం కావడంతో పెద్ద సంఖ్యలో పిల్లలు ఈ మెడికల్ ఎగ్జిబిషన్‌ను తిలకించేందుకు వచ్చారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కళాశాల వైద్యాధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. సగటున రోజుకు రెండు వేల మంది పిల్లలు, పెద్దలు ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శిస్తున్నారు. శనివారం ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ, అనాటమీ, ఫార్మకాలజీ వంటి విభాగాల్లో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. స్టాల్స్‌లో వలంటీర్లుగా ఉన్న వైద్య విద్యార్థులు పిల్లలకు ఆయా విశేషాలను వివరించారు. మెదడు, కాలేయం, కిడ్నీలు, జీర్ణాశయం వంటివి ఒరిజినల్ అవయవాలు ఏర్పాటు చేయడంతో వాటిని తిలకించిన పిల్లలు ఆశ్చర్యచకితులయ్యారు. కొందరు ఆసక్తి ఉన్న పిల్లలకు చేతికి గ్లౌవ్ ఇచ్చి చిన్న పేగులు, పెద్ద పేగులు వంటి వాటిని చేతితో పట్టుకొని చూసేవిధంగా వలంటీర్లు అనుమతించడంతో విద్యార్థులు ఆనందభరితులయ్యారు.

● ఆకట్టుకుంటున్న శస్త్రచికిత్స విభాగాలు

శస్త్రచికిత్స విభాగం, శిశు శస్త్రచికిత్స విభాగం, శిర శస్త్రచికిత్స విభాగం వంటి పలు స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన వివిధ అంశాలను, ఆపరేషన్ థియేటర్ నమూనా సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. న్యూరాలజీ విభాగంలో ఏర్పాటు చేసిన పలు బ్రెయిన్ గేమ్స్ చిన్నారులతో పాటు పెద్దలను ఆకర్షించాయి. కపాలం నుంచి తలకు విస్తరించే 12 జతల కపాల నాడులపై రూపొందించిన ఐదు నిమిషాల నిడివి గల వీడియో ప్లే పిల్లలను ఎంతగానో ఆకట్టుకుంది. ఫార్మకాలజీ విభాగంలో ఏర్పాటు చేసిన చిన్న పిల్లలకు సంబంధించిన స్టాల్స్‌లో.. వారంలో రెండు రోజులు, మూడు రోజులు, ఐదు రోజులు ఇలా ఎంత ఎక్కువగా జంక్ ఫుడ్ తింటే పిల్లల్లో మెదడు చురుకుదనం ఏవిధంగా తగ్గిపోతుందో వివరించే నమూనా తల్లిదండ్రులకు కనువిప్పు కలిగిస్తుంది. కొన్ని పాఠశాలల నుంచి ప్రాథమిక స్థాయి విద్యాభ్యాసం చేసే పిల్లలూ ఎగ్జిబిషన్ తిలకించేందుకు రావడం విశేషం. గుంటూరు నగర పరిసర ప్రాంతాలకు చెందిన గ్రామీణులు కూడా ఈ విజ్ఞాన ప్రదర్శనకు వస్తున్నారు. ఈ సందర్భంగా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీ అన్ని విభాగాలను సందర్శించి సందర్శలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం కూడా పెద్ద సంఖ్యలో విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకించేందుకు వస్తారని జీఎంసీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



సందర్శకులతో వైద్య కళాశాల వద్ద సందడి వాతావరణం



మానవ అవయవాలను పట్టుకుని చూస్తున్న విద్యార్థిని

నాటకాన్ని బతికించడం ప్రభుత్వ బాధ్యత

● తెలుగు నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ ● వైభవంగా సాగుతున్న నాటక మహోత్సవం

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నాటకాన్ని బతికించటం, నాటక కళను ప్రజల్లోకి తీసుకెళ్లటం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని తెలుగు నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. గుంటూరు శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళన సంఘం వేదిక (యడ్లపాడు), నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా-ఢిల్లీ వేదిక (ఎన్ఎస్ఈ) సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న భారత్ రంగ అంతర్జాతీయ నాటక మహోత్సవం వైభవంగా సాగుతోంది. శనివారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హజరైన గోపాలకృష్ణ మాట్లాడుతూ, ఈ అంతర్జాతీయ నాటక మహోత్సవాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి, రాష్ట్ర స్థాయిలో మరింత ప్రోత్సాహం అందేలా కృషి చేస్తామన్నారు. మరో అతిథి ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ, అంతర్జాతీయ నాటక మహోత్సవానికి గుంటూరు వేదికవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. ఈ సభకు నాటక వేదిక అధ్యక్షుడు ముత్తవరపు సురేష్ బాబు అధ్యక్షత వహించగా, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, గజల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొని నాటక రంగ ప్రాధాన్యంపై తమ అభిప్రాయాలు తెలిపారు. అనంతరం లికాజ్ చోట్‌కౌస్కి రచన, దర్శకత్వం వహించిన ధీటర్ మలబార్ హోటల్ పోలెండ్ దేశం వారు ప్రదర్శించిన ఉమాదేవి అబ్‌సర్వ్ వాండా డైనోస్కా పోలాండ్ చారిత్రక నాటకం ప్రేక్షకులను భావోద్వేగాలకు గురిచేసింది. ఈ నాటకాన్ని ప్రముఖ విశ్లేషకురాలు ఉమాదేవి ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు.



మాట్లాడుతున్న గుమ్మడి గోపాలకృష్ణ, వేదికపై కేఎస్ లక్ష్మణరావు తదితరులు

● అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

అంతకుముందు కళాకారులు, చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. పిడుగురాళ్ల ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు, నరసరావుపేట కృష్ణవేణి గ్లోబల్ స్కూల్ చిన్నారులు ప్రదర్శించిన కోలాట నృత్యం, నాదెండ్ల సాయి స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన జానపద నృత్యం, చెక్కభజన, సత్తెనపల్లి చిన్నారులు ప్రదర్శించిన ఏకపాత్రాభినయం, బుర్రకథ ఆహూతులను ఆకట్టుకున్నాయి.

ఆడిట్‌లో అవినీతిపై.. విచారణ

(3వ పేజీ తరువాయి)

వల్ల ప్రభుత్వ ఖజానాకు చెల్లించాల్సిన మొత్తాలు పూర్తిగా దాటవేయబడుతున్నాయా అనే ప్రశ్నకు ఇప్పటివరకు సమాధానం లేదు. 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాల మధ్యలో రూ.లక్షల విలువ కలిగిన సుమారు 1500కి పైగా ఆడిట్ అభ్యంతర పేరాలు సరైన డాక్యుమెంటేషన్ లేకుండా క్లియరైనట్లు తెలుస్తోంది. ఈ విధమైన ఆడిట్ సడలింపుల కారణంగా ఆర్థిక నియంత్రణ బలహీనమవుతోందని, ఆ ప్రభావం చివరికి పరిశోధన, రైతు ప్రయోజన పథకాలపై పడుతోందన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఈ పరిస్థితుల్లో ఈ మొత్తం వ్యవహారంపై సంబంధిత అధికారులు ఇప్పటికే ప్రాథమిక విచారణ ప్రారంభించినట్లు సమాచారం. విచారణలో ఫైళ్లు, క్లియరెన్సుల విధానం, బాధ్యతల పంపిణీపై స్పష్టత వస్తే, బాధ్యులెవరో తేలే అవకాశం ఉంది.

క్వాంటం విప్లవానికి.. పునాది

(3వ పేజీ తరువాయి

టెక్నాలజీ కేంద్రంగా అమరావతిని మారుస్తామని చెప్పారు. క్వాంటం వ్యాలీతో అమరావతి ఖ్యాతి ప్రపంచవ్యాప్తమవుతుందన్నారు. ఇప్పటివరకు అమెరికాలోని సిలికాన్ వ్యాలీ గురిం చి చెప్పుకున్నామని, ఇప్పుడు అమరావతిలోని క్వాంటంవ్యాలీ గురించి చెప్పుకుంటారన్నారు. రైతుల త్యాగానికి ఇది తగిన గుర్తింపు, గౌరవం అన్నారు. క్వాంటం నిపుణులను తయారు చేయడమే కాదు, ముందు ముందు క్వాంటం కంప్యూటర్లను కూడా తయారు చేస్తామన్నారు. అమరావతిలో ఏఐ, క్వాంటం కోర్సులు అందించేలా అత్యాధునిక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తామ న్నారు. అమరావతిని ఏఐ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీలకు కేంద్రంగా మారుస్తానన్నారు. తొలుత మేధాటవర్స్‌లో దీన్ని ప్రారంభించి, ఆ తర్వాత అమరావతికి తరలి స్తామని చెప్పారు. ఏప్రిల్ 14 అంతర్జాతీయ క్వాంటం దినోత్సవం రోజున 2 ఇండీజినస్ క్వాంటం కంప్యూటర్లను రెఫరెన్సు ఫెసిలిటీ ఎస్ఆర్ఎం నుంచి ప్రారంభిస్తామని తెలిపారు. కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ మాట్లాడుతూ అందరూ ఇవాళ నిద్రపోయి రేపటి గురించి కలలు కంటారని, కానీ చంద్రబాబు రేపులో నిద్రపోయి, ఆ మరుసటి రోజు గురించి కలలు కంటారని అదే ఆయన దార్శనికతకు నిదర్శనమని కితాబిచ్చారు. భారత్‌ను సాంకేతికపరంగా అత్యున్నతంగా మార్చడానికి నేషనల్ క్వాంటం మిషన్ సహా అనేక మిషన్లు ఆవిష్కరించుకున్నామన్నారు. అందులో భాగంగానే తొలి క్వాంటం వ్యాలీ అమరావతిలో ఆవిష్కృతం అవుతోందన్నారు. మంత్రి లోకేశ్ మాట్లాడుతూ అభివృద్ధి కోసం తహతహలాడుతున్న కారణంగా క్వాంటం వ్యాలీ అమరావతికి వచ్చిందన్నారు. తొలి మూడు క్వాంటం కేంద్రాల్లో అమరావతి ఒకటిగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ క్వాంటం సైన్స్ అండ్ టెక్నాలజీ, నేషనల్ క్వాంటం మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాకథాన్ 2026లో విజేతలుగా నిలిచిన బృందాలకు సర్టిఫికెట్లు, నగదు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, కందుల దుర్గేశ్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, ప్రొఫెసర్లు కామకోటి, సత్యనారాయణ, మధుమూర్తి, ఐటీ సెక్రటరి కాటంనేని భాస్కర్, ఎల్‌అండ్‌టీ, టీసీఎస్, ఐబీఎమ్ ప్రతినిధులు సతీష్, హారిక్‌విన్, అమిత్‌సింఘీ, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, కలెక్టర్ తమీమ్‌అన్సారియా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగిసిన విజ్ఞాన్ మహోత్సవ్

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీలో విజ్ఞాన్ మహోత్సవ్-2కే26 ముగింపు కార్యక్రమాలు శనివారం అత్యంత ఉత్సాహంగా సాగాయి. మహోత్సవ్ వేదికపై కపుల్ ఫ్రెండ్లీ చిత్ర బృందం సందడి చేసింది. హీరో సంతోష్ శోభన్, హీరోయిన్ మానస వారణాసి విద్యార్థులతో కలిసి స్టెప్పులేశారు. వివిధ రాష్ట్రాల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఏదైనా సాధించాలనే బలమైన సంకల్పం ఉంటే.. ఆకాశమే హద్దుగా రాణించవచ్చని మరో అతిథి 2025 ఏషియన్ చాంపియన్‌షిప్ గోల్ మెడలిస్ట్, భారత హెప్టాథ్లెట్ నందిని అగసారా పేర్కొన్నారు. క్రీడల్లో ఉంటే చదువును అశ్రద్ధ చేస్తారనేది కేవలం అపోహ మాత్రమేనన్నారు. విద్యార్థులు కెరీర్‌లో విజయం సాధించడానికి ఏకాగ్రత, అంకితభావం కఠిన శ్రమ ఎంతో అవసరమని అన్నారు. యాక్టర్ దీక్షిత్ శెట్టి మాట్లాడుతూ.. ఏ రంగంలో ఇష్టం ఉంటే ఆ రంగంలో రాణించాలని సూచించారు. ప్రతి అపజయం ఒక విజయంలాంటిదేనని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య పేర్కొన్నారు. విజ్ఞాన్స్ మహోత్సవ్ ద్వారా విద్యార్థులకు నూతన అనుభవం పొందే అవకాశం లభించిందని వర్సిటీ సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేవీ కృష్ణకిశోర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.



సావనీర్ విడుదల చేస్తున్న నందిని అగసారా, డాక్టర్ లావు రత్తయ్య తదితరులు



మాట్లాడుతున్న హీరో సంతోష్‌శోభన్, చిత్రంలో హీరోయిన్ మానస వారణాసి

అట్టహాసంగా కొండవీడు ఉత్సవాలు


కొండవీడు ఉత్సవాలను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, రాష్ట్ర మంత్రి ఆనం. చిత్రంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, కలెక్టర్ కృతికా శుక్లా

ఉత్సాహంగా.. ఉల్లాసంగా సాగుతున్న ఫెస్ట్

యడ్లపాడు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి నిర్వహిస్తున్న కొండవీడు ఉత్సవాలు-2026 శనివారం ఉదయం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు ముఖ్య అతిథులుగా హాజరై ఉత్సవాలను ప్రారంభించారు. ముందుగా కొండలపై ఉన్న చారిత్రక కట్టడాలను, గొలుసుకట్టు చెరువులను, ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన శాండ్ ఆర్ట్, ఫ్లవర్‌షో గ్యాలరీలను పరిశీలించారు. వెదుళ్ల చెరువులో బోటింగ్ చేశారు. సామూహిక యోగా సాధనతో కొండవీడు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ అద్భుతమైన నిర్మాణాలు, శిల్పకళ, చిత్రకళ, జలకళకు ప్రతీక కొండవీడు అన్నారు. ఈ ఘన చరిత్ర భావితారాలకు తెలియజేయాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సంకల్పం అభినందనీయమన్నారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలు అద్భుతంగా ఉన్నాయని కలెక్టర్ కృతికా శుక్లాను అభినందించారు. కాగా, కొండవీడు ఉత్సవాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. యువత, విద్యార్థులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు. కొండలపై రాజు, రాణీల కోటలు, కారాగారం, వజ్రాగారం, ధాన్యాగారం, అశ్వ, గజశాలలు, మందిరాలను చూసి పర్యాటకులు సరికొత్త అనుభుతులను సొంతం చేసుకుంటున్నారు. సుందరమైన ఘాట్ రోడ్డు.. ప్రాచీన దేవాలయాలు, అరుదైన ఔషధ వృక్షాలను చూస్తూ అరుదైన అనుభూతిని పొందుతున్నారు. పిల్లలు పెద్దలు కోట అందాలను హెలి రైడ్ ద్వారా ఆకాశం నుంచి వీక్షించేందుకు ఆసక్తి చూపారు. ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫల పుష్ప ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. ట్రెక్కికింగ్, రాక్ క్లైంబింగ్ వంటి సహాస క్రీడలు హెలి, హార్స్ రైడ్‌లు ప్రత్యేక ఆకర్షణ నిలుస్తున్నాయి. ఆదివారం కూడా ఉత్సవాలు కొనసాగనున్నాయి.


వెదుళ్ల చెరువులో బోటు షికారు చేస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు


శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం మండలం తంబాలహట్టి-హేమావతి రహదారిని శుభ్రం చేయిస్తున్న పంచాయతీరాజ్ అధికారులు

క్రికెటర్ దీపిక సొంతూరుకు రోడ్ల నిర్మాణం

» 2 రహదారులకు రూ.6.20 కోట్లు మంజూరు చేసిన డిప్యూటీ సీఎం

అమరాపురం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అంధ మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపిక సొంతూరు తంబాలహట్టికి బీటీ రోడ్డు నిర్మిస్తున్నారు. అంధ మహిళల టీ20 ప్రపంచ కప్ గెలిచిన అనంతరం, కెప్టెన్ దీపిఇక తమ గ్రామ సమస్యలను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లిన విషయం తెలిసిందే. దీంతో ఆయన స్పందించి శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం మండలం తంబాలహట్టి నుంచి హేమావతికి, గుణేహళ్లికి బీటీ రోడ్లు మంజూరు చేశారు. తంబాలహట్టి-హేమవతి రోడ్డుకు రూ.3.20 కోట్లు, తంబాలహట్టి-గుణేహళ్లి రోడ్డుకు రూ.3 కోట్లు మంజూరు చేశారు. తంబాలహట్టి-హేమవతి రోడ్డుకు సాంకేతిక అనుమతులు రావడంతో పంచాయతీరాజ్‌శాఖ ఈఈ మురళీకృష్ణ, డీఈఈ వెంకటేశ్వర్లు క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఇప్పటికే ఆ మార్గంలో జంగిల్ క్లియరెన్స్, రోడ్డు చదును పనులు చేయించారు. గుణేహళ్లి రహదారి పనులను కూడా త్వరలోనే ప్రారంభిస్తామని అధికారులు చెప్పారు.

బూతులు మాట్లాడే చెత్త నాయకులే జగన్‌కు కీలకం: కొల్లు

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): 'బూతులు తిట్టి... రెచ్చగొట్టి, చివరికి తన్నులు తిన్నవారి పరామర్శకు వెళ్లే దుస్థితికి జగన్ దిగజారాడు. ఇలాంటి పరామర్శల ద్వారా ఆ విద్వేష చర్యల వెనుక తానే ఉన్నానని జగన్ చాటుకుంటున్నారు' అని మంత్రి కొల్లు రవీంద్ర ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'తెనాలిలో బ్లేడ్ బ్యాచ్ పరామర్శకు వెళ్లి తాను అలాంటి వారినే ప్రోత్సహిస్తాననే సందేశమిచ్చిన వ్యక్తి జగన్. వైసీపీ నేతల బూతుల వల్లే ఆ పార్టీ 151 నుంచి 11కి పడిపోయింది. అయినా జగన్ గ్యాంగ్‌కు బుద్ధి రావడం లేదు. గంట, అరగంట అంటూ నిస్సిగ్గుగా మాట్లాడిన వారికి, చంద్రబాబు ఇంటిపైకి దాడికి వెళ్లిన వారికి మంత్రి పదవులు ఇచ్చిన ఘనత జగన్‌ది. ఇలాంటి చెత్త నాయకులే జగన్‌కు కీలకం. ఇప్పటికీ వైసీపీ వారి బుద్ధి మారకుంటే ఆ పార్టీ అధోగతి పాలవ్వడం ఖాయం' అని కొల్లు మండిపడ్డారు. కాగా, ప్రజల సమస్యలను గాలికొదిలేసి కేవలం తన ఉనికిని కాపాడుకునేందుకే జగన్ యాత్రల పేరుతో డ్రామా చేస్తున్నారని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అన్నారు.

ఆర్డీఎస్ఎస్ పనులు వేగవంతం చేయండి: సీఎస్

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి):రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం(ఆర్డీఎస్ఎస్) కింద చేపట్టిన విద్యుత్తు సరఫరా, పంపిణీ నష్టాల తగ్గింపు పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ డిస్కంలను ఆదేశించారు. విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయంలో శనివారం డిస్కంల సీఎండీలు ఎల్.శివశంకర్, పృథ్వీతేజ్, పుల్లారెడ్డితో సీఎస్ వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం ఆర్డీఎస్ఎస్ అమలుకు ప్రాధాన్యత ఇస్తోందని సీఎస్ పేర్కొన్నారు. ట్రాన్స్‌కో డైరెక్టర్ ఏకేవీ భాస్కర్, అధికారులు పాల్గొన్నారు.

అంధుల క్రికెట్ విజయాలకు చంద్రబాబు ప్రోత్సాహమే మూలం

» క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రవీంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అంధుల క్రికెట్ విజయాలకు విజనరీ చంద్రబాబు ప్రోత్సాహమే మూలమని క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఏపీ రాష్ట్ర కార్యదర్శి గొర్రెపాటి రవీంద్రబాబు అన్నారు. భారత అంధుల మహిళా క్రికెట్ జట్టు సాధించిన చారిత్రాత్మక విజయానికి గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నగదు ప్రోత్సాహకాలపై చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

పదో తరగతి ఇంగ్లిష్ పరీక్ష తేదీ మార్పు

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌లో స్వల్పంగా మార్పులు చేశారు. వచ్చేనెల 16 నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు సంబంధించి ఇప్పటికే ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఇంగ్లిష్ పరీక్షను మార్చి 20న నిర్వహించాల్సి ఉండగా, ఆ రోజు రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పండుగ సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించింది. దీంతో ఆ పరీక్షను మార్చి 21న నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పరీక్షల సంచాలకుడు డాక్టర్ కె.వి.శ్రీనివాసులురెడ్డి శనివారం తెలిపారు. మిగిలిన అన్ని పరీక్షలూ ముందుగా ప్రకటించిన టైమ్ టేబుల్ ప్రకారం యథావిధిగా జరుగుతాయన్నారు.

'ఉపాధి' పథకాన్ని ఖూనీ చేస్తున్న మోదీ: షర్మిల

తడ/సూళ్లూరుపేట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీని గాడ్సే హత్య చేస్తే.. ఉపాధి హామీ పథకాన్ని మోదీ ఖూనీ చేస్తున్నారని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలం కోట పోలూరు గ్రామంలో ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర కార్యక్రమం శనివారం జరిగింది. షర్మిల మాట్లాడుతూ యూపీఏ ప్రభుత్వ హయాంలో మొదలైన ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా ఎన్డీఏ ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. మహాత్మాగాంధీ పేరుతో ఉన్న ఉపాధి హామీ పథకాన్ని పేదలకు దూరంచేసే దిశగా కేంద్రం అడుగులు వేస్తోందన్నారు. ఉపాధి పథకాన్ని పరిరక్షించుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు.


కాంగ్రెస్ శ్రేణులతో షర్మిల

పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతి సంతృప్తికరం

» ప్రాజెక్టు అథారిటీ సీఈవో యోగేశ్ పైతాన్కర్

పోలవరం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు పురోగతి సంతృప్తికరమని ప్రాజెక్టు అథారిటీ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) యోగేశ్ పైతాన్కర్ పేర్కొన్నారు. పోలవరం ప్రధాన డ్యాం పనుల్లో గ్యాప్ 1,2 పనులు, ఎర్త్‌కం రాక్ ఫిల్ డ్యాం పనులను శనివారం ఆయన పరిశీలించారు. వాటి నిర్మాణ పురోగతి వివరాలను సంబంధిత అధికారులను, మేఘా కాంట్రాక్టు ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం ప్రాజెక్టును నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాయన్నారు. దీనికి అనుగుణంగా జలవనరుల శాఖ అధికారులు నిర్దిష్ట ప్రణాళికలు రూపొందించుకుని పనులు వేగవంతం చేయాలన్నారు.


పోలవరం ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఈవో

నేటి నుంచి శ్రీశైలంలో బ్రహ్మోత్సవాలు

మహా శివరాత్రికి సుందరంగా ముస్తాబు

» ఆర్జిత సేవలన్నీ తాత్కాలికంగా నిలిపివేత

» భక్తులు వేచి ఉండేందుకు 20 కంపార్ట్‌మెంట్లు

» 39 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాట్లు


బ్రహ్మోత్సవాల సందర్భంగా విద్యుద్దీపాలంకరణలో శ్రీశైల ప్రధాన ఆలయం

శ్రీశైలం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైలంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ఈ నెల 18 వరకు నిర్వహించనున్నారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు ప్రతినిత్యం విశేషార్చనలు, ప్రత్యేక పూజలు, పలు వాహనసేవలతో గ్రామోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో ఎం.శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేశ్‌నాయుడు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆర్జిత సేవలన్నీ తాత్కాలికంగా నిలిపివేశారు. వీఐపీలకు సైతం స్పర్శ దర్శనాలు నిలిపివేశారు. అలంకార దర్శన విధానాల్లో మార్పులు చేశారు. వీఐపీ విరామ దర్శనాలు మూడు స్లాట్లు, ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శనాలు నిరంతరం కొనసాగేలా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. జ్యోతిర్ముడి సమర్పించే భక్తులకు మాత్రం ఆదివారం నుంచి ఈ నెల 12వరకు స్పర్శ దర్శనానికి అవకాశం కల్పించనున్నారు. భక్తులు వేచి ఉండేందుకు పూర్తి సదుపాయాలతో 20 కంపార్టుమెంట్లు సిద్ధం చేశారు. శివరాత్రికి ముందు 4రోజులపాటు భక్తులకు ఉచితంగా లడ్డూ ప్రసాదాల వితరణ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. వివిధ ప్రాంతాలను కలుపుతూ 39 ఎకరాల విస్తీర్ణంలో వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు. సుమారు రూ.12 కోట్లతో సదుపాయాలు కల్పిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

వాహన సేవలు ఇలా..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం యాగశాల ప్రవేశం, ధ్వజారోహణ నిర్వహిస్తారు. 9న భృంగి వాహన సేవ, 10న హంస వాహనం, 11న మయూర వాహనం, 12న రావణ వాహనం, 13న పుష్ప పల్లకీ సేవ, 14 గజవాహన సేవ నిర్వహించనున్నారు. 15(మహా శివరాత్రి రోజు)న ప్రభోత్సవం, నంది వాహనసేవ, లింగోద్భవకాల మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పాగాలంకరణ, స్వామి, అమ్మవార్ల బ్రహ్మోత్సవ లీలాకల్యాణం, 16న రథోత్సవం, తెప్పోత్సవం, 17న యాగపూర్ణాహుతి, ధ్వజావరోహణ నిర్వహిస్తారు. 18న అశ్వవాహన సేవ, పుష్పోత్సవం, శయనోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

ముఖ్యమంత్రికి ఆహ్వానం


శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను సీఎం చంద్రబాబుకు అందించి, ఆశీర్వదిస్తున్న వేదపండితులు

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 8 నుంచి 18 వరకు శ్రీశైలంలో జరిగే బ్రహ్మోత్సవాలకు సీఎం చంద్రబాబును స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, ఆలయ బోర్డు చైర్మన్ రమేశ్ నాయుడు, ఆలయ అధికారులు ఆహ్వానించారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో శనివారం సీఎంని కలిసిన వీరు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను సీఎంకి అందజేశారు. ఆలయ పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లను సీఎంకి వివరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. మంత్రి లోకేశ్‌ను కూడా శ్రీశైలం బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు.

నకిలీ డీఎస్పీ అరెస్టు

» గ్రూప్-1లో ఎంపికైనట్టు చెప్పుకోవడంతో..

మోటివేషనల్ క్లాస్‌లకు విద్యా సంస్థల ఆహ్వానం

» పోలీస్ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని

డబ్బు తీసుకున్నట్టు మహిళ ఫిర్యాదు

విశాఖపట్నం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పరీక్ష రాసి డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికయ్యానని చెప్పుకొంటూ, పోలీసు శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురి నుంచి డబ్బులు వసూలు చేసిన నకిలీ డీఎస్పీ చెల్లుబోయిన లోచన్‌కుమార్ (26)ను ఫోర్త్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని అల్లిపురం సమీపంలోని భూపేష్ నగర్‌కు చెందిన లోచన్‌కుమార్ తనకు పోలీస్ శాఖలో ఉద్యోగం వచ్చిందని జనాలను నమ్మిస్తూ తిరుగుతున్నాడు. తాజాగా విడుదలైన గ్రూప్-1 పరీక్షల్లో డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికయ్యానని ప్రచారం చేసుకుంటున్నాడు. గతంలో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చితో దిగిన ఫొటోను చూపించి, తనను ఆయన అభినందించారంటూ చెప్పుకోసాగాడు. లోచన్‌కుమార్ డీఎస్పీ పోస్టుకు ఎంపికైనట్టు కొన్ని పత్రికల్లో సైతం (ఆంధ్రజ్యోతిలో కాదు) వార్తలు రావడంతో రాష్ట్రంలోని కొన్ని విద్యాసంస్థలు మోటివేషన్ క్లాస్‌లకు పిలవసాగాయి. అయితే ఇటీవల ఒక మహిళ తనకు పోలీస్ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ లోచన్‌కుమార్ రూ.11 లక్షలు తీసుకుని మోసం చేశాడని ఫోర్త్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నెల్లూరులో ఉన్న లోచన్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో లోచన్‌కుమార్ అసలు గ్రూప్-1లో ఉత్తీర్ణత సాధించలేదని తేలింది. అతనిపై ఎంవీపీ కాలనీ, మల్కాపురం, ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్లలో ఒక్కొక్కటి, ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో రెండు మోసం కేసులు ఉన్నట్టు తేలింది. లోచన్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

లైంగిక వేధింపుల బాలలకు అండగా..

» సపోర్ట్ పర్సన్స్‌ను నియమించనున్న ప్రభుత్వం

» జిల్లాకు ఒకరు చొప్పున మొత్తం 28 మంది నియామకం

» బాలల సంక్షేమ శాఖ సంచాలకుడు వేణుగోపాల్ రెడ్డి వెల్లడి

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులకు గురైన బాలలకు అండగా నిలిచేందుకు, వారికి న్యాయపరమైన, మానసిక సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర బాలల సంక్షేమ శాఖ సంచాలకులు ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. పోక్సో చట్టం-2012, సెక్షన్ 39 ప్రకారం బాధితులకు కేసు విచారణకు ముందు, విచారణ సమయంలో మార్గదర్శకత్వం, కౌన్సెలింగ్ ఇచ్చేందుకు సపోర్ట్ పర్సన్స్‌ను నియమించనున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మార్గదర్శకాల మేరకు ఈ నియామకాలు జరుగుతాయన్నారు. రాష్ట్రంలో మొత్తం 28 మంది సపోర్ట్ పర్సన్స్‌ను నియమిస్తారని, ప్రతి జిల్లాకు ఒకరు ఉంటారన్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ సంచాలకులు, సంబంధిత జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో ఈ నియామక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. లైంగిక వేధింపులకు గురైన పిల్లలకు న్యాయ విచారణ సమయంలో తోడుగా ఉంటూ, వారికి కౌన్సెలింగ్ అందించడం వీరి ప్రధాన బాధ్యత అన్నారు. పోస్టులకు కావాల్సిన విద్యార్హతలు, విధులు, ఇతర నిబంధనలతో కూడిన ప్రత్యేక నోటిఫికేషన్లను ఆయా జిల్లాల కలెక్టర్లు త్వరలోనే విడుదల చేస్తారన్నారు. బాధితులైన బాలలకు భరోసా కల్పించి, వారి హక్కులను కాపాడటమే ఈ నియామకాల ప్రధాన ఉద్దేశమని వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.

కల్తీనెయ్యి దోషులను శిక్షించాలి

» కుంచం వెంకట సుబ్బారెడ్డి

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యిని సరఫరా చేసిన వ్యవహారంలో దోషులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని రాయలసీమ రాష్ట్ర సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ కుంచం వెంకట సుబ్బారెడ్డి చేశారు. వైవీ సుబ్బారెడ్డి, అశోక్ సింఘాల్, ధర్మారెడ్డి తదితరులను 30 రోజుల్లోపు అరెస్టు చేయాలని, లేదంటే తిరుపతి ఎస్పీ కార్యాలయం వద్ద భారీ ధర్నా చేపడతామని హెచ్చరించారు.

పంచాయతీ ఎన్నికల తొలి ప్రక్రియ ప్రారంభం

» వచ్చే నెల 9 నాటికి వార్డుల వారీ ఓటర్ల జాబితా

సిద్ధం చేయాలంటూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మార్చి నెలాఖరు నాటికి గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ముగియనుంది. దీంతో అప్రమత్తమైన రాష్ట్ర ఎన్నికల కమిషన్ చట్ట ప్రకారం తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేసింది. మార్చి 9 నాటికి గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేసుకోవాలని అన్ని జిల్లాల పంచాయతీ అధికారులకు కమిషన్ సూచించింది. ఈ ఏడాది జనవరి 1 నాటికి సిద్ధమైన అసెంబ్లీ ఓటర్ల జాబితా తీసుకుని, వార్డుల వారీగా ఫొటో ఓటర్ల జాబితా సిద్ధం చేసుకోవాలని పేర్కొంది. అయితే గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలంటే ముందుగా బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయాలి. అందుకు డెడికేటెడ్ కమిషన్ వేయాల్సి ఉంది. మరో వైపు మార్చి నెలాఖరుకు ప్రస్తుతమున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని పదవీ కాలం ముగియనుంది. ఈ లోపు కొత్త రాష్ట్ర ఎన్నికల కమిషన్ నియామకానికి నోటిఫికేషన్ జారీ చేయాలి. ఈ ప్రక్రియలు పూర్తికావడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉంది.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు


శ్రీవారి ఆలయం ఎదుట జస్టిస్ హరిహరనాథ రెడ్డి(మధ్యలో), జస్టిస్ శ్రీనివాస్‌రెడ్డి (మధ్యలో)

తిరుమల, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ హరిహరనాథ శర్మ, జస్టిస్ శ్రీనివాస్‌రెడ్డి దర్శించుకున్నారు. దర్శనం అనంతరం రంగనాయక మండపానికి చేరుకున్న న్యాయమూర్తులను వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. అలాగే హైకోర్టు రిజిస్ట్రార్(విజిలెన్స్) శ్రీనివాస శివరామ్, రిజిస్ట్రార్(జ్యుడిషియల్) కమలాకర్‌రెడ్డి, చెన్నై హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ నాగార్జున్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

» జస్టిస్ గన్నమనేని రామకృష్ణ



మాట్లాడుతున్న జస్టిస్ గన్నమనేని రామకృష్ణ

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరికి బాధ్యత కావాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ అన్నారు. గుంటూరులోని జాగర్లమూడి చంద్రమౌళి న్యాయ కళాశాలలో శనివారం ప్రారంభమైన ఐదవ జాతీయస్థాయి మూట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మూట్ కోర్టు పోటీల ద్వారా న్యాయ విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చని సూచించారు. నిరంతర కృషి ద్వారా న్యాయవాద వృత్తిలో రాణించవచ్చునని పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో న్యాయవాదుల పాత్రను ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు వివరించారు. ఈ పోటీలలో తొమ్మిది రాష్ట్రాల నుంచి 28 జట్లు పాల్గొంటున్నట్టు నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ కొండబోలు కృష్ణ ప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ సుధాకర్ బాబు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పెరగనున్న చలి

» రేపటి నుంచి ఉష్ణోగ్రతల్లో పెరుగుదల

విశాఖపట్నం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మధ్యభారతంలో నెలకొన్న అధికపీడనం ప్రభావంతో ఉత్తరాది నుంచి చలిగాలులు వీస్తున్నాయి. దీంతో రాష్ట్రంలో ఎక్కువచోట్ల శనివారం చలి తీవ్రత కొనసాగింది. కోస్తాలో పలుచోట్ల ఉదయం పొగమంచు కురిసింది. ఏజెన్సీలో మంచు ఎక్కువగా నెలకొంది. రాత్రి ఉష్ణోగ్రతలు సగటు కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. అరకులోయలో 7.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఆదివారం కోస్తా, రాయలసీమల్లో చలి ఎక్కువగా ఉంటుందని, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని, కోస్తాలో పలు ప్రాంతాల్లో పొగమంచు కురుస్తుందని వాతావరణ శాఖ తెలిపింది. సోమవారం నుంచి పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరిగే అవకాశం ఉందని పేర్కొంది.

గోదావరిలో మొసళ్లు.. పాపికొండల వద్ద సంచారం

» బంధించే ప్రయత్నంలో అధికారులు: మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పాపి కొండల వద్ద గోదావరిలో మొసళ్ల సంచారం ఉన్నట్టు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేశ్ చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శనివారం విలేకరుల సమావేశంలో ఈ అంశం ప్రస్తావనకు రాగా, పాపికొండల వద్ద మొసళ్లు సంచరిస్తున్నట్టు అధికారులు తన దృష్టికి తెచ్చారని మంత్రి తెలిపారు. ఏడు రోజుల పాటు ముప్పుతిప్పలు పెట్టిన పెద్దపులిని బంధించినట్టే మొసళ్లను పట్టేస్తారని, ఇప్పటికే మొసళ్ల వేటలో అధికారులు నిమగ్నమయ్యారని చెప్పారు.



చిత్రజ్యోతి
SINCE 1965

ఐమ్యాక్స్ అనుభూతి... కొన్ని సన్నివేశాల్లోనే!



రాజమౌళి

'వారణాసి' చిత్రం గురించి హాలీవుడ్ మీడియాకు రాజమౌళి ఇచ్చిన ఇంటర్వ్యూల ద్వారా ఇప్పటికే పలు ఆసక్తికర విషయాలు తెలిశాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ సినిమాను ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో తీసుకురావడం గురించి ఆయన కీలక విషయాలు వెల్లడించారు. 'వారణాసి' పుణ్య క్షేత్రంతో భారతీయులందరికీ ఎప్పటికీ ప్రత్యేకమైన అనుబంధం ఉంటుంది. తెరపై అద్భుతమైన అనుభూతిని అందివ్వడం కోసమే ఈ చిత్రాన్ని ఆ ప్రాంతం నేపథ్యంలోనే తెరకెక్కిస్తున్నాను. ఈ చిత్రాన్ని ప్రేక్షకులకు ఏ ఫార్మాట్‌లో చూపిద్దాం అనే విషయంలో చాలా కసరత్తు చేశాం. ఎందుకంటే 'వారణాసి' సినిమా మొత్తం ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో ఉండదు. కీలక సన్నివేశాలు మాత్రమే ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో ఉంటాయి. అలా కొన్ని సన్నివేశాలు తప్ప మిగతా సినిమా మొత్తం మనకున్న సినిమా స్కోప్ థియేటర్ల ఫార్మాట్‌లోనే ఉంటుంది. ఈ క్రమంలోనే 'సినిమా స్కోప్ తెరల కోసం చిత్రీకరించి అసలుసిసలు ఐమ్యాక్స్ ఫార్మాట్‌లోకి మారుద్దామా? లేక మొత్తం ఐమ్యాక్స్‌లోనే తీసి ఆ తర్వాత సినిమా స్కోప్ తెరల కోసం మారుద్దామా' అనే చర్చలు జరిగేవి. 'రెండు రకాల షాట్లను కలిపి చూపిద్దాం' అని ఆ చర్చల్లో వచ్చిన సలహా నాకు నచ్చలేదు. 'ప్రత్యేక సన్నివేశాలు వచ్చే సమయానికి ట్రూ ఐమ్యాక్స్‌లో ఉన్నది ఉన్నట్లు చూపిద్దాం' అని వివరించాను. ఇలా చేయడం ఎంత సవాల్‌తో కూడుకున్నదో ప్రేక్షకులకు తెలియజేయాలి. స్క్రీన్ రేషియోలో మార్పులు చేయడం ద్వారా ప్రేక్షకులకు అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని ఇవ్వచ్చని నేను నమ్ముతాను. దాన్ని వారికి ఇవ్వడానికే ఈ కష్టమంతా' అని పేర్కొన్నారు. మహేశ్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న 'వారణాసి' వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ఉగాది సందర్భంగా విడుదలవుతోంది.



'జాతి రత్నాలు'ను మించిన వినోదం

నాగవంశీ

వైవిధ్యమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరించే విష్వక్సేన్, హాస్య చిత్రాల దర్శకుడు కేవీ అనుదీప్ కాంబినేషన్‌లో వస్తోన్న చిత్రం 'ఫంకీ'. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈనెల 13న విడుదలవుతోంది. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. విష్వక్సేన్ మేనరిజమ్స్, కథానాయిక కయాదు లోహర్‌తో కెమిస్ట్రీ ట్రైలర్‌లో ప్రధానాకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా విష్వక్సేన్ మాట్లాడుతూ 'దాదాపు ఏడాది విరామం తర్వాత ఒక మంచి సినిమాతో మీ ముందుకు వస్తున్నాను. 'ఫంకీ' సినిమా ఆద్యంతం మిమ్మల్ని నవ్విస్తుంది' అని అన్నారు. నాగవంశీ మాట్లాడుతూ 'దర్శకుడు అనుదీప్ తన 'జాతిరత్నాలు' చిత్రంతో ఏ స్థాయి వినోదాన్ని పంచారో, అంతకు మించి ఫంకీలో ఉంటుంది. కామెడీ టైమింగ్ సినిమాకు ప్రాణం. ప్రేక్షకులను ఏమాత్రం నిరాశపరచం' అని చెప్పారు. సినిమాలో ప్రతి సన్నివేశం ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తుతుంది అని అనుదీప్ తెలిపారు.



సాంప్రదాయిని... అందరినీ అలరిస్తుంది



నటుడు శివాజీ తన సొంత బ్యానర్ 'శ్రీ శివాజీ ప్రొడక్షన్స్'లో నిర్మించిన చిత్రం 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'. సీనియర్ హీరోయిన్ లయ కీలకపాత్రలో నటించారు. ఈనెల 12న ప్రముఖ ఓటీటీలో విడుదలవుతోంది. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో దర్శకుడు అనిల్ రావిపూడి ట్రైలర్‌ను విడుదల చేశారు. శివాజీ మాట్లాడుతూ 'టీమ్ అంతా కష్టపడి ఒక మంచి చిత్రాన్ని రూపొందించాం. మీ అందరినీ అలరిస్తుందనే నమ్మకం ఉంది' అని తెలిపారు. లయ మాట్లాడుతూ 'ఇప్పటివరకూ నన్ను స్వయంవరంలో రత్నమాలగా గుర్తుపెట్టుకున్న ప్రేక్షకులు ఈ సినిమా తర్వాత ఉత్తరగా గుర్తుపెట్టుకుంటారు. అంతటి వైవిధ్యమైన పాత్రను దర్శకుడు సుధీర్ నాకు ఇచ్చారు' అని తెలిపారు. ఈ చిత్రం ప్రేక్షకులను మెప్పిస్తుందని దర్శకుడు సుధీర్ అన్నారు.

మమ్ముట్టి పాత్రే టర్నింగ్ పాయింట్



మలయాళంలో ఘన విజయం సాధించిన 'చథాపచ్చ: ది రింగ్ ఆఫ్ రౌడీస్' చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సురేశ్ ప్రొడక్షన్స్ సిద్ధమైంది. రోషన్ మాథ్యూ, విశాఖ్ నాయర్, ఇషాన్ ప్రధాన పాత్రల్లో అద్వైత్ నాయర్ తెరకెక్కించిన ఈ చిత్రాన్ని ఈనెల 13న సురేశ్ ప్రొడక్షన్స్ విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో రోషన్ మాథ్యూ మాట్లాడుతూ 'ఈ చిత్రంలో మమ్ముట్టి గారు ఒక ప్రత్యేక పాత్రలో నటించారు. ఈ సినిమాకు ఆయన పాత్రే టర్నింగ్ పాయింట్. మలయాళంలో వచ్చిన స్పందనే ఇక్కడా వస్తుందని ఆశిస్తున్నాను' అని అన్నారు. సురేశ్ ప్రొడక్షన్స్ ప్రతినిధి ప్రవీణ్ మాట్లాడుతూ 'స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన చిత్రమిది. కచ్చితంగా తెలుగు ప్రేక్షకులను మెప్పిస్తుంది' అని అన్నారు.

'మిరాయ్' నటుడు సునీల్ థాపా ఇకలేరు



తెలుగు చిత్రం 'మిరాయ్'లో కీలక పాత్ర పోషించిన ప్రముఖ నేపాల్ నటుడు సునీల్ థాపా(68) ఇకలేరు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన ఆయన, చికిత్స పొందుతూ శనివారం ఉదయం ఖాట్మండులో గుండెపోటుతో మరణించారు. దాదాపు 40 ఏళ్లపాటు నటుడిగా కొనసాగారు. నేపాలీ, హిందీ, భోజ్‌పురి తదితర భాషల్లో 300కి పైగా చిత్రాల్లో నటించారు. 1981లో విడుదలైన బాలీవుడ్ చిత్రం 'ఏక్ దూజే కే లియే'తో సినిమాల్లోకి అడుగుపెట్టారు. నేపాలి చిత్రం 'ఛీనో'లో 'రెటే కైలా'గా కనిపించి విశేష ఆదరణ దక్కించుకున్నారు. 'మేరీ కోమ్'లో ప్రియాంకకు కోచ్ నర్జిత్ సింగ్‌గా నటించి మంచి గుర్తింపు పొందారు.







పాక్ చచ్చీచెడీ..


ఫహీమ్ (29 నాటౌట్)

● 3 వికెట్లతో గెలుపు
● భయపెట్టిన నెదర్లాండ్స్

కొలంబో: టీ20 వరల్డ్‌కప్ గ్రూప్-ఎలో శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్ 3 వికెట్ల తేడాతో నెదర్లాండ్స్‌పై అతికష్టమ్మీద గెలిచింది. తొలుత నెదర్లాండ్స్ 19.5 ఓవర్లలో 147 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్ (37), బాస్ డి లీడ్ (30) టాప్ స్కోరర్లు. సల్మాన్ మీర్జా 3.. నవాజ్, అబ్రార్ అహ్మద్, సలీమ్ తలో 2 వికెట్లు దక్కించుకొన్నారు. ఛేదనలో పాక్ 19.3 ఓవర్లలో 148/7 స్కోరు చేసి గెలిచింది. ఫహీమ్ అష్రఫ్ (29 నాటౌట్) మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడాడు. ఆర్యన్ దత్, పాల్ వాన్ మీకెర్న్ చెరో రెండు వికెట్లు తీశారు. చివరి 12 బంతుల్లో 29 పరుగులు కావల్సి ఉండగా.. 19వ ఓవర్‌లో ఓ డౌడ్ క్యాచ్ చేజార్చడంతో బతికి పోయిన ఫహీమ్ మూడు సిక్స్‌లు, ఫోర్‌తో 24 పరుగులు రాబట్టడంతో మ్యాచ్ స్వరూపం మారిపోయింది.

పునరాలోచనలో పాకిస్థాన్

భారత్‌తో మ్యాచ్ కోసం లంక మధ్యవర్తిత్వం

కొలంబో: అన్నీ అనుకున్నట్టు జరిగితే టీ20 వరల్డ్‌కప్‌లో అత్యంత ఆసక్తికర భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌కు ఎలాంటి ఇబ్బందులూ లేనట్టే.. ఎందుకంటే పాక్ బాయ్‌కాట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా శ్రీలంక క్రికెట్ బోర్డు (ఎస్ఎల్‌సీ) తమ ప్రయత్నాలను ప్రారంభించింది. ఇందులో భాగంగా 15న భారత్‌తో జరిగే మ్యాచ్‌ను ఆడాల్సిందిగా ఇప్పటికే పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కు లేఖ కూడా రాసింది. పాక్‌లో పర్యటించేందుకు ఏ జట్టూ ముందుకురాని పరిస్థితుల్లో తమ జట్టును అక్కడికి పంపిన విషయాన్ని ఆ లేఖలో లంక గుర్తుచేసింది. అంతేకాకుండా ఈ మ్యాచ్ కోసం ఇప్పటికే కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాలు, భద్రతా చర్యలు, ఇతరత్రా ఏర్పాట్ల గురించి అందులో పేర్కొంది. అటు పీసీబీ బాయ్‌కాట్‌తో లంక బోర్డుకు ఆర్థికంగా భారీ నష్టం చేకూరనుంది.

వెస్టిండీస్ బోణీ


షెపర్డ్ (5/20)


హెట్‌మయెర్ (64)

● రాణించిన హెట్‌మయెర్ ● షెపర్డ్ హ్యాట్రిక్
● 35 పరుగులతో స్కాట్లాండ్ పరాజయం

కోల్‌కతా: టీ20 వరల్డ్ కప్‌లో వెస్టిండీస్ బోణీ కొట్టింది. గ్రూప్ 'సి'లో శనివారం జరిగిన తమ ప్రారంభ మ్యాచ్‌లో కరీబియన్లు 35 పరుగులతో స్కాట్లాండ్‌పై విజయం సాధించారు. తొలుత వెస్టిండీస్ 20 ఓవర్లలో 182/5 స్కోరు చేసింది. హెట్‌మయెర్ (36 బంతుల్లో 64) హాఫ్ సెంచరీతో మెరిశాడు. ఛేదనలో పేసర్ రొమారియో షెపర్డ్ (5/20) హ్యాట్రిక్ సహా ఐదు వికెట్లు తీయడంతో స్కాట్లాండ్ 18.5 ఓవర్లలో 147 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ రిచీ బెరింగ్టన్ (24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 42) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాడు. జాసన్ హోల్డర్ (3/30) మూడు వికెట్లు తీశాడు.

హుస్సాముద్దీన్‌కు కాంస్యమే

లా నూసియా (స్పెయిన్): బాక్సమ్ ఎలీట్ ఇంటర్నేషనల్ టోర్నీలో తెలుగు బాక్సర్ హుస్సాముద్దీన్ కాంస్య పతకంతో సరిపెట్టుకున్నాడు. శనివారం జరిగిన 60 కిలోల సెమీ ఫైనల్లో హుస్సాముద్దీన్ ఓటమిపాలయ్యాడు. అలాగే ప్రాంజల్ యాదవ్ (65కి.), కాజల్ (65కి.), సనమాచా చాను (75కి.), మన్‌కీరత్ కౌర్ (80+కి.), జాదుమణి సింగ్ (55కి.), హితేష్ (70కి.) కూడా సెమీఫైనల్లో ఓటమిపాలై కాంస్యాలతో సంతృప్తి పడాల్సివచ్చింది. ఇక.. లవ్లీనా బోర్గోహైన్, సచిన్ ఫైనల్‌కు దూసుకుపోయారు.

తొలిరోజు చెరో గెలుపు

డేవిస్ కప్

బెంగళూరు: డేవిస్ కప్ క్వాలిఫయర్-1 పోరులో తొలిరోజు భారత్-నెదర్లాండ్స్‌తో 1-1తో సమంగా నిలిచాయి. శనివారం జరిగిన రెండు సింగిల్స్‌లో నెదర్లాండ్స్-భారత్ చెరొకటి నెగ్గాయి. హోరాహోరీగా సాగిన రెండో సింగిల్స్‌లో దక్షిణేశ్వర్ 6-4, 7-5తో వరల్డ్ నెం.88 జెస్పెర్ జోంగ్‌కు షాకిచ్చాడు. అంతకుముందు మొదటి సింగిల్స్‌లో సుమిత్ నగాల్ 0-6, 6-4, 3-6తో గయ్ డి ఓడెన్ చేతిలో పోరాడి ఓడాడు.

నాయకుడు నిలిచాడు

● ఆదుకున్న సూర్య
● పోరాడి ఓడిన అమెరికా
● సిరాజ్‌కు 3 వికెట్లు

భారత్‌దే విజయం

టీ20 ప్రపంచకప్


సిరాజ్ (4-0-29-3)


సూర్యకుమార్ (84 నాటౌట్)

ముంబై: కెప్టెన్‌గా తొలి టీ20 వరల్డ్‌కప్‌లో సూర్యకుమార్ యాదవ్ (49 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్సర్లతో 84 నాటౌట్) చెలరేగాడు. యూఎస్ఏ బౌలర్ల విశేష రాణింపుతో భారత బ్యాటర్లు తడబడిన వేళ.. కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో జట్టుకు అండగా నిలిచాడు. అటు పేసర్ సిరాజ్ (3/29) కమ్‌బ్యాక్ బౌలింగ్‌తో ఆకట్టుకోగా.. గ్రూప్ 'ఎ'లో శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ టీమిండియా 29 పరుగులతో బోణీ చేసింది. ముందుగా భారత్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 161 పరుగులు చేసింది. తిలక్ వర్మ (25), ఇషాన్ (20) మోస్తరుగా ఆడారు. పేసర్ వాన్ షాక్విక్‌కు 4, హర్మీత్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో అమెరికా 20 ఓవర్లలో 8 వికెట్లకు 132 పరుగులు చేసి ఓడింది. శుభమ్ (37), సంజయ్ (37), మిలింద్ (34) మాత్రమే రాణించారు. సిరాజ్‌కు 3, అర్ష్‌దీప్‌నకు 2 వికెట్లు లభించాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సూర్యకుమార్ నిలిచాడు.

పోరాటం సరిపోలేదు..: యూఎస్ మొదట్లోనే వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో పడింది. వరుస ఓవర్లలో పేసర్ సిరాజ్ రెండు వికెట్లు తీయగా, 13 పరుగులకే టాప్-3 బ్యాటర్లు పెవిలియన్‌కు చేరడం దెబ్బతీసింది. అయితే మిడిలార్డర్‌లో మిలింద్, సంజయ్ కాసేపు ఆశలు కల్పించారు. ఈ జోడీ సంయమన ఆటతీరుతో నాలుగో వికెట్‌కు 58 పరుగులు జత చేరాయి. చక్కగా కుదురుకున్న వీరిని వరుణ్ విడదీశాడు. తను మిలింద్‌ను అవుట్ చేయగా, కాసేపటికే సంజయ్‌ను అక్షర్ దెబ్బతీశాడు. దీంతో యూఎస్ సాధించాల్సిన రన్‌రేట్ కష్టసాధ్యంగా మారింది. చివర్లో శుభమ్ మెరుపులు ఓటమి తేడాను తగ్గించాయి.

తడబ్యాటుతో మొదలై.. సూర్య అండతో నిలిచి: టాస్ గెలిచిన యూఎస్ కెప్టెన్ మోనంక్ భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించడంతో వాంఖడే స్టేడియం హోరెత్తింది. ఇంకేముంది.. భీకర ఫామ్‌లో ఉన్న బ్యాటర్లు కనీసం 200 స్కోరైనా బాదేస్తారని అంతా భావించారు. కానీ బరిలోకి దిగాక మనోళ్ల ఆటతీరు అంచనాలకు భిన్నంగా సాగింది. బంతి బ్యాట్ మీదికి రాకపోగా అటు ఎక్స్‌ట్రా బౌన్స్, చక్కటి టర్న్‌తో యూఎస్ బౌలర్లు ఆధిపత్యం చూపారు. అయితే ఓ ఎండ్‌లో వికెట్లు కూలుతున్నా కెప్టెన్ సూర్య నిలకడైన ఇన్నింగ్స్‌తో ఆఖరి బంతి వరకు నిలిచి పరువు కాపాడాడు. ఓపెనర్ అభిషేక్ గోల్డెన్ డకౌట్‌గా వెనుదిరిగాడు. అనంతరం ఇషాన్, తిలక్ పోటాపోటీ బౌండరీలతో జోష్ తెచ్చినా, ఆ సంబరం కాసేపే అయ్యింది. ఆరో ఓవర్‌లో ఇషాన్, తిలక్, శివమ్ దూబే (0)లను పేసర్ షాక్విక్ పెవిలియన్ చేర్చాడు. అప్పటికి స్కోరు 46/4 మాత్రమే. ఈ స్థితిలో సూర్యకుమార్, రింకూ (6) డిఫెన్స్‌కు పరిమితమయ్యారు. రింకూ షాట్లు ఆడేందుకు ఇబ్బందిపడి 12వ ఓవర్‌లో వెనుదిరిగాడు. ఇక హార్దిక్ (5) భారీ షాట్‌కు వెళ్లి స్పిన్నర్ హర్మీత్‌కు చిక్కాడు. అయితే నిస్సారంగా సాగుతున్న ఇన్నింగ్స్‌కు 16వ ఓవర్‌లో అక్షర్, సూర్య ఊపుతెచ్చారు. అక్షర్ 4,4.. సూర్య 4,6తో 21 పరుగులు సమకూరాయి. కానీ తర్వాతి ఓవర్‌లోనే అక్షర్‌ను హర్మీత్ అవుట్ చేయడంతో ఏడో వికెట్‌కు 41 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అటు పట్టువదలని సూర్య మాత్రం ఆఫ్‌సైడ్ బంతిని స్కూప్ షాట్‌తో ఫోర్‌గా మలిచి 36 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. టెయిలెండర్ అర్ష్‌దీప్ (4)ను అండగా చేసుకుని ఎడాపెడా షాట్లతో చెలరేగిన సూర్య ఎనిమిదో వికెట్‌కు 22 రన్స్ అందించాడు. ఇక ఆఖరి ఓవర్‌లో వరుసగా 4,6,6,4తో 21 రన్స్ చేయడంతో స్కోరు 160 దాటింది.

1

టీ20ల్లో ఎక్కువ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ (17)లు అందుకున్న భారత బ్యాటర్‌గా సూర్య.

టీ20 వరల్డ్‌కప్‌లో అత్యధిక వరుస విజయాలు (9) అందుకున్న జట్టుగా భారత్.

ఈ మెగా టోర్నీ చరిత్రలో ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక పరుగులిచ్చుకున్న బౌలర్‌గా నేత్రావల్కర్ (0/65). 2007లో జయసూర్య (0/64) రికార్డును అధిగమించాడు.

స్కోరుబోర్డు

భారత్: ఇషాన్ (సి) మిలింద్ (బి) షాక్విక్ 20, అభిషేక్ (సి) సంజయ్ (బి) అలీఖాన్ 0, తిలక్ (సి) మోనంక్ (బి) షాక్విక్ 25, సూర్యకుమార్ (నాటౌట్) 84, దూబే (సి) నేత్రావల్కర్ (బి) షాక్విక్ 0, రింకూ (సి) మిలింద్ (బి) మొహిసిన్ 6, హార్దిక్ (సి) సాయితేజ (బి) హర్మీత్ 5, అక్షర్ (సి) మొహిసిన్ (బి) హర్మీత్ 14, అర్ష్‌దీప్ (సి) మిలింద్ (బి) షాక్విక్ 4, వరుణ్ (రనౌట్) 0; **ఎక్స్‌ట్రాలు 3; మొత్తం: 20 ఓవర్లలో 161/9. వికెట్ల పతనం:** 1-8, 2-45, 3-46, 4-46, 5-72, 6-77, 7-118, 8-140, 9-161; **బౌలింగ్:** నేత్రావల్కర్ 4-0-65-0, అలీ ఖాన్ 2-0-13-1, వాన్ షాక్విక్ 4-0-25-4, మొహిసిన్ 4-0-16-1, శుభమ్ 2-0-16-0, హర్మీత్ 4-0-26-2.

యూఎస్ఏ: గౌస్ (సి) తిలక్ (బి) సిరాజ్ 6, సాయితేజ (సి) వరుణ్ (బి) సిరాజ్ 2, మోనాంక్ (సి) దూబే (బి) అర్ష్‌దీప్ 0, మిలింద్ (స్టంప్) ఇషాన్ (బి) వరుణ్ 34, సంజయ్ (సి) రింకూ (బి) అక్షర్ 37, శుభమ్ (ఎల్బీ) సిరాజ్ 37, హర్మీత్ (సి) సిరాజ్ (బి) అక్షర్ 0; మొహిసిన్ (సి) తిలక్ (బి) అర్ష్‌దీప్ 8, షాక్విక్ (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 20 ఓవర్లలో 132/8. వికెట్ల పతనం:** 1-8, 2-11, 3-13, 4-71, 5-98, 6-98, 7-110, 8-132. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-18-2, సిరాజ్ 4-0-29-3, వరుణ్ 4-0-24-1, అక్షర్ 4-0-24-2, హార్దిక్ 4-0-34-0.


మ్యాచ్‌కు ముందు ఆరంభ వేడుకల్లో బాలీవుడ్ నటి నోరా ఫతే నృత్యం

నేటి మ్యాచ్‌లు

న్యూజిలాండ్ X అఫ్ఘానిస్థాన్ (ఉ. 11 గం. నుంచి)
ఇంగ్లండ్ X నేపాల్ (మ.3 గం.)
శ్రీలంక X ఐర్లాండ్ (రా.7 గం.)

అప్పటిదాకా ఆగాల్సిందే!



వైభవ్ జాతీయ అరంగేట్రానికి అడ్డుగా ఐసీసీ నిబంధనలు

న్యూఢిల్లీ: చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీ తాజాగా ఇంగ్లండ్‌తో జరిగిన అండర్-19 వరల్డ్‌కప్ ఫైనల్లో 175 పరుగుల స్కోరుతో విధ్వంసం సృష్టించాడు. ఈ నేపథ్యంలో సూర్యవంశీని భారత టీ20 వరల్డ్‌కప్ జట్టుకు ఎంపిక చేయాలన్న డిమాండ్ ఊపందుకొంది. కానీ, ఐసీసీ నిబంధనలు అందుకు అడ్డొస్తున్నాయి. క్రికెటర్ల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని.. 2020లో ప్రవేశపెట్టిన నిబంధనల ప్రకారం అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టే ఆటగాడి కనీస వయసు 15 ఏళ్లుగా ఉండాలని నిర్ణయించారు. 2011, మార్చి 27న వైభవ్ జన్మించగా.. 2026, ఫిబ్రవరికి అతడి వయసు సాంకేతికంగా 14 సంవత్సరాలే. భారత జట్టుకు ఎంపిక చేయాలంటే అతను ఈ ఏడాది మార్చి 27 వరకు వేచిచూడాలి. మరోవైపు వైభవ్ అండర్-19 కెరీర్ కూడా ముగిసింది. బీసీసీఐ 'వన్ టైమ్' పాలసీ కింద సూర్యవంశీ మరో యూత్ వరల్డ్‌కప్‌లో ఆడేందుకు అనర్హుడు.

యువ చాంపియన్లకు రూ. 7.5 కోట్ల నజరానా

న్యూఢిల్లీ: అండర్-19 ప్రపంచకప్‌లో చాంపియన్‌గా నిలిచిన యువ భారత జట్టుకు బీసీసీఐ భారీ నజరానా ప్రకటించింది. రూ. 7.5 కోట్లు రివార్డుగా ఇస్తున్నట్టు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా శనివారం వెల్లడించారు. టీమిండియా జింబాబ్వేలోని హరారే వేదికగా శుక్రవారం జరిగిన ఫైనల్లో ఇంగ్లండ్‌ను ఓడించి ఆరోసారి ప్రపంచ కప్‌ను దక్కించుకున్న సంగతి తెలిసిందే.

బెంగాల్ 199/5

ఆంధ్ర 295 ఆలౌట్

కల్యాణి (బెంగాల్): సుదీప్ కుమార్ ఘరామి (112 నాటౌట్) అజేయ శతకంతో ఆదుకోవడంతో.. ఆంధ్రతో రంజీ క్వార్టర్స్‌లో బెంగాల్ కోలుకొంది. అంతకుముందు ఆటకు రెండో రోజైన శనివారం ఓవర్‌నైట్ స్కోరు 264/6తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆంధ్ర 295 పరుగులకు ఆలౌటైంది. ముకేశ్ కుమార్ 5, ఆకాశ్ దీప్ 4 వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన బెంగాల్ 199/5 స్కోరు చేసింది. 43/3తో కష్టాల్లో పడిన సమయంలో సుదీప్, సూరజ్ సింధు (20) నాలుగో వికెట్‌కు 80 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు.

సాగుకు, పాడికి రక్షణ



వాణిజ్య ఒప్పందం సందర్భంగా అమెరికా విడుదల చేసిన మ్యాప్

చైనా, పాక్‌కు అమెరికా షాక్

» మ్యాప్‌లో భారతదేశంలో అంతర్భాగంగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను, అక్సయ్ చిన్‌ను చూపిన వైనం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: కీలకమైన వాణిజ్య ఒప్పందం కుదిరిన వేళ, భారత్‌కు అమెరికా మరో మంచి కబురు అందించింది. ఈ ఒప్పందం సందర్భంగా విడుదలచేసిన మ్యాప్‌లో పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)ను భారత్‌లో అంతర్భాగంగా చూపించింది. కశ్మీర్ విషయంలో భారత్‌ను అంతర్జాతీయ వేదికలపై ఇరుకునపెట్టేందుకు ప్రయత్నిస్తున్న దాయాదికి అగ్రరాజ్యం చర్య శరఘాతమేనని చెప్పాలి. తాత్కాలిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌ను భారత్, అమెరికా శనివారం ఖరారుచేశాయి. ఈ సందర్భంగా అమెరికా వాణిజ్య ప్రతినిధుల కార్యాలయం విడుదల చేసిన భారతదేశ మ్యాప్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తన భూభాగంగా చైనా వాదిస్తున్న అక్సయ్ చిన్‌ను కూడా భారత్‌లో భాగంగా ఈ మ్యాప్‌లో చూపించడం విశేషం, నిజానికి, పాక్ ఆక్రమిత కశ్మీర్, అక్సయ్ చిన్ ప్రాంతాలు మనదేశ పటంలో ఉన్నవే. అయితే, వీటి విషయంలో నిన్నటిదాకా అమెరికా వైఖరి వేరేగా ఉండేది. అమెరికా విడుదల చేసిన పాత మ్యాప్‌ల్లో పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను వేరుగా చూపించారు. ఆ పాత వైఖరి మారిందని తాజా మ్యాప్‌ను చూస్తే స్పష్టం అవుతోంది. దీనిపై నెటిజన్లు, మాజీ సైనికాధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అమెరికాకు ప్రధాని లొంగిపోయారు: కాంగ్రెస్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: భారత్- అమెరికా మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందం మన దేశానికి తీవ్ర నష్టం కలిగిస్తుందని కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తంచేసింది. ఇది ఒప్పందం కాదని, అమెరికాకు మన లొంగుబాటు అని ఆరోపించింది. కాంగ్రెస్ పార్టీ మీడియా ఇన్‌చార్జి పవన్ ఖేరా శనివారం మీడియాతో మాట్లాడుతూ.. గత 75 ఏళ్లుగా భద్రంగా ఉన్న భారతీయ రైతులు, చిన్న వ్యాపారుల ప్రయోజనాలు ఈ ఒప్పందంతో తీవ్ర ప్రమాదంలో పడ్డాయని అన్నారు. ఇతర దేశాలకు లొంగిపోయే తన బలహీనతను ప్రధాని మోదీ మరోసారి బయటపెట్టుకున్నారని విమర్శించారు. 'ఆయన పేరు నరేందర్.. ఆయన పని సరెండర్' అని ఎద్దేవా చేశారు. 'ఈ ఒప్పందంతో అమెరికా వస్తువులకు భారత్ డంపింగ్ గ్రౌండ్‌గా మారుతుంది. ఒప్పందం అంటే రెండు పక్షాలు కూర్చొని, చర్చల ద్వారా సమాన ప్రయోజనాలు కలిగేలా చేసుకొనేది. కానీ, తలకు తుపాకీ గురిపెట్టి బలవంతంగా చేయించేది ఒప్పందం కాదు. ఇది బ్లాక్‌మెయిల్, పూర్తిగా లొంగుబాటు. భారతీయ రైతులు, ఎంఎస్ఎంఈలు, మధ్యతరగతి వర్గాల ప్రయోజనాలను ప్రభుత్వం తాకట్టు పెట్టింది' అని మండిపడ్డారు. ఈ ఒప్పందం వల్ల అమెరికా నుంచి భారత్ ఏటా 100 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులు కొనుగోలు చేయాల్సి ఉంటుందని, అంత డబ్బు ఎక్కడి నుంచి తెస్తారు? దానితో ఏం వస్తువులు కొంటారు? అని ప్రశ్నించారు.

మలేషియాలో త్వరలో యూపీఐ సేవలు: మోదీ

కౌలాలంపూర్, ఫిబ్రవరి 7: అతి త్వరలో మలేషియాలో భారత కాన్సులేట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తామని, డిజిటల్ పేమెంట్ సదుపాయమైన యూపీఐ సేవలను త్వరలో ప్రవేశపెడతామని ప్రధాని మోదీ చెప్పారు. మలేషియాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆయన కౌలాలంపూర్‌లో ప్రవాస భారతీయులు పాల్గొన్న సభలో ప్రసంగించారు. భారత సంతతి వాళ్లు ఎక్కువగా ఉండే రెండో అతిపెద్ద దేశం మలేషియా అని, రెండు దేశాలను అనేక సాంస్కృతిక అంశాలు జోడిస్తున్నాయన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

ఒప్పందంతో భారత రైతులు, పాడి పరిశ్రమ, గ్రామీణ ఉపాధికి ఏమాత్రం నష్టం ఉండదని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ ఈ సందర్భంగా వెల్లడించారు. ఒప్పందంతో పలు రకాల ఉత్పత్తులపై అమెరికా సుంకాలు సున్నాకు తగ్గనున్నాయని, మిగతా ఉత్పత్తులపై 18% టారిఫ్ ఉంటుందని తెలిపారు. ఇక రష్యా నుంచి చమురు దిగుమతులను పూర్తిగా నిలిపివేసేందుకు భారత్ అంగీకరించిందని.. ఈ మేరకు భారత్‌పై విధించిన అదనపు 25శాతం సుంకాలను ఎత్తివేస్తున్నామని అమెరికా ప్రకటించింది. రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించింది. కాగా, ఒప్పందంలోని అంశాలను సమీక్షించి, చట్టబద్ధత కల్పించిన అనంతరం పూర్తిస్థాయి ఒప్పందం అమల్లోకి వస్తుందని వాణిజ్య శాఖ వర్గాలు తెలిపాయి. అమెరికా సుంకాల్లో 25శాతం తగ్గింపు శనివారం నుంచే అమల్లోకి రాగా, మిగతా 25శాతం నుంచి 18శాతానికి తగ్గించే ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. ఇక భారత సుంకాల తగ్గింపు మార్చి నెల మధ్యలో అమల్లోకి వచ్చే అవకాశం ఉందని వాణిజ్యశాఖ వర్గాలు వెల్లడించాయి.

రైతు ప్రయోజనాలకే ప్రాధాన్యం: గోయల్

మన దేశ రైతుల ప్రయోజనాలకు రక్షణ కల్పిస్తూనే.. మన దేశ ఎగుమతులు భారీగా పెరిగేలా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నట్టు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. రైతుల ప్రయోజనాలు, గ్రామీణ జీవనోపాధిని కాపాడాలనే కేంద్ర ప్రభుత్వ నిబద్ధతను ఒప్పందం ప్రతిబింబిస్తోందన్నారు. ఇది మోదీ నాయకత్వంలో భారత్ సాధించిన చరిత్రాత్మక విజయమని అభివర్ణించారు. అన్ని వాణిజ్య చర్చలు, ఒప్పందాల్లో రైతుల ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇటీవల యూరోపియన్ యూనియన్‌తో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలోనూ ఈ మేరకు రక్షణలు కల్పించామని వెల్లడించారు. భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే సుమారు రూ.4 లక్షల కోట్ల(44 బిలియన్ డాలర్లు) విలువైన ఉత్పత్తులపై సుంకాలు సున్నాకు తగ్గిపోనున్నాయని... మరో రూ.2.7 లక్షల కోట్ల (30 బిలియన్ డాలర్లు) విలువైన ఉత్పత్తులపై 18% సుంకాలు ఉంటాయని వెల్లడించారు. మరో రూ.లక్ష కోట్ల(12 బిలియన్ల) విలువైన ఉక్కు, అల్యూమినియం, కాపర్, పలు రకాల వాహనాల విడిభాగాలు తదితర భారత ఉత్పత్తులపై ప్రస్తుత సుంకాలు కొనసాగుతాయని వివరించారు. వచ్చే నాలుగేళ్లలో అమెరికా, భారత్ ద్వైపాక్షిక వాణిజ్యం రూ.45 లక్షల కోట్లకు చేరుతుందని చెప్పారు. ఈ ఒప్పందంతో వచ్చే పదేళ్లలో భారత ఎగుమతిదారుల కోసం మొత్తంగా రూ.2,717 లక్షల కోట్ల (30 ట్రిలియన్ డాలర్లు) మార్కెట్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. దేశంలో చిన్న, మధ్యస్థాయి పరిశ్రమలు, రైతులు, మత్స్యకారులకు అద్భుతమైన అవకాశాలు కల్పిస్తుందని.. యువతకు లక్షలాది ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. త్వరలోనే తుది ఒప్పందంపై సంతకాలు జరిగి, పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తుందని తెలిపారు. ఇది 'న్యాయమైన, సముచిత, సమతౌల్య ఒప్పందం' అని అభివర్ణించారు.



వికసిత్ భారత్ దిశగా: మోదీ

అమెరికాతో వాణిజ్య ఒప్పందం మేకిన్ ఇండియాకు ఊతమిస్తుందని.. రైతులు, మహిళలు, యువత, పారిశ్రామికవేత్తలకు కొత్త అవకాశాలు కల్పిస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. వాణిజ్య ఒప్పందంపై సంయుక్త ప్రకటన అనంతరం 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. "భారత్, అమెరికా ప్రజలకు శుభాకాంక్షలు. మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఫ్రేమ్‌వర్క్‌పై అంగీకారానికి వచ్చాం. ఇరుదేశాల మధ్య లోతైన, విశ్వాసపూర్వకమైన భాగస్వామ్యాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. వికసిత్ భారత్ దిశగా మరో ముందడుగు వేశాం" అన్నారు.

సుంకాలు తొలగిస్తున్నాం: అమెరికా

మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఖరారైన నేపథ్యంలో భారత్‌పై విధించిన అదనపు 25% సుంకాలను ఈ నెల 7వ తేదీ నుంచే రద్దు చేస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేరిట ఉత్తర్వులు జారీ అయ్యాయి. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు నిలిపివేస్తామని, అమెరికా నుంచి భారీగా చమురు కొంటామని భారత్ హామీ ఇచ్చిన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అమెరికా వాణిజ్య, విదేశాంగ, ఆర్థిక శాఖల మంత్రులు, వాణిజ్యశాఖకు చెందిన ఒక ఉన్నతాధికారి, అధ్యక్షుడి ఆర్థిక, జాతీయ భద్రతా సలహాదారులతో కూడిన బృందం ఈ వ్యవహారాన్ని పర్యవేక్షిస్తుందని వెల్లడించారు. ఒకవేళ భారత్ ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ రష్యా నుంచి చమురును దిగుమతి చేసుకుంటే.. తిరిగి 25శాతం సుంకాలను విధిస్తామని హెచ్చరించారు. పదేళ్ల పాటు ఇరు దేశాల మధ్య రక్షణ సహకారాన్ని పెంచడం కూడా వాణిజ్య ఒప్పందంలో భాగమని వెల్లడించారు.

ఒప్పందంలో రక్షణలు ఇవే..

- అమెరికాకు చెందిన ఎలాంటి వ్యవసాయ ఉత్పత్తులకూ కొత్తగా వెసులుబాట్లు ఉండవు. గోధుమలు, బియ్యం, మొక్కజొన్న, సోయా, నూనెగింజలు, పౌల్ట్రీ, ఇతర మాంసం ఉత్పత్తులు, ఇథనాల్, పొగాకు తదితర ఉత్పత్తులపై ఇప్పటికే ఉన్న అధిక సుంకాలు కొనసాగుతాయి.
- కూరగాయలు, చిక్కుడు జాతి ఉత్పత్తులు, బఠానీ, కాబూలీ శనగలు, ఉల్లి, వెల్లుల్లి, పుట్టగొడుగులు, తేనె, అరటి, మామిడి, నారింజ, స్ట్రాబెర్రీ వంటి పండ్లు, ఆ పండ్ల ఆధారిత ఉత్పత్తులు, లవంగాలు, మిరియాలు సహా అన్ని రకాల మసాలాలు, అన్ని రకాల టీ ఉత్పత్తులపై నియంత్రణలు భారత్ ఆధీనంలో ఉంటాయి.
- ఒప్పందంలో భాగంగా కిలో రూ.80 ఆపైన ధర ఉన్న యాపిల్స్ దిగుమతికే అవకాశం ఉంటుంది. అంతేగాక వాటిపై 25శాతం సుంకం వర్తిస్తుంది.
- అమెరికా నుంచి పాలు, పెరుగు, వెన్న, బట్టర్, పనీర్ సహా పాల ఆధారిత ఉత్పత్తులను భారత్ దిగుమతి చేసుకోదు.

భారత్ సుంకాలు తగ్గించే రంగాలు

- అమెరికా నుంచి దిగుమతి అయ్యే పారిశ్రామిక, ఎలక్ట్రికల్ ఉత్పత్తులు, రసాయనాలు, వాహనాల విడిభాగాలు, టెక్నాలజీ ఆధారిత ఉత్పత్తులపైన డేటా సెంటర్ పరికరాలు, సర్వర్లు, సెమీకండక్టర్ చిప్స్, కృత్రిమ మేధ హార్డ్‌వేర్, జీపీయూలపై భారత్ సుంకాలను క్రమంగా సున్నాకు తగ్గిస్తుంది. దీనితో ఆయా ఉత్పత్తుల ధరలు తగ్గి మేకిన్ ఇండియాకు ఊతం లభిస్తుంది.
- ఎర్ర జొన్నలు, బాదాం, వాల్‌నట్స్, పిస్తా, జీడిపప్పు, సోయాబీన్ నూనె, కొన్ని రకాల పండ్లు, 'డ్రైడ్ డిస్టిలర్ గ్రెయిన్స్'పై భారత సుంకాలు సున్నాకు తగ్గుతాయి. ఆయా ఉత్పత్తుల ధర తగ్గుతుంది. డిస్టిలరీల్లో మొక్కజొన్న, పలు రకాల ధాన్యాలతో ఇథనాల్ ఉత్పత్తి చేశాక మిగిలే పదార్థమే 'డ్రైడ్ డిస్టిలర్ గ్రెయిన్స్'. ఇది పశువులకు మంచి దాణా. దాని దిగుమతులపై సుంకం మినహాయింపుతో దాణా ధరలపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది.
- వైన్, విస్కీ, బీర్ తదితర ఆల్కాహాలిక్ ఉత్పత్తులపై ఇప్పటివరకు 150% దిగుమతి సుంకాలు ఉండగా, ఇకపై 30-40 శాతానికి తగ్గిస్తారు. దీనితో అమెరికన్ ఆల్కాహాల్ బ్రాండ్ల ధరలు బాగా తగ్గుతాయి. అమెరికా నుంచి దిగుమతి అయ్యే వైద్య పరికరాలు, సౌందర్య ఉత్పత్తుల ధరలు కూడా దిగిరానున్నాయి.

లోకం తీరు



భారత ఎగుమతులకు ఫుల్ జోష్

- భారత్ నుంచి పండ్లు, కూరగాయలు, టీ, కాఫీ, జనరిక్ ఔషధాలు, విమాన విడిభాగాలు, పలు రకాల వాహన విడిభాగాలు వంటివాటిపై అమెరికా సుంకాలను సున్నాకు తగ్గించనుందని.. ఈ ఉత్పత్తుల ఎగుమతులు భారీగా పెరుగుతాయని పీయూష్ గోయల్ వెల్లడించారు. అమెరికాకు చెందిన బోయింగ్ సంస్థ భారత్ నుంచి పెద్ద ఎత్తున విమాన విడిభాగాలను దిగుమతి చేసుకుంటుంది. సుంకాల తగ్గింపుతో ఆ సంస్థ మన దేశ సంస్థలకు భారీ స్థాయిలో ఆర్డర్లు ఇవ్వనుంది.
- ఇక వస్త్రాలు, తోలు ఉత్పత్తులు, పాదరక్షలు, ప్లాస్టిక్-రబ్బర్ ఉత్పత్తులు, బొమ్మలు, కార్పెట్లు, గృహాలంకరణ ఉత్పత్తులు, యంత్రాలు, వాటి విడిభాగాలు, రసాయనాలు, హస్తకళాకృతులు, ఫార్మా, వజ్రాలు, విలువైన రత్నాలపై సుంకాలు 18శాతానికి తగ్గడం వల్ల అమెరికాలో మన ఉత్పత్తులకు డిమాండ్ పెరగనుంది.
- భారత మొత్తం వ్యవసాయ, సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల విలువ 2024లో రూ.4.15 లక్షల కోట్లు, 2025లో 4.61 లక్షలు కోట్లుకాగా.. వచ్చే నాలుగేళ్లలో రూ.9లక్షల కోట్ల విలువైన వ్యవసాయ, సముద్ర, ఇతర ఉత్పత్తులు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈయూ, యూకే, అమెరికా, ఆస్ట్రేలియాలతో కుదిరిన వాణిజ్య ఒప్పందాల ద్వారా ఈ లక్ష్యాన్ని సాధిస్తామని భావిస్తోంది.

తగ్గనున్న హార్లీ-డేవిడ్సన్ బైకుల ధరలు

అమెరికాకు చెందిన ప్రముఖ హార్లీ-డేవిడ్సన్ బైకుల ధరలు దిగిరానున్నాయి. ప్రస్తుతం 1,600 సీసీ సామర్థ్యంలోపు ఉన్న బైకులపై 40శాతం, ఆపై సామర్థ్యమున్న వాటిపై 30% దిగుమతి సుంకాలు ఉన్నాయి. ఇప్పుడా సుంకాలు సున్నాకు తగ్గనుండటంతో.. బైకుల ధరలు ఆ మేరకు తగ్గనున్నాయి.





కీకారణ్యంలో 'సౌర' వెలుగులు!

నల్లమల అటవీ ప్రాంతంలోని చెంచు గిరిజన గూడేలకు విద్యుత్

- 2.8 కోట్ల వ్యయంతో 611 ఇళ్లకు కరెంట్
- అడవిలో అభివృద్ధికి.. అర్ధరాత్రి పయనం
- ప్రత్యేక వాహనంలో గొట్టిపాటి ప్రయాణం
- కార్యక్రమం ప్రారంభంకోసం వెళ్లిన మంత్రి
- ముగించుకొని తెల్లవారుజామున వెనక్కి

నల్లమల అడవిలో వెళుతున్న మంత్రి కాన్వాయ్‌లోని ప్రత్యేక వాహనాలు, సౌర విద్యుత్ వ్యవస్థను ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి రవి, సోలార్ వెలుగుల్లో గిరిజన గ్రామం

మార్కాపురం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు మావోయిస్టుల షెల్టర్‌జోన్‌గా ఉన్న దట్టమైన కీకారణ్య ప్రాంతమది!. వాహనాలు వెళ్లేందుకు కూడా రోడ్డు సౌకర్యం లేక గిరిజన కుటుంబాలు ఏళ్ల తరబడి అడవిలో జీవనం సాగిస్తున్నాయి. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న పాలుట్ల సహా పలు గ్రామాల్లో చెంచులు నివశిస్తున్నారు. 'టైగర్ రిజర్వ్' కావటంతో రవాణా సౌకర్యం కల్పించేందుకు అటవీశాఖ అనుమతించడం లేదు. అలాంటి గిరిజన పల్లెల్లో 'వెలుగులు' అందించాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. అనుకున్నదే తడవుగా విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈ విషయంపై దృష్టిసారించి కొద్దికాలంలోనే నిరంతర వెలుగుల కోసం అవసరమైన 'ఆఫ్ గ్రిడ్ సోలార్ సిస్టం'కు శ్రీకారం చుట్టారు. రూ.2.80 కోట్లతో 611 గృహాలకు సౌర విద్యుత్ సౌకర్యానికి ఏర్పాట్లు జరిగాయి. వీటిని స్వయంగా మంత్రి గొట్టిపాటి రవి ప్రారంభించారు. దీనికిగాను ఆయన.. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, టీడీపీ వైపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, కలెక్టర్ రాజాబాబు ఇతర అధికారులతో కలిసి నల్లమలలో శుక్రవారం రాత్రి దాదాపు 6 గంటల(రాను, పోను)పాటు ప్రయాణం చేశారు.

అతికష్టం మీద.. పాలుట్ల గిరిజన గూడెంలో సౌర విద్యుత్ వ్యవస్థను ప్రారంభించేందుకు శుక్రవారం సాయంత్రం 5 గంటలకు వైపాలెం నుంచి మంత్రి కాన్వాయ్ బయలుదేరింది. వాస్తవానికి అటవీమార్గంలో రాళ్లు, నీటి వాగులు ఎక్కువగా ఉన్నాయి. వాటిని దాటి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం కూడా లేదు. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా థార్ వాహనశ్రేణిని ఏర్పాటు చేశారు. నాయకులకోసం కమాండర్ జీపులు వినియోగించారు. కొద్దిపాటి వేగంతోనే వాహనాలు నెమ్మదిగా కదులుతూ రాత్రిపూట చేసిన ప్రయాణం భద్రతా సిబ్బందికి సవాల్‌గా మారింది. అయినప్పటికీ.. సోలార్ లైట్లు వెలిగించే కార్యక్రమం కాబట్టి రాత్రిపూటే చేయాలనే సంకల్పంతో మంత్రి రవి పట్టుబట్టారు. అలా దాదాపు 3 గంటలు ప్రయాణించి పాలుట్లకు చేరుకున్న మంత్రి.. కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం, స్థానిక గిరిజనులతో కలిసి భోజనం చేశారు. ఏళ్లతరబడి అడవి మధ్య అంధకారంలో ఉన్న వారి జీవితాల్లో వెలుగులు నింపిన కూటమి ప్రభుత్వానికి గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం అనంతరం తిరుగు పయనంలో మంత్రి కాన్వాయ్ తెల్లవారుజామున తర్వాత మైదాన ప్రాంతానికి చేరుకుంది.

ఆఫ్‌గ్రిడ్ సోలార్ పథకం

వ్యయం	:	రూ.2.80 కోట్లు
లబ్ధిదారుల సంఖ్య	:	611
ఇచ్చిన పరికరాలు	:	1 ఫ్యాన్, 5 లైట్స్, 1 డీసీ సిస్టం, 1 ప్యానెల్, 1 సెల్ చార్జింగ్ పాయింట్.
కంపెనీ గ్యారెంటీ	:	5 సంవత్సరాలు.
లబ్ధిపొందిన గ్రామాలు	:	పాలుట్ల, చిన్నారుట్ల, పెద్దారుట్ల, రోళ్లపెంట, గుట్టలచేను, పొన్నలబయలు, బూరుగుండాల, నారుతడికల, పెద్ద చేను, నెక్కంటి.



కొత్త ఎల్‌హెచ్‌బీ బోగీలన్నీ సికింద్రాబాద్‌కే!

- గుంటూరు డివిజన్‌కు 86 కోచ్‌లు కేటాయింపు
- అవన్నీ సికింద్రాబాద్ డివిజన్‌లోనే!

(ఆంధ్రజ్యోతి, గుంటూరు)

దక్షిణ మధ్య రైల్వే జోన్ నుంచి గుంటూరు డివిజన్ వేరుపడి... కొత్తగా ఏర్పాటు చేస్తున్న దక్షిణ కోస్తా జోన్‌లోకి చేరిపోనుండటంతో ఇప్పటి నుంచే ఎస్‌సీఆర్(సౌత్ సెంట్రల్ రైల్వే) చిన్నచూపు చూస్తోంది. రైల్వేబోర్డు ప్రత్యేకించి గుంటూరు డివిజన్‌కు కేటాయించిన ఎల్‌హెచ్‌బీ బోగీలను ఇక్కడికి పంపకుండా సికింద్రాబాద్ డివిజన్‌లో నడిచే రైళ్లకు కేటాయించుకుంటున్నారు. దీనివల్ల నేటికీ పాత ఐసీఎఫ్ బోగీలతోనే గుంటూరు నుంచి ప్రారంభించే రైళ్లను నడపాల్సి వస్తున్నది. గత ఏడాది ఆగస్టు నెలలో సింహాద్రి, పల్నాడు ఎక్స్‌ప్రెస్‌లకు కలిపి మొత్తం 60 ఎల్‌హెచ్‌బీ బోగీలను రైల్వేబోర్డు మంజూరు చేసింది. ఈ బోగీలను కేటాయించిన రైళ్లకే వినియోగించాలని తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. అయినప్పటికీ దక్షిణ మధ్య రైల్వే హెడ్‌క్వార్టర్స్ అధికారులు గుట్టుచప్పుడు కాకుండా వాటిని కాజీపేట-నాగర్‌సోల్ మధ్య నడిచే రైళ్లకు కలిపేశారు. దీంతో సింహాద్రి, పల్నాడు ఎక్స్‌ప్రెస్‌లను నేటికీ ఐసీఎఫ్ బోగీలతోనే నడుపుతున్నారు. దీనిపై గుంటూరు డివిజన్ అధికారులు ఎవరూ హెడ్‌క్వార్టర్స్‌కు నివేదించిన దాఖలాలు లేవు. ఇదేవిధంగా గుంటూరు-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌కు గత ఏడాది నవంబరులో 26 హెల్‌హెచ్‌బీ బోగీలను రైల్వే బోర్డు మంజూరు చేసింది. వీటిని కూడా దారి మళ్లించారు. కేవలం గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌కి మాత్రమే ఎల్‌హెచ్‌బీ బోగీలను అమర్చారు. అయితే ఇది 80 శాతం సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో ఉంది. ఈ అన్యాయాన్ని రైల్వే మంత్రి దృష్టికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తీసుకువెళ్లాలని కోరుతున్నారు.

రూ.2 కోట్లు ఇవ్వకుంటే వందే భారత్ రైలును పేల్చేస్తాం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): 'మేం చెప్పిన బ్యాంకు ఖాతాకు రూ.2 కోట్లు డిపాజిట్ చేయండి.. లేదంటే సికింద్రాబాద్ నుంచి బయలుదేరే వందే భారత్ రైలును బాంబుతో పేల్చేస్తాం' అని దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం కార్యాలయానికి దుండగులు పోస్టులో బెదిరింపు లేఖ పంపారు. ఈ నెల 3న సికింద్రాబాద్‌లోని డీఆర్ఎం కార్యాలయానికి అజ్ఞాత వ్యక్తులు పోస్టులో ఓ లేఖ పంపించారు. తాము సూచించిన వ్యక్తి ఖాతాలో రూ.2 కోట్ల నగదు డిపాజిట్ చేయాలని, లేనిపక్షంలో రైలును పేల్చివేస్తామని హెచ్చరించారు. దీంతో సికింద్రాబాద్ ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు బాంబు స్క్వాడ్ బృందంతో కలిసి తనిఖీలు చేపట్టారు. శనివారం కూడా తనిఖీలు కొనసాగాయని రైల్వే జీఎం శ్రీవాత్సవ తెలిపారు.

ఇన్సెంటివ్స్ బకాయిలు చెల్లించాలి

- ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల డిమాండ్

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని దళిత, గిరిజన పారిశ్రామికవేత్తలకు చెల్లించాల్సిన రూ.700 కోట్ల రాయితీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు డిమాండ్ చేశారు. ఇన్సెంటివ్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం విజయవాడలో సమావేశం నిర్వహించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే అసెంబ్లీ సమావేశాల సమయంలో నిరసన కార్యక్రమాలను మళ్లీ ముమ్మరం చేయాలని తీర్మానించారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల ఇన్సెంటివ్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఈడ్పుగంటి అనార్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి వైసీపీ, సీపీఐ, సీపీఎం, బీఎస్పీ, ఆర్పీఐ, ఆప్, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీల ప్రతినిధులు, ప్రజాసంఘాల నేతలు హాజరయ్యారు.

నేడు ఏపీ ఎన్‌జీజీవో ఎన్నికలు

విజయవాడ సిటీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్‌జీజీవో కార్యవర్గ ఎన్నికలు ఆదివారం విజయవాడలో జరగనున్నాయి. మరోసారి అధ్యక్షుడిగా పోటీ చేసేందుకు ఆలపర్తి విద్యాసాగర్ సిద్ధమయ్యారు. భారీ ర్యాలీ వెళ్లి నామినేషన్ దాఖలు చేసేందుకు సన్నాహాలు చేసుకున్నారు. 35 ఏళ్ల క్రితం జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన ఆయన ఎన్‌జీజీవోలో అంచెలంచెలుగా ఎదిగారు. 1992లో విజయవాడ నగర కార్యవర్గ సభ్యునిగా సంఘంలో చేరి, అనతి కాలంలోనే జిల్లా స్థాయి పదవులను అలంకరించారు. జిల్లా సంఘంలో సంయుక్త కార్యదర్శి, కోశాధికారిగా, 2005లో కార్యదర్శిగా, 2008లో అధ్యక్షుడిగా నియమితులయ్యారు. జిల్లా జేఏసీకి చైర్మన్‌గా ఆరు సార్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమైక్యాంధ్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. 2025 జనవరి 1న ఎన్‌జీజీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, 2025 జూన్ 1న రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు.

వాడేది బీఎండబ్ల్యూ.. చేసేది చోరీలు!

- విశాఖ, కాకినాడ, రాజమండ్రిల్లో 62 దొంగతనాలు
- రూ.కోటి విలువైన చోరీ సొత్తు స్వాధీనం
- చోరీసొత్తుతో బీఎండబ్ల్యూ కారు కొనుగోలు
- విశాఖలో ఇల్లాలు, హైదరాబాద్‌లో ప్రియురాలు



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలను, వెండి వస్తువులను చూపుతున్న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): విశాఖలో ఇల్లాలిని, హైదరాబాద్‌లో ప్రియురాలిని పెట్టకుని, బీఎండబ్ల్యూ కారులో జల్సాగా తిరుగుతూ రూ.కోటి విలువైన బంగారం, వెండి, డబ్బు కూడబెట్టుకున్న ఘరానా దొంగను విశాఖ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. అరెస్టు చేసేవరకూ అతడి దొంగతనాల గురించి ఇంట్లో గాని, బయట వాళ్లకు గాని తెలియకపోవడం చిత్రం. వివరాలను శనివారం సీపీ శంఖబ్రతబాగ్చి వెల్లడించారు. కాకినాడకు చెందిన మహేష్‌రెడ్డి చిన్నతనం నుంచే జల్సాలకు అలవాటుపడి.. 15 ఏళ్ల వయస్సులోనే దొంగతనాల బాటపట్టాడు. పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో 4 చోట్ల దొంగతనాలు చేసి పోలీసులకు పట్టుబడడంతో జువెనైల్ హోమ్‌కు పంపించా రు. అక్కడి నుంచి బయటకు వచ్చిన తర్వాత పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. హైదరాబాద్ వెళ్లి కొన్ని ఐటీ కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేశాడు. తర్వాత విశాఖ వచ్చి పలు ఐటీ కంపెనీల్లో పనిచేశాడు. ఇక్కడే కంపెనీలోని యువతితో ప్రేమాయణం సాగించాడు. హైదరాబాద్‌లోని ఒక సంస్థలో మంచి ఆఫర్ వచ్చిందంటూ 6 నెలల కిందట విశాఖలో ఉద్యోగం మానేసి హైదరాబాద్ వెళ్లాడు. అక్కడ మరో యువతితో ప్రేమాయణం మొదలుపెట్టాడు. ఆమెతో ప్రేమాయణం సాగిస్తూనే అప్పుడప్పుడు విశాఖ వచ్చి.. తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి రెక్కీ చేసేవాడు. రెక్కీ సమయంలో కూడా తన ఆనవాళ్లేవి కనిపించకుండా మాస్క్, టోపీ ధరించేవాడు. రెక్కీ చేసిన ఇంట్లో రాత్రివేళ చోరీ చేసి, తర్వాత రోజు హైదరాబాద్ వెళ్లిపోయేవాడు.

చోరీల గురించి భార్యకే తెలియదు!

మహేష్‌రెడ్డి విశాఖలో తనకు పరిచయమైన యువతిని రెండు నెలల కిందట పెళ్లి చేసుకున్నాడు. మరోవైపు హైదరాబాద్‌లో యువతితో సంబంధం కొనసాగించాడు. చోరీచేసిన బంగారం, వెండిని భార్య, ప్రియురాలికి ఇస్తూ విలాస జీవితం గడిపేవాడు. చోరీసొత్తు విక్రయించి ఖరీదైన బీఎండబ్ల్యూ కారు కొన్నాడు. మహేష్‌రెడ్డి నేరచరిత్ర గురించి పోలీసులు అరెస్టు చేసేంతవరకూ అతడి భార్యకు, ప్రియురాలికి తెలియదు. మహేష్‌రెడ్డి తన భార్య, ప్రియురాలి వద్ద భారీ వేతనం సంపాదించే ఉద్యోగిగా బిల్డప్ ఇస్తూ చోరీ చేసిన సొమ్ముతో వ్యాపార రంగంలోకి ప్రవేశించాలని పథకం రచించాడు. అతను స్వతహాగా బాడీబిల్డర్. జిమ్ చేసేవాళ్ల కండరాలను పెంచేందుకు వాడే ప్రొటీన్ పౌడర్ తయా రీ యూనిట్‌ను విశాఖలో పెట్టాలనుకున్నాడు. అందుకు చోరీలు కూడా పెంచాడు. గత ఏడాదిన్నర కాలంలో గాజువాక, ఆరిలోవ, మల్కాపురం, పెందుర్తి, దువ్వాడ పోలీస్ స్టేషన్ల పరిధిలో 26, కాకినాడ, రాజమండ్రి, సర్పవరం, రామచంద్రపురంలో 36 చోరీలు చేశాడు.

ఎలా దొరికాడంటే..!

గాజువాకలోని జోగవానిపాలేనికి చెందిన కన్నా శివరామకృష్ణ గత ఏడాది అక్టోబరు 10న అరుణాచలం వెళ్లారు. ఇంటి యజమాని 13న ఫోన్ చేసి ఇంటి ప్రధాన ద్వారం తాళాలు పగులగొట్టి ఉన్నాయని చెప్పడంతో ఆయన 14న నగరానికి వచ్చారు. బీరువా విరగ్గొట్టి ఉంది. అందులోని 17 తులాలు బంగారం, 30 తులాల వెండి వస్తువులు చోరీకి గురైనట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు.. చోరీ జరిగిన ఇంటితోపాటు పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా... ఒకరు ముఖానికి మాస్క్, టోపీ ధరించి ఉండడంతో గుర్తించలేకపోయారు. గ్లౌజులు ధరించడంతో ఘటనా స్థలంలో వేలిముద్రలు కూడా లభించలేదు. నిందితుడు చోరీకి పాల్పడిన తర్వాత ఒకచోట పార్కింగ్ చేసి ఉన్న స్కూటీని తీసుకుని వెళ్లిపోయాడు. సీసీ కెమెరా ఫుటేజీలో గుర్తించిన స్కూటీ కోసం గాలించారు. కొన్నాళ్లకు మాధవధారలో పార్కింగ్ చేసి ఉండగా మహేష్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు.



ఎన్‌క్లోజర్‌లో పెద్ద పులి

జంతు పునరావాస కేంద్రానికి పెద్దపులి

- వైద్య పరీక్షల అనంతరం ఎన్‌క్లోజర్‌లోకి..
- మత్తు వదలడంతో గాండ్రిస్తూ పరుగులు
- అడవిలో విడిచిపెట్టాలా? జూకు తరలించాలా?
- జాతీయ పులుల సంరక్షణ అథారిటీదే నిర్ణయం
- పెద్ద పులి మహారాష్ట్రలోని తడోబా రిజర్వు ఫారెస్టు ఏరియాకు చెందినదిగా గుర్తింపు

విశాఖపట్నం/ఆరిలోవ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో ఏడు రోజుల తర్వాత చిక్కిన పెద్దపులిని శనివారం ఉదయం విశాఖలోని జంతు పునరావాస కేంద్రానికి (యానిమల్ రెస్క్యూ సెంటర్) తీసుకువచ్చారు. ఇక్కడకు వచ్చే సమయానికి పులి ఇంకా మత్తులోనే ఉంది. పులిని బోను నుంచి బయటకు తీసి వైద్య పరీక్షలు నిర్వహించి.. ఆరోగ్యంగా ఉందని నిర్ధారించుకున్న తర్వాత ఎన్‌క్లోజర్‌లో ఉంచారు. కొద్దిసేపటికి మత్తు వదలడంతో పులి పెద్దగా గాండ్రిస్తూ అటూఇటూ పరుగులు పెట్టింది. ప్రస్తుతం పెద్దపులికి ద్రవ ఆహారం ఇస్తున్నారు. ఆదివారం నుంచి మాంసం ఇవ్వనున్నారు. సీసీ కెమెరాల ద్వారా పెద్దపులి ఆరోగ్యం, ఆహారం తీసుకునే విధానం, ప్రవర్తనను పరిశీలించనున్నట్టు విశాఖ అటవీ సంరక్షణాధికారి దివాన్ మైదీన్ తెలిపారు. రాష్ట్ర డిప్యూటీ చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ శాంతిప్రియపాండే జంతు పునరావాస కేంద్రాన్ని సందర్శించి పెద్దపులి ఆరోగ్యం, ఇతర వివరాలు తెలుసుకున్నారు. ఈ పులిని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టాలా? జంతు పునావాస కేంద్రంలో ఉంచాలా? లేదా జూకు తరలించాలా? అనేది జాతీయ పులుల సంరక్షణ అథారిటీ పరిధిలోని కమిటీ నిర్ణయించి, రాష్ట్ర చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్‌కు సిఫారసు చేయనుంది.

మహారాష్ట్ర నుంచి ఏపీలోకి ప్రవేశం ఇలా..

మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా తడోబా టైగర్ రిజర్వు ఫారెస్టు ఏరియాకు చెందిన ఈ పెద్దపులి మగది, వయస్సు మూడు నుంచి మూడున్నరేళ్లు, బరువు 150 నుంచి 200 కిలోలు ఉంటుందని అటవీ శాఖ అధికారులు తెలిపారు. సాధారణంగా పులి పిల్లలు 2-3 ఏళ్ల వయస్సు వచ్చేసరికి సొంతంగా ఒక ఏరియా ఏర్పాటుకు ప్రయత్నిస్తాయని, విశాలమైన ప్రాంతంలో స్వేచ్ఛగా తిరిగేందుకు వీలుగా సురక్షితమైన అటవీ ప్రాంతాన్ని ఎంచుకుంటాయని చెప్పారు. ఈ క్రమంలో తడోబా ఫారెస్టు నుంచి బయటకు వచ్చిన ఈ పులి తొలుత తెలంగాణలో ప్రవేశించిందని, ఆ తర్వాత గత నెల 20న ఏపీలోని ఏలూరు జిల్లా కాకరగుంట ప్రాంతంలోకి వచ్చిందని, అనంతరం పట్టిసీమ ప్రాంతంలో గోదావరి నదిని ఈదుకుంటూ గత నెల 30న తూర్పుగోదావరి జిల్లాలోకి ప్రవేశించిందని ఓ అధికారి తెలిపారు.





బైకు విన్యాసాలు భళా

క్రీడలకు అధిక ప్రాధాన్యం

- మోటార్ రేసింగ్ పోటీల ప్రారంభోత్సవంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి
- బైక్ రేసింగ్ ఫైనల్స్ చూసేందుకు భారీగా తరలివచ్చిన యువతీయువకులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర ప్రభుత్వం ఐటీ, పర్యాటక రంగాలతో పాటు విశాఖలో క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. అందులో భాగంగానే ఎంఆర్ఎఫ్ మోగ్రిప్ సూపర్ క్రాస్ ఎఫ్ఎంఎస్‌సీఐ ఛాంపియన్‌షిప్-2025 ఫైనల్స్ పోటీని నిర్వహించాం' అని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చెప్పారు. ఎంఆర్ఎఫ్ మోటార్ రేసింగ్ పోటీలను ఆయన శనివారం సాయంత్రం నగరంలోని ఇందిరాప్రియదర్శిని మునిసిపల్ స్టేడియంలో విశాఖ ఎంపీ శ్రీభరత్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 'యువతకు రేసింగ్ అంటే చాలా ఇష్టం. ఇలాంటి పోటీలు ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించలేదు. విశాఖతోనే శ్రీకారం చుట్టాం. నిర్వాహకులు చక్కటి ఏర్పాట్లు చేశారు' అని అన్నారు. మంత్రి ఆసక్తిగా పోటీలు ముగిసేంత వరకూ తిలకించారు. రాత్రి పది గంటలకు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీలను చూడడానికి వివిధ ప్రాంతాల నుంచి యువతీ యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఫ్లడ్ లైట్ల వెలుగులో గాల్లో ఎగురుతున్న బైకులను చూసి కేరింతలు కొట్టారు.

అమరావతిలో పర్యాటక భవన్

అంతర్జాతీయ పర్యాటక డెస్క్, వీసా ఫెసిలిటేషన్ సెంటర్‌కు ప్రతిపాదనలు

- 150 కోట్లతో పర్యాటక బ్రాండింగ్, ఈవెంట్లు
- టూరిజం ప్రాజెక్టుల ద్వారా 1.22 లక్షల ఉద్యోగాలు
- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో పర్యాటక భవన్ ఏర్పాటు చేయనున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడించారు. అంతర్జాతీయ పర్యాటక డెస్క్‌లు, ప్రధాన పర్యాటక అగ్రిగేటర్లకు స్థలాలు, వీసా ఫెసిలిటేషన్ కౌంటర్ల ఏర్పాటుకు అమరావతిలో ఇంటిగ్రేటెడ్ ఎక్స్‌పీరియన్స్ ఇంటర్‌ప్రెటేషన్ అండ్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ఏర్పాటుకు రూ.100 కోట్లతో ప్రతిపాదనలు చేశామన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. "రాష్ట్రవ్యాప్తంగా 60 చోట్ల వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ టూరిజం ప్రారంభిస్తున్నాం. బ్లూఫాగ్ బీచ్‌లు, ఎకో టూరిజం, టెంట్ సిటీలను విస్తరిస్తున్నాం. ఇటీవల పర్యాటక శాఖకు బ్రాండింగ్, మార్కెటింగ్, ఈవెంట్ల నిర్వహణకు రూ. 150 కోట్లు కేటాయింపు జరిగింది. ఏపీలో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేస్తే పెట్టుబడులు పెట్టడానికి జర్మనీ ముందుకు వచ్చింది. వియత్నాం ఇప్పటికే చర్యలు ఆరంభించింది. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలకు కూడా ప్రచారం చేస్తాం. రాష్ట్రంలో ప్రస్తుతం 27 పర్యాటక ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ అనుమతులు లభించగా 12 పురోగతిలో ఉన్నాయి. 5 ప్రాజెక్టులకు త్వరలో శంకుస్థాపన చేస్తాం. మరో 7 ప్రాజెక్టులకు భూకేటాయింపులు జరిగాయి. వీటి ద్వారా 1,22,637 ఉద్యోగాలు రానున్నాయి. 117 ప్రఖ్యాత సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నాం. 20నెలల్లో రూ. 30వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించాం. రాష్ట్ర చరిత్రలోనే అత్యధికంగా కేంద్రం నుంచి 8 పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి రూ.428కోట్ల గ్రాంటు సాధించాం. ఇప్పటికే ప్రపంచ బ్రాండ్‌గా మారిన అరకు కాఫీ మాదిరిగా చిరుధాన్యాల భోజనం (అరకు కౌనీ)ని పర్యాటకులకు పరిచయం చేస్తాం. దీనికి బ్రాండ్ ఇమేజ్ వస్తుంది. 21 ప్రధాన పుణ్యక్షేత్రాల వద్ద టెంట్ సిటీలు ఏర్పాటు చేస్తున్నాం. కేరళ తరహాలో రాజమహేంద్రవరం, విజయవాడ సహా 8 ప్రాంతాల్లో హౌస్ బోట్లు ఏర్పాటు చేస్తాం. వైసీపీ అధినేత జగన్ ఓదార్పు యాత్రలు చేయడం కాదు. తాను చేసిన పాపాలు కడుక్కోవడానికి ప్రాయశ్చిత్త యాత్ర చేయాలి. జగన్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు" అని దుర్గేశ్ మండిపడ్డారు.



మంటలు ఆర్పిన తర్వాత సగం దగ్ధమైన బస్సు

మరో ట్రావెల్స్ బస్సు 'టెర్రర్'!

- హైదరాబాద్ నుంచి వస్తున్న ఏసీ స్లీపర్ బస్సులో పొగలు, మంటలు
- ప్రయాణికులంతా సురక్షితం.. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల వద్ద ఘటన

కంచికచర్ల, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల వద్ద శనివారం ఉదయం ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అగ్నిప్రమాదానికి గురైంది. డ్రైవర్ అప్రమత్తతతో 39 మంది ప్రయాణికులు సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. వివరాల ప్రకారం.. వరుణ్ ట్రావెల్స్‌కు చెందిన ఇంటర్ సిటీ ఏసీ స్లీపర్ బస్సు హైదరాబాద్ నుంచి 39 మంది ప్రయాణికులతో గుంటూరు బయలుదేరింది. బస్సులో ఒక డ్రైవర్, ఒక క్లీనర్ ఉన్నారు. శనివారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో బస్సు నందిగామ దాటి కీసర టోల్‌గేట్ వద్దకు వచ్చింది. అక్కడినుంచి బయలుదేరిన తర్వాత 5.30 గంటల సమయంలో ఇన్వెంటా కెమికల్స్ సమీపానికి రాగానే బస్సు వెనుక భాగం ఇంజన్ వద్ద దట్టంగా పొగలు, మంటలు రావడం ప్రారంభమయ్యాయి. దీన్ని డ్రైవర్ మామిడాల చంద్రమౌళి, క్లీనర్ సైడ్ మిర్రర్ ద్వారా గమనించారు. వెంటనే బస్సును రోడ్డు మార్జిన్‌లో నిలిపి, ప్రయాణికులను అప్రమత్తం చేశారు. దీంతో అందరూ బస్సు నుంచి కిందకు దిగిపోయారు. సైడ్ బాక్సుల్లోని లగేజీ కూడా తీసుకున్నారు. తర్వాత మంటలు బస్సును చుట్టుముట్టాయి. స్లీపర్ కావటంతో మంటలు వేగంగా వ్యాపించాయి. బస్సు వెనుక, పై భాగాలు పూర్తిగా కాలిపోయాయి. సమాచారం అందుకున్న వెంటనే కంచికచర్ల, నందిగామ, టోల్‌గేట్ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, మంటలను అదుపు చేశారు. పోలీస్, రవాణా శాఖల అధికారులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. షార్ట్ సర్క్యూట్ లేదా ఇంజన్‌లో తలెత్తిన లోపం వల్ల మంటలు వ్యాపించి ఉంటాయని భావిస్తున్నారు.

ఆర్టీసీ గ్రేడ్-2 మెకానిక్‌లకు ఉపశమనం

- లీడ్ హ్యాండ్ స్కేల్‌కు అర్హులు కాదంటూ ఇచ్చిన నోటిఫికేషన్‌పై స్టే
- మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో 12 ఏళ్ల సర్వీసు పూర్తిచేసిన గ్రేడ్-2 మెకానిక్‌లు లీడ్ హ్యాండ్ స్కేల్‌కు అర్హులు కాదంటూ ప్రజారవాణాశాఖ జారీ చేసిన నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే విధించింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు పిటిషనర్ల జీతాల నుంచి సొమ్ము రికవరీ చేయవద్దని అధికారులకు స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ డి. రమేశ్ ఇటీవల మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. ఏఏఎస్ కింద లీడ్ హ్యాండ్ స్కేల్‌కు తమను అనర్హులుగా ప్రకటిస్తూ గతేడాది డిసెంబరు 23న ప్రజా రవాణా శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(అడ్మిన్) జారీచేసిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ ఏపీఎస్‌ఆర్టీసీ ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు చిత్తూరు జిల్లాలోని వివిధ డిపోల్లో గ్రేట్-2 మెకానిక్‌లుగా పనిచేస్తున్న పలువురు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. సదరు నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరారు. వీరి తరపున న్యాయవాది వేగి మురళీ కృష్ణారావు వాదనలు వినిపించారు. ఆర్టీసీ తరపు స్టాండింగ్ కౌన్సిల్ వాదనలు వినిపిస్తూ... ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇచ్చిన నోటిఫికేషన్‌పై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

ఆక్రమణదారులకు భూసేకరణ చట్టం వర్తించదు

- చట్టబద్ధమైన పత్రాలు లేకుండా హక్కులు సంక్రమించవు
- భూ యజమానులతో సమానంగా పరిహారం కోరలేరు
- విజయవాడ ఆర్వోబీ భూసేకరణ కేసులో హైకోర్టు స్పష్టీకరణ
- పిటిషనర్ల వ్యాజ్యాలు కొట్టివేత

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని దశాబ్దాలుగా నివాసం ఉంటున్నప్పటికీ, అలాంటి ఆక్రమణదారులకు ఎలాంటి చట్టబద్ధమైన హక్కు లభించదని హైకోర్టు తేల్చిచెప్పింది. భూ యజమానులతో సమానంగా ఆక్రమణదారులు పరిహారం కోరలేరని స్పష్టం చేసింది. తమ ఆక్రమణలోని భూమి క్రమబద్ధీకరణకు సంబంధించి చట్టబద్ధమైన పత్రాలు లేకుండా ఆ భూమిపై ఎటువంటి హక్కు సంక్రమించదని పేర్కొంది. 2013 భూసేకరణ చట్టం కేవలం చట్టబద్ధమైన యజమానుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ఉద్దేశించిందని, వారి మాత్రమే పరిహారం కోరగలరని చెప్పింది. ఆ చట్టం ఆక్రమణదారుల కోసం కాదని స్పష్టం చేసింది. భూమిని కోల్పోయేవారిని అభివృద్ధిలో భాగస్వామ్యం చేయడంతో పాటు సామాజికంగా, ఆర్థికంగా వారి స్థితిగతులు మెరుగుపర్చాలనే ఉద్దేశంతో చట్టం తీసుకొచ్చారని గుర్తుచేసింది. ప్రస్తుత కేసులో పిటిషనర్లు ఎవరూ కూడా తమ ఆధీనంలోని భూమికి యాజమాన్యహక్కు పత్రాలు కోర్టుకు సమర్పించలేదని తెలిపింది. మానవతా దృక్పథంతో 114 మంది నిర్వాసితులకు అధికారులు ప్రత్యామ్నాయంగా ఇళ్లు కేటాయించారని గుర్తుచేసింది. విజయవాడలోని గుణదల ప్రాంతంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణం కోసం తమ ఆధీనంలోని భూములు తీసుకున్నందున 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ 2020, 2021, 2022లో పలువురు దాఖలు చేసిన వ్యాజ్యాలను, అలాగే అధికారులపై వారు దాఖలుచేసిన కోర్టుధిక్కరణ పిటిషన్లను సైతం కొట్టివేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరనాథ్ ఇటీవల తీర్పు ఇచ్చారు. పూర్వీకుల నుంచి ఆ భూమిలోనే జీవిస్తున్నామని, క్రమం తప్పకుండా ఆస్తి పన్నును చెల్లిస్తున్నామని పిటిషనర్లు పేర్కొన్నారు. అధికారులు కౌంటర్లు దాఖలు చేస్తూ.. రెవెన్యూ రికార్డుల్లో పిటిషనర్లు ఆక్రమించిన భూమి ప్రభుత్వ పోరంబోకు, కాలువ, శ్మశానవాటికగా నిర్వచించారన్నారు. పిటిషనర్ల వద్ద ఎలాంటి యాజమాన్య హక్కు పత్రాలు లేవన్నారు. ఆస్తిపన్ను కట్టినంతమాత్రాన ఆక్రమణదారులకు యాజమాన్య హక్కులు సంక్రమించవని పేర్కొన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం పొందేందుకు పిటిషనర్లు అర్హులు కాదంటూ వ్యాజ్యాలను కొట్టివేశారు.



అమరావతిలో క్వాంటమ్ వ్యాలీకి శంకుస్థాపన చేస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి జితేంద్ర సింగ్, వేదికపై టీసీఎస్ ప్రతినిధి హారిక్ విన్, ఎమ్మెల్యే శ్రవణ్, మంత్రులు దుర్గేశ్, లోకేశ్, ఐబీఎం ప్రతినిధి అమిత్ సింఘీ, శాస్త్రీయ విభాగం కార్యదర్శి అభయ్, కేంద్రమంత్రి పెమ్మసాని, ముఖ్య శాస్త్రీయ సలహాదారు అజయ్ కుమార్ సూద్, మంత్రి నారాయణ, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ కామకోటి, ఐఐటీ తిరుపతి డైరెక్టర్ సత్యనారాయణ

క్వాంటమ్ గేమ్ చేంజర్

తొలి కంప్యూటింగ్ వ్యవస్థ అమరావతిలో.. డిసెంబరు నాటికి తొలి 'కంప్యూటర్' చేతికి

- దీంతో మరో 35,40 ఏళ్లపాటు యువత భవిత బంగారమే
- కేవలం క్వాంటమ్‌కు మాత్రమే కాదు, లక్షల్లో నిపుణుల తయారీకి నాంది పలుకుతున్నా
- క్వాంటమ్‌లో నోబెల్ తెస్తే 100 కోట్ల నజరానా
- ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన
- అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ భవనాలకు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి శంకుస్థాపన

అమరావతి, గుంటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మరో 35, 40 ఏళ్ల పాటు యువత భవితను తీర్చిదిద్దేలా సాంకేతిక రంగం వైపు అడుగులు వేస్తున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. చరిత్రను సృష్టించాలన్నా, తిరగ రాయాలన్నా అది విద్యార్థులకే సాధ్యమని వ్యాఖ్యానించారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ భవనాలకు కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ తో కలిసి శనివారం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్వాంటమ్ కంప్యూటింగ్ మొత్తం దేశానికే గేమ్ చేంజర్ కానుందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్క ఇంజనీరింగ్, మెడిసిన్ విద్యార్థి కృత్రిమ మేధ (ఏఐ) , క్వాంటమ్ కంప్యూటింగ్‌లో నైపుణ్యం సాధించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 16వ తేదీన బిల్ గేట్స్ ఏపీకి వస్తున్నారని తెలిపారు. 'ఇక్కడ ఈరోజు 'క్వాంటమ్ వ్యాలీ భవనాలకు మాత్రమే నేను పునాది వేయడం లేదు. గ్లోబల్ క్వాంటమ్ కంప్యూటింగ్ విప్లవంలో భాగస్వామ్యమయ్యే నిపుణుల తయారీకి కూడా నాంది పలుకుతున్నాను. ఐక్య రాజ్యసమితి ఈ ఏడాదిని ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ క్వాంటమ్ సైన్స్ అండ్ టెక్నాలజీగా ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా సాంకేతిక సామర్థ్యాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ రంగానికి మంచి భవిష్యత్తు ఉంది." అని చంద్రబాబు పేర్కొన్నారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

నిన్న ఐటీ.. నేడు ఏఐ, క్వాంటమ్‌లదే భవిష్యత్తు

"గతంలో వ్యవసాయ, పారిశ్రామిక విప్లవాలను అందుకోలేకపోయాం. ఐటీ రంగాన్ని మాత్రం దక్కించుకున్నాం. ఇప్పుడు ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్‌లను సాధించుకోగలుగుతున్నాం. సాంకేతిక విప్లవాన్ని ఆదరించే ప్రధాని నరేంద్రమోదీ ఉండటం ఈ క్రమాన్ని వేగవంతం చేస్తోంది. సాంకేతికతను అందిపుచ్చుకున్న దేశానిదే భవిష్యత్తు. క్వాంటమ్ ఆకృతులు, ఉత్పత్తులు, ఇంటిలెక్చుయల్ ప్రాపర్టీస్‌కు అమరావతి కేంద్రం కానుంది. డిఫెన్స్, హెల్త్ కేర్, ఎనర్జీ, ఫైనాన్స్, క్లైమెట్ మోనెటరింగ్‌కు అమరావతి గమ్యస్థానం కానుంది. ఇప్పటిదాకా అమెరికాలోని సిలికాన్ వ్యాలీ గురించి మాట్లాడేవారు. భవిష్యత్తులో అందరూ అమరావతి క్వాంటమ్ వ్యాలీ గురించే మాట్లాడతారు. ఈ రంగంలో ప్రపంచ శ్రేణి టెక్నాలజీ నగరంగా అమరావతి మారనుంది. భారత్‌లోనే మొదటి 133 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్ కేంద్రాన్ని ఇక్కడ ఐబీఎంటీసీఎస్, ఎల్ అండ్ టీ ఏర్పాటుచేస్తున్నాయి."

2030 నాటికి 2.50 లక్షల మంది నిపుణులే లక్ష్యం

"ప్రధాని మోదీ ఆధునిక సాంకేతికతను బాగా అర్థం చేసుకున్నారు. సరైన సమయంలో సరైన వ్యక్తి సరైన చోట ప్రధానిగా ఉన్నారు. కేంద్రం ప్రారంభించిన క్వాంటమ్ కంప్యూటింగ్ విప్లవాన్ని రాష్ట్రం అందిపుచ్చుకుంది. తక్కువ సమయంలోనే వీటి ఏర్పాటుకు ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ సంస్థలు ముందుకు వచ్చాయి. ఈ ఏడాది డిసెంబరు నుంచి రాష్ట్రంలో తొలి క్వాంటమ్ కంప్యూటర్ పనిచేయడం ప్రారంభిస్తుంది. వీటిని 65 శాతం మేర దేశంలోనే తయారుచేస్తాం. ఈ రంగంలో నోబెల్ బహుమతి సాధించేవారికి రూ.100 కోట్లను పురస్కారంగా అందిస్తాం. 2030 నాటికి రెండున్నర లక్షల నిపుణులు ఇక్కడ పనిచేయడానికి అవసరం. ఇందులో భాగంగా వైజర్ సంస్థ ఇచ్చిన శిక్షణను యాభైవేలమంది ఇంజనీరింగ్ విద్యార్థులు పొందారు. దశల వారీగా 35 లక్షల మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వడాన్ని ఆ సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. దీనిపై ఐఐటీ మద్రాసు అడ్వాన్స్‌డ్ కోర్సుల కోసం దేశవ్యాప్తంగా 2.06 లక్షల మంది తమ పేరు నమోదు చేయించుకున్నారు. ఇక ప్రపంచ వ్యాపంగా ఈ రంగంలో 50 లక్షల మంది శిక్షణ పొందుతుంటే, అందులో పది లక్షల మంది ఆంధ్రా యువకులే ఉన్నారు. ఐఎస్బీ తరహాలోనే ఏఐ లివింగ్ వర్సిటీని ఏర్పాటు చేస్తున్నాం. ఏఐ, క్వాంటమ్ అవసరాల కోసం అమరావతిలో వర్సిటీని ఏర్పాటుచేస్తున్నాం. ప్రస్తుతం మేధా టవర్స్‌లో వీటిని తాత్కాలికంగా ప్రారంభిస్తున్నాం. త్వరలోనే శాశ్వత భవనాలను నిర్మిస్తాం. రాష్ట్రంలో ఏఐ లివింగ్ ల్యాబ్స్ వర్సిటీతో పాటు స్పేస్ టెక్నాలజీ వర్సిటీని కూడా ఏర్పాటు చేస్తున్నాం. ఔషధాల ఆవిష్కరణ, వ్యక్తిగత ఆరోగ్యం, వాతావరణ అంచనాలు, క్రాప్ ప్లానింగ్, వాటర్ మేనేజ్‌మెంట్, పంటల ఉత్పత్తులు తదితర అంశాల్లో క్వాంటమ్ కంప్యూటింగ్‌ను వినియోగిస్తాం. అమరావతి డీప్ టెక్నాలజీ ప్రయాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు.



శిలాఫలకం వద్ద సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జితేంద్రసింగ్, చిత్రంలో టీసీఎస్ ప్రతినిధి హారిక్ విన్, మంత్రులు దుర్గేశ్, నారాయణ, ముఖ్య శాస్త్రీయ సలహాదారు అజయ్ కుమార్ సూద్, శాస్త్రీయ విభాగం కార్యదర్శి అభయ్, ఐఏఎస్ కాటమనేని భాస్కర్, కేంద్రమంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే శ్రవణ్, గుంటూరు కలెక్టర్ తమీమ్ అన్సారియా, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి, తదితరులు



అమరావతిలో క్వాంటమ్ వ్యాలీకి శంకుస్థాపన సందర్భంగా నిర్వహించిన మారథాన్‌లో విజయం సాధించిన వారితో సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి జితేంద్ర సింగ్, మంత్రి నారా లోకేశ్, తదితరులు



క్వాంటమ్ వ్యాలీకి శంకుస్థాపన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

అమరావతికి 'క్వాంటమ్' కళ

- పండుగ వాతావరణంలో క్వాంటమ్ వ్యాలీ
- భవనాలకు శంకుస్థాపన.. పైలాన్ ఆవిష్కరణ
- సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ సమక్షంలో 15 సంస్థలతో కీలక ఎంవోయూలు

గుంటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విప్లవానికి దన్నుగా, యువత భవిష్యత్తుకు భరోసా కల్పించే విధంగా అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ భవన శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. వేలాది మంది విద్యార్థులు, యువకులు, రాజధాని రైతుల సమక్షంలో పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమం సాగింది. సభాప్రాంగణంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ అడుగుపెట్టగానే యువత కేరింతలు మిన్నంటిపోయాయి. విద్యార్థి, యువకుల సందళ్ల మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్ క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం పలు ప్రాజెక్టులను ఆవిష్కరించారు. సభాప్రాంగణంలోనే 15 ప్రతిష్ఠాత్మక సంస్థలతో ఎంఓయూలు కుదిరాయి. తొలుత టీసీఎస్‌కు సంబంధించిన క్వాంటమ్ క్లౌడ్ సర్వీసెస్‌ను చంద్రబాబు, జితేంద్ర సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా టీసీఎస్ సీఈవో హ్యారిక్ విన్ క్లౌడ్ సర్వీసు సేవల గురించి వివరించారు. అనంతరం ఐబీఎం సంస్థకు సంబంధించిన క్వాంటమ్ ఇన్నొవేషన్ సెంటర్(క్యూఐసీ)ను వారిద్దరూ ప్రారంభించారు. ఐబీఎం ప్రతినిధి అమిత్ సంఘీ క్యూఐసీ గురించి వివరించారు. ఆ తరువాత వాషింగ్టన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్టెమ్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ రిసెర్చ్ (వైజర్) సంస్థకు సంబంధించిన వైజర్ క్వాంటమ్ సొల్యూషన్స్‌ను ఆవిష్కరించారు. వచ్చే ఐదేళ్లలో 31 లక్షలమందికి శిక్షణ ఇస్తామని వైజర్ ప్రతినిధి వర్ధన్ తెలిపారు. అనంతరం ఎస్ఆర్ఎం వైస్ చాన్సలర్ సతీశ్ మాట్లాడారు. అనంతరం క్వాంటం అవేర్ 2.0ను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో జితేంద్ర సింగ్‌ను చంద్రబాబు సన్మానించారు. శాలువా కప్పి, ఆయనకు అరకు కాఫీని అందజేశారు. సభలో పాల్గొన్న కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులు, టీసీఎస్, ఐబీఎం, ఎల్అండ్‌టీ తదితర సంస్థల ప్రతినిధులను కూడా సత్కరించారు. అనంతరం హ్యాక్‌థాన్‌లో పాల్గొన్న 50 మంది విద్యార్థులతో ఫోటోలు దిగారు. కాగా సభాప్రాంగణంలో ప్రదర్శించిన ఏవీలు సభికులు, విద్యార్థులు, సాంకేతికరంగ నిపుణులను ఆకట్టుకున్నాయి. క్వాంటమ్ వ్యాలీ నమూనా సభికులను ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో ఐటీ మంత్రి లోకేశ్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రులు నారాయణ, దుర్గేశ్, ఎల్అండ్‌టీ సీఎండీ ఎంవీ సతీశ్, ఐఐటీ తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ కె.సత్యనారాయణ, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కామకోటి, కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగ కార్యదర్శి అభయ్ కరందికర్, కేంద్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సైంటిఫిక్ అబ్జర్వర్ అజయ్‌కుమార్ సూద్, ప్రముఖ ఐటీ సంస్థలు, రాష్ట్రం నలుమూలల నుంచి పలు విద్యాసంస్థల ప్రతినిధులు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

భాగస్వామ్య సంస్థలతో ఒప్పందాలు

క్వాంటమ్ కంప్యూటింగ్, అల్గారిథమ్స్, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, సెక్యూరిటీ, క్వాంటమ్ సెన్సింగ్, క్వాంటమ్ బయో ఫౌండ్రీ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఐక్యూ లీప్, ట్రై క్వాంటా ల్యాబ్స్, క్యూబిట్ ఫోర్స్, ఎస్ఆర్ఎం, క్వాంట్ ఫోకస్ ల్యాబ్స్ సహా 15 సంస్థలు ముందుకొచ్చాయి. వాటితో శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. అత్యధికంగా క్వాంటమ్ హార్డ్‌వేర్ అభివృద్ధికి సంబంధించి ఆరు సంస్థలు ఉత్సాహం చూపించాయి. ఈ సంస్థల రాకతో రాష్ట్రంలో క్వాంటమ్ సెన్సింగ్ రంగంలో ప్రత్యేక పరిశోధనలు జరగనున్నాయి. హెల్త్ కేర్ అప్లికేషన్లు, డిఫెన్స్, ఏరోస్పేస్ అవసరాలకు స్వదేశీ క్వాంటమ్ టెక్నాలజీని రూపొందించుకోగలుగుతాం. నేషనల్ క్వాంటమ్ మిషన్‌కు అనుగుణంగా హార్డ్‌వేర్ సిద్ధం చేసుకోగలం. శాటిలైట్ ఆధారిత క్వాంటమ్ రిఫరెన్సు, రిసెర్చ్ స్పెషాలిటీ సాకారం అవుతుంది. యువతకు క్వాంటమ్ నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు ఊపందుకుంటాయి.

ఏఐ హబ్‌గా విశాఖ

- డబుల్ ఇంజన్ సర్కారుతో ఏపీ అభివృద్ధి
- త్వరలోనే క్వాంటమ్‌లో ఎంటెక్ కోర్సులు
- రూ.6 వేల కోట్లతో నేషనల్ క్వాంటమ్ మిషన్
- కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడి

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): దేశంలోనే ఏఐ హబ్‌గా విశాఖపట్నం గుర్తింపు పొందుతుందని కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. డబుల్ ఇంజన్ సర్కారు ఉన్న ఏపీలో అభివృద్ధి పరుగులు పెడుతుందని చెప్పారు. రాజధాని అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు శనివారం ఆయన విజయవాడ చేరుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలోనూ, అమరావతి క్వాంటమ్ వ్యాలీ భవనాలకు సీఎం చంద్రబాబుతో కలసి శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. రాజధాని అమరావతి అభివృద్ధి, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడం, వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన ప్రాజెక్టులకు కేంద్రం నిధులు సమకూరుస్తోందని వివరించారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకునే దిశగా 25 సంవత్సరాలకు నిర్దేశించుకున్న శక్తిమంతమైన రోడ్‌మ్యాప్‌తో ఇటీవల కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టారని చెప్పారు. సామాన్యులపై భారం తగ్గించేందుకు 17 రకాల క్యాన్సర్ మందులు, 7 రకాల అరుదైన వ్యాధులకు సంబంధించిన మందులపై పన్నులు రద్దు చేశారని పేర్కొన్నారు. దేశ చరిత్రలో మొదటిసారిగా కేంద్ర బడ్జెట్‌లో మానసిక ఆరోగ్యానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ నిమ్హాన్స్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలను దేశవ్యాప్తంగా విస్తరించనున్నట్లు చెప్పారు. బయో-టెక్నాలజీ రంగానికి రూ.10వేల కోట్లు కేటాయించడం దేశంలో మరో పారిశ్రామిక విప్లవానికి నాంది కానుందన్నారు. కాగా, క్వాంటమ్ కంప్యూటింగ్‌లో ప్రస్తుతం బీటెక్ కోర్సులు అందిస్తున్న వర్సిటీలు త్వరలోనే ఎంటెక్ కోర్సులు కూడా ప్రారంభిస్తాయని జితేంద్ర సింగ్ ప్రకటించారు. 'సాధారణంగా మనమంతా ఇవ్వాల్టి రోజున జీవిస్తూ, రేపటి కోసం ఆలోచిస్తాం. కానీ సీఎం చంద్రబాబు రేపటి కోసం జీవిస్తూ, ఎల్లుండి కోసం ఆలోచిస్తారు. విశాఖను డీప్-సీ రీసెర్చ్ కేంద్రంగా మార్చేలా ప్రధాని మోదీ ఎర్రకోట నుంచి ప్రకటించారు. ఆ కార్యాచరణను త్వరితగతిన అమలు చేస్తాం. భారత్‌ను సాంకేతికంగా అత్యున్నతంగా మారుస్తాం' అని కేంద్ర మంత్రి తెలిపారు. నేషనల్ క్వాంటమ్ మిషన్‌ను ప్రారంభించామని, దీనికోసం రూ.6 వేల కోట్లు కేటాయించామని వివరించారు.



క్వాంటమ్ వ్యాలీకి శంకుస్థాపన వేదికపై మాట్లాడుకుంటున్న చంద్రబాబు, జితేంద్ర సింగ్, లోకేశ్

అమరావతి క్వాంటమ్ వ్యాలీ కంప్యూటర్లతో పాటు నిపుణులను కూడా తయారు చేస్తుందని ప్రకటించారు. రక్షణ, ఆరోగ్యం, ఆర్థికం... తదితర రంగాల్లో వేగవంతమైన పరిశోధనలు, ఆవిష్కరణలతో పాటు క్యూబిట్ నుంచి క్రయోజెనిక్స్ సహా వేర్వేరు అధునాతన సాంకేతికాంశాలకు ఈ హబ్ కేంద్రంగా పనిచేస్తుందని తెలిపారు. ఇక్కడి నుంచి ప్రపంచవ్యాప్తంగా సేవలు అందుతాయన్నారు. పవిత్ర అమరావతి రాజధాని నుంచి భారత క్వాంటం కంప్యూటింగ్ ప్రయాణం ప్రారంభించడం వికసిత్ భారత్‌లో కీలకమని జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. అంతకుముందు విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కేంద్ర బడ్జెట్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

రేర్ ఎర్త్ కారిడార్‌తో రాష్ట్రం అభివృద్ధి

- ఉడాన్‌తో సామాన్యులకు విమానయానం
- కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఉడాన్ పథకం ద్వారా సామాన్యులకు విమానయానం అందుబాటులోకి వచ్చిందని పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్‌నాయుడు చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు రేర్ ఎర్త్ కారిడార్ ఇవ్వడం మంచి అవకాశం అని చెప్పారు. అరుదైన ఖనిజాల తవ్వకంతో రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో పర్యావరణానికి ఇబ్బందులు లేకుండా ఎక్కడ ఖనిజం తవ్వితే అక్కడే ప్రాసెసింగ్ చేసేటట్టు ఈ కారిడార్‌ను అమలు చేస్తామన్నారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వచ్చిన సందర్భంగా ఆయన ఓ ప్రైవేటు హోటల్‌లో మీడియాతో మాట్లాడారు. కేంద్రం సహకారంతో సీఎం చంద్రబాబు 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నంబర్ 1 చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. దేశీయంగా విమానాలు తయారు చేయనున్నామని చెప్పారు. సాధారణంగా కేంద్ర బడ్జెట్‌ను ఎన్నికల జరిగే రాష్ట్రాలకు అనుకూలంగా పెడతారనే అపోహ ఉందని, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ రాజకీయాలకు అతీతంగా 144 కోట్ల మంది ప్రజల భవిష్యత్ నిర్ణయించేలా ఉందని కితాబునిచ్చారు. లక్షలాది మంది యువత అభిప్రాయాలు, ఆలోచనలు, ఆకాంక్షలు తెలుసుకుని ఈ బడ్జెట్ ప్రవేశపెట్టామన్నారు. ప్రపంచంలోనే నాలుగో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదగడం వెనుక ప్రధాని మోదీ దార్శనికత ఉందన్నారు. హెల్త్, సర్వీసు, ఐటీ, ఏఐ, డేటా సెంటర్లు, సెమీ కండక్టర్ పరిశ్రమలను కేంద్రం ప్రోత్సహిస్తోందన్నారు. యువతకు ఉపాధి కల్పన లక్ష్యంతో జిల్లాల్లో వనరుల ఆధారంగా ఆయా రంగాలను ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు.

దేశ క్వాంటం టెక్నాలజీకి పునాది

అమరావతి క్వాంటం కంప్యూటింగ్ హబ్‌పై లోకేశ్

- ఫ్రంటియర్ ఇన్నోవేషన్ సృష్టికర్తగా రాష్ట్రాన్ని నిలబెడతాం
- క్వాంటం వ్యాలీతో భారీ స్థాయిలో హైటెక్నాలజీ ఉద్యోగాలు
- చంద్రబాబు సారథ్యంలో క్వాంటం విప్లవం: మంత్రి

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): దేశ క్వాంటం టెక్నాలజీకి పునాదిగా అమరావతి క్వాంటం వ్యాలీ నిలుస్తుందని ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఉద్ఘాటించారు. శనివారం అమరావతి క్వాంటంవ్యాలీ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. దేశ క్వాంటం టెక్నాలజీ భవిష్యత్ నాయకత్వానికి పునాది వేస్తున్నామన్నారు. అమరావతిలో చరిత్రాత్మక క్వాంటం వ్యాలీ కి సీఎం చంద్రబాబు భూమి పూజ చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా క్వాంటం వ్యాలీ నిర్మాణంలో భాగస్వామ్యమయ్యే 14 సంస్థలతో ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడాన్ని స్వాగతించారు. సాఫ్ట్‌వేర్ రంగాన్ని ప్రపంచం అర్థం చేసుకుంటున్న సమయంలోనే ఈ రంగంలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాన్ని సాధించిందన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో హైదరాబాద్‌ను గ్లోబల్ లీడర్‌గా నిలపాలన్న సంకల్పంతో చంద్రబాబు.. మైక్రోసాఫ్ట్ అప్పటి సీఈవో బిల్ గేట్స్‌తో సమావేశమై ఒప్పించారన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో క్వాంటం కంప్యూటింగ్ హబ్‌ను ఏర్పాటు చేసేందుకు ఐబీఎం, టీసీఎల్, ఎల్ అండ్ టీలను ఒప్పించారన్నారు. హైదరాబాద్‌కు ఐటీ రంగాన్ని తీసుకువచ్చి లక్షలాది మంది యువతకు ఉద్యోగాల ను కల్పించేలా చంద్రబాబు కృషి చేశారన్నారు. రాష్ట్రానికి 3 బలాలు ఉన్నాయని.. వాటిలో మొదటిది చంద్రబాబు సమర్థ నాయకత్వమని లోకేశ్ పేర్కొన్నారు. రెండోది స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అని వెల్లడించారు. దీనిలో భాగంగానే విశాఖలో భారీ పెట్టుబడితో గూగుల్ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ లక్ష్యాన్ని కేవలం 13 నెలల్లోనే సాధించామన్నారు. దేశంలో ఇతర రాష్ట్రాల్లో అసాధ్యమనుకున్నది సాధించగలిగే సమర్థ నాయకత్వం ఉందన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రయిన్ సర్కారు ఉందని తెలిపారు. రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించాలన్న ఆకలి, కాంక్ష ఉన్నాయన్నారు. స్టార్టప్ రాష్ట్రంగా పెట్టుబడులను ఆకర్షిస్తున్నామన్నారు. ప్రపంచంలోనే మొట్టమొదటిగా అమరావతి క్వాంటం కంప్యూటింగ్ వాలీకి శ్రీకారం చుట్టామని లోకేశ్ వెల్లడించారు. సాఫ్ట్‌వేర్, ఆల్గారిథమ్ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేస్తున్నామని లోకేశ్ వెల్లడించారు. భవిష్యత్తును తీర్చిదిద్దే అత్యున్నత సాంకేతిక ఆవిష్కరణ సృష్టికర్తగా రాష్ట్రాన్ని మారుస్తున్నామని లోకేశ్ చెప్పారు. క్వాంటం కంప్యూటింగ్ పరికరాల హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌ను ప్రపంచానికి సరఫరా చేసేలా కార్యాచరణకు సిద్ధమయ్యామని వివరించారు. క్వాంటం కంప్యూటింగ్‌లో 50 వేల మందికి శిక్షణ ఇచ్చామన్నారు. మరో పది లక్షల మంది యువతకు కూడా శిక్షణను ఇస్తామన్నారు. క్వాంటం కంప్యూటింగ్ హబ్‌లో విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి సహకరించడం తో పాటు భవిష్యత్తు క్వాంటం ఇంజనీర్లను తయారు చేస్తామని ప్రకటించారు. అమరావతి అడ్మినిస్ట్రేటివ్ క్యాపిటల్ మాత్రమే కాదని, సైన్స్, కంప్యూటేషన్, ఇన్నోవేషన్ క్యాపిటల్‌గా ఉంటుందన్నారు. గ్లోబల్ టాలెంట్‌కు కేరాఫ్‌గా క్వాంటం వ్యాలీ వ్యవహరిస్తుందని వివరించారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో దేశంలో క్వాంటం కంప్యూటింగ్ విప్లవాన్ని రాష్ట్రం.. ముందుండి నడిపిస్తుందని లోకేశ్ వెల్లడించారు.



బ్యాంక్ లాకర్‌లో లభ్యమైన బంగారు ఆభరణాలు

రిటైర్డ్ ఎస్ఈ లాకర్‌లో 1.7 కిలోల బంగారం!

- కళ్లేపల్లి శ్రీనివాసరావు
- బ్యాంకు లాకర్‌ను తెరిపించిన ఏసీబీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ శాఖ రిటైర్డ్ ఎస్ఈ కళ్లేపల్లి శ్రీనివాసరావుకు సంబంధించిన మరిన్ని ఆస్తులను ఏసీబీ అధికారులు గుర్తించారు. శ్రీనివాసరావుతోపాటు ఆయన బంధువులు, స్నేహితులకు చెందిన నివాసాల్లో ఈనెల 5న ఏసీబీ సోదాలు నిర్వహించి సుమారు రూ.3 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించిన విషయం తెలిసిందే. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నందున శ్రీనివాసరావును అరెస్టు చేసి శుక్రవారం కోర్టులో హాజరుపరచగా ఈనెల 20వ తేదీ వరకు రిమాండ్ విధించింది. తాజాగా శ్రీనివాసరావుతోపాటు ఆయన భార్య పేరిట ఎంవీవీ సిటీలోని ఐసీఐసీఐ బ్యాంకులో ఉన్న లాకర్‌ను ఏసీబీ అధికారులు శనివారం తెరిపించారు. అందులో మూడు వడ్డాణాలు, ఒక హారం సహా 1.737 కిలోల బరువు కలిగిన 28 ఆభరణాలు లభ్యమయ్యాయి.

వైవీ సుబ్బారెడ్డికి రక్షణ కల్పించండి

- లడ్డూ కల్తీని అంగీకరించిన ఆయనకు ప్రాణహాని
- సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత విజ్ఞప్తి

కడప, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): 'తిరుమల లడ్డూ కల్తీ జరిగిందని జగన్ బాబాయ్, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అంగీకరించారు. దీంతో ఆయనకు ప్రాణహాని ఉంది. సీఎం చంద్రబాబు ఆయనకు రక్షణ కల్పించాలి' అని మంత్రి ఎస్.సవిత విజ్ఞప్తి చేశారు. శనివారం కడపలోని జిల్లా పార్టీ కార్యాలయంలో టీడీపీ కడప పార్లమెంటు నియోజకవర్గ నూతన కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత మాట్లాడారు. కల్తీని వైవీ సుబ్బారెడ్డి అంగీకరించడంతో జగన్ అండ్ కో బ్యాచ్‌కు ఏం చేయాలో పాలుపోవడం లేదని మంత్రి సవిత అన్నారు.

జగన్‌ను, వైవీ సుబ్బారెడ్డినీ తక్షణమే అరెస్టు చేయాలి

- వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి వినోద్ బన్సాల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): 'జగన్ ఐదేళ్ల పాలనలో తిరుమల లడ్డూ తయారీలో బాత్‌రూమ్ క్లీనింగ్ కోసం ఉపయోగించే రసాయనాలతో తయారు చేసిన నెయ్యిని వాడారంటూ ఏపీ సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు దిగ్భ్రాంతిని, తీవ్ర మనోవేదనను కలిగిస్తున్నాయి' అని విశ్వహిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి వినోద్ బన్సాల్ అన్నారు. శనివారం ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. 'హిందూ సమాజపు విశ్వాసాలు, నమ్మకాలు, పవిత్ర సంప్రదాయాలపై దీర్ఘకాలికంగా జరుగుతున్న వ్యవస్థీకృత దాడిని ఇది సూచిస్తోంది. దీనిని కేవలం పొరపాటుగా చూడలేం. ఇది ఉద్దేశపూర్వక హిందూ వ్యతిరేక మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తోంది. మాజీ సీఎం జగన్, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిపై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్టు చేయాలి. మత విశ్వాసాలను అపవిత్రం చేసే వారి పట్ల ఉదాసీనత చూపకూడదు' అని బన్సాల్ అన్నారు.

నెయ్యి కల్తీ నిజం... అనుమానమే లేదు

- జంతు కొవ్వు ఉందని ఎన్డీడీబీ స్పష్టం చేసింది
- సంబంధం ఉన్నవాళ్లు జైలుకెళ్లడం ఖాయం: కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): 'తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి గత ప్రభుత్వం కల్తీ నెయ్యి సరఫరా చేసిందన్నది వంద శాతం నిజం. అందులో ఏమాత్రం అనుమానమే లేదు' అని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ స్పష్టం చేశారు. శనివారం ఆయన తిరుపతిలో మీడియాతో మాట్లాడారు. 'నెయ్యిలో కల్తీ జరిగిందన్న విషయం రాజకీయ వాదన కాదు. అధికారిక నివేదికలతో రుజువైన వాస్తవం. వైసీపీ నేతలు నెయ్యిలో జంతు కొవ్వు లేదని మాత్రమే చెబుతున్నారు తప్ప ఇతర రసాయనాలు లేవని అనడంలేదు. అంటే నెయ్యి కల్తీ అని ఒప్పుకున్నట్టే. కల్తీ నెయ్యిలో జంతు కొవ్వు, మోనో గ్లిజరైడ్స్, ఆర్టిఫిషియల్ ఫ్లేవర్లు, ఇతర రసాయనాలు కలిసినట్టు జాతీయ డైరీ అభివృద్ధి బోర్డు(ఎన్డీడీబీ) ల్యాబ్ నివేదిక స్పష్టంగా పేర్కొంది. ఈ నివేదికను చంద్రబాబో, కూటమి ప్రభుత్వమో తయారు చేయలేదు. టెండర్ నిబంధనల్లో మార్పులు చేసిన తీరునుబట్టి మొత్తం అక్రమ వ్యవహారాన్ని అర్థం చేసుకోవచ్చు. దీనిలో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరూ జైలుకు వెళ్లడం ఖాయం' అని చెప్పారు.

బాధ్యులను కఠినంగా శిక్షించండి: స్వామీజీలు

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో ఉపయోగించే నెయ్యిలో రసాయనాల మిశ్రమం కలవడంపై పలువురు స్వామీజీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది భక్తులు కొలిచే దేవదేవుడి ప్రసాదంలో కల్తీ జరగడం భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని స్వామీజీలు పేర్కొన్నారు. లడ్డూ కల్తీకి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని, ముఖ్యమంత్రి చంద్రబాబును కోరుతూ వారిద్దరికీ కర్ణాటకకు చెందిన శ్రీశ్రీ వ్యాసరాజ మఠం స్వామీజీ శ్రీవిద్యాశ్రీషతీర్థ, తమిళనాడులోని మన్నార్‌గుడి మఠం స్వామి చెందలంకర సంపత్ కుమార రామానుజ జీయర్, శ్రీ పెరంబదూర్ జీయర్ స్వామి లేఖలు రాశారు.

'లడ్డూ' రాజకీయాలు ఆపండి

- విజయవాడలో పౌర సంస్థల సదస్సులో వక్తలు

విజయవాడ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాలు లడ్డూ రాజకీయాలను వదిలిపెట్టాలని, విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి నడుం బిగించాలని పౌర సంఘాల నేతలు సూచించారు. విజయవాడలోని దాసరి భవన్‌లో పౌర సంస్థల ఆధ్వర్యంలో 'రాష్ట్ర రాజకీయాలు- చట్టబద్ధ పాలన' అనే అంశంపై శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రభుత్వ మాజీ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి డాక్టర్ పీవీ రమేశ్ మాట్లాడుతూ, రాష్ట్రం సుమారుగా రూ. 16 లక్షల కోట్ల అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. లిబరల్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపకుడు, విశ్రాంత ఐఏఎస్ అధికారి జీఎస్ఆర్‌కేఆర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో రాజ్యాంగ, చట్టబద్ధంగా కాకుండా రాజకీయ పాలన సాగుతోందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ప్రసంగిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఎలాంటి కృషి చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ నడపడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు, జన చైతన్య వేదిక అధ్యక్షుడు లక్ష్మణరెడ్డి, రిపబ్లికన్ పార్టీ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దేవీప్రసాద్, పీసీసీ ఉపాధ్యక్షుడు శివాజీ తదితరులు పాల్గొన్నారు.


'కల్తీ'లో హవాలా

(మొదటి పేజీ తరువాయి)

పంచుకున్నారు. ఢిల్లీ, విజయవాడ మీదుగా తిరుపతికి సాగిన హవాలా మార్గంలో తిరుపతిలోని మంగళం వద్ద ఉన్న ఓ ఇంటికి 20 కోట్ల సొమ్ము చేరింది. అతిస్వల్ప మొత్తం టీటీడీ డెయిరీ నిపుణుడు విజయభాస్కర్‌రెడ్డికి, మరికొంత కమిషన్ ఏజెంటు శ్రీనివాసన్‌కు వెళ్లింది. నికరంగా 19.86 కోట్ల రూపాయలు వైష్ణవి డెయిరీ సీఈఓ అపూర్వ చావ్డాకు చేరినట్లు నిర్ధారణ అయింది. ఆ తర్వాత అక్కడి నుంచి డబ్బు ఎక్కడికి వెళ్లిందన్నది మాత్రం పెద్ద మిస్టరీనే. అంతిమ లబ్ధిదారుడు ఎవరన్నది సిట్ కనిపెట్టలేకపోయింది. మాఫియా రాకెట్‌ను తలదన్నేలా ఈ హవాలా బాగోతం సాగింది. చుక్క పాలు కూడా సేకరించని భోలే బాబా డెయిరీ తిరుమలకు స్వచ్ఛమైన ఆవుపాల నెయ్యి సరఫరా చేస్తామని టెండర్ దక్కించుకోవడమే ఓ పెద్ద కుట్ర. ఈ కుట్రను అమలు చేయడంలో, హవాలా రాకెట్‌లో భోలే బాబా నిర్వాహకులు పొమిల్ జైన్(ఏ3), విపిన్ జైన్ (ఏ4)లు ఎవరెవరిని భాగస్వాములు చేశారు? కల్తీకి అవసరమైన రసాయనాలు, ఇతర నూనెలను ఎక్కడెక్కడ కొన్నారు? ఎక్కడెక్కడ దొంగ బిల్లులు సృష్టించారు? నెయ్యి సరఫరా కాంట్రాక్టులో డబ్బులు ఏయే మార్గాల్లో తిరుపతిలోని అపూర్వ చావ్డాకు చేరాయి? అన్నదే హవాలా రాకెట్‌లోని అసలు గుట్టు.

భోలే బాబా నుంచి భోలే బాబాకు

హవాలా రాకెట్‌ను భోలే బాబా నిర్వాహకులైన పొమిల్‌జైన్, విపిన్‌జైన్‌లు ముందుండి నడిపారు. ఇందులో ఆశీష్ అగర్వాల్ అనే వ్యక్తి (ఏ15) కీలకం. ఆయన ఓ హవాలా ఏజెంటు. పాత ఢిల్లీలో చాందినీ చౌక్‌లోని కుచా గచీరామ్‌లో ఆయనకు ఓ హవాలా దుకాణం(షాప్ నంబరు 304) ఉంది. భోలే బాబా నిర్వాహకులు నెయ్యిని ఆశీష్ అగర్వాల్ నుంచి కొన్నట్లుగా తప్పుడు పత్రాలు సృష్టించారు. భోలా బాబా బ్యాంకు ఖాతాల నుంచి ఆశీష్ అగర్వాల్‌కు నగదు చెల్లింపులు జరిగాయి. తనకొచ్చిన డబ్బును ఆయన బ్యాంకుల నుంచి విత్‌డ్రా చేసి హవాలా మార్గంలో వ్యవహారం నడిపించారు. ఆ డబ్బును తొలుత రాధేశ్యామ్ ఓజా నడిపిస్తున్న హవాలా దుకాణం (నంబరు 287)కు చేర్చారు. ఆ తర్వాత డబ్బును అదే ప్రాంతంలో ఉన్న మరో హవాలా దుకాణం (షాప్ నంబరు 18బీ)కి చేర్చారు. ఇది రిషబ్ జైన్ అనే వ్యాపారిది. ఇక్కడి నుంచి డబ్బును గ్వాలియర్‌కు చెందిన దీపక్‌జైన్‌కు చేర్చారు. ఆయనకు డబ్బు చేర్చడం వెనుక ఓ కారణం ఉంది. భోలే బాబా డెయిరీ కల్తీ నెయ్యి తయారీకి ముందు రిఫైన్డ్ పామ్‌కెర్నెల్ ఆయిల్, పామోలిన్‌లు సమకూర్చుకున్నది. వీటిని దీపక్ జైన్‌కు డైవర్ట్ చేశారు. అయితే భోలే బాబాకే చెందిన కంపెనీలు హర్ష్ ట్రేడింగ్ కో, హర్ష్ ఫ్రెష్ డెయిరీ ఫుడ్జ్ నుంచి దీపక్‌జైన్ వాటిని కొనుగోలు చేసినట్లుగా తప్పుడు బిల్లులు సృష్టించారు. అందుకే దీపక్ జైన్ తనకు హవాలా మార్గంలో చేరిన డబ్బును తిరిగి వైట్‌గా మార్చి భోలే బాబాకు బిల్లుల చెల్లింపు పేరిట అధికారికంగా బ్యాంకు ఖాతాల ద్వారా పంపించారు.



హవాలా సొమ్ము తిరుపతికి

హవాలా రాకెట్‌లో మరో కోణం ఉంది. ఆశీష్ అగర్వాల్ మరికొంత డబ్బును పటేల్ లాలా భాయ్‌కు చెందిన హవాలా దుకాణం (షాప్ నంబర్ 309-1బీ)కు పంపించారు. ఆయన దగ్గర ఏవో ముడిపదార్థాలు కొనుగోలు చేసినట్లుగా బిల్లులు సృష్టించారు. ఆ బిల్లుల చెల్లింపు పేరిట సొమ్మును పంపించారు. తనకందిన డబ్బును పటేల్ లాలా భాయ్ తన ముగ్గురు హవాలా ఏజెంట్లకు పంపించారు. వారిలో విజయవాడలోని భారత్ భాయ్ ఠాకూర్, చెన్నైలోని మదరమ్ దేవాసి, హైదరాబాద్‌కు చెందిన అర్జున్ గోస్వామి ఉన్నారు. వైష్ణవీ డెయిరీ అనేది కూడా కల్తీనెయ్యి సరఫరాలో కీలకపాత్రధారి. తిరుపతికి భోలే బాబా తరఫున నెయ్యి సరఫరా చేసిన వాటిలో వైష్ణవీ డెయిరీ కూడా ఉంది. దాని సీఈఓనే తిరుపతిలోని మంగళం ఏరియాలో ఉన్న అపూర్వ చావ్డా. పటేల్ లాలా భాయ్‌కు చెందిన హవాలా ఏజెంట్లను అపూర్వ చావ్డా 2023-24 సంవత్సరాల వ్యవధిలో పలుమార్లు కలిశారు. వారి వద్ద నుంచి 19.86 కోట్ల రూపాయలను తీసుకెళ్లిపోయారు. విజయవాడలో హవాలా ఏజెంటు భారత్ భాయ్ ఠాకూర్ వద్దకు అపూర్వ చావ్డా పలుమార్లు వెళ్లి డబ్బు తీసుకున్నారు.

ఎవరీ అపూర్వ చావ్డా?

అపూర్వ చావ్డా గుంటూరులోని ఓ మిర్చి వ్యాపారి. తర్వాత ఆయన వైష్ణవి డెయిరీ సీఈఓగా వచ్చారు. భోలే బాబా నిర్వాహకులు పొమిల్ జైన్, విపిన్ జైన్‌లతో ఉన్న పరిచయాలతో కల్తీనెయ్యిలో వేలుపెట్టారు. గతంలో భోలే బాబా డెయిరీకి తిరుమలకు నెయ్యి సరఫరా కాంట్రాక్టు దక్కింది. తనకంత సామర్థ్యం లేదు కాబట్టి వైష్ణవి డెయిరీకి సబ్ కాంట్రాక్టు ఇప్పించారు. ఈ డెయిరీ నుంచి కూడా కల్తీ నెయ్యి తిరుమలకు సరఫరా అయిందని సిట్ తేల్చింది.

ఎప్పుడెప్పుడంటే..

- 2024 జనవరి, ఫిబ్రవరి, మార్చి, జూన్, జూలై నెలల్లో కలిపి మొత్తం 12.55 కోట్ల రూపాయలను అపూర్వ చావ్డా తీసుకున్నారు.
- పటేల్ లాలా భాయ్‌కు చెందిన మరో ఏజెంటు మదరమ్ దేవాసి (చెన్నై) నుంచి 2023- 24 సంవత్సరాల్లో చావ్డా 7.31 కోట్ల రూపాయలను హవాలా మార్గంలో తీసుకున్నారు. ఇవన్నీ భోలే బాబా నిర్వాహకులు పంపించిన సొమ్మే.
- చావ్డాకు మొత్తం 19.86 కోట్ల రూపాయలు చేరింది. కొన్ని సందర్భాల్లో ఆయనే నేరుగా హవాలా ఏజెంట్ల వద్దకు వెళ్లి డబ్బు తీసుకోగా, మరికొన్ని సార్లు హవాలా ఏజెంట్లు తిరుపతిలోని ఆయన ఇంటికి డబ్బు చేర్చారు.


టీటీడీ డెయిరీ నిపుణుడికి సొమ్ము


హవాలా డబ్బు అందుకున్న వారిలో నాటి టీటీడీ డెయిరీ నిపుణుడు మద్ది విజయభాస్కర్‌రెడ్డి కూడా ఉన్నారు. హైదరాబాద్‌లోని హవాలా ఏజెంటు అర్జున్ గోస్వామి ద్వారా భోలే బాబా నిర్వాహకులు విజయభాస్కర్‌రెడ్డికి 75 లక్షల రూపాయలు పంపించారు. మూడు దఫాలుగా ఈ నగదు చేరింది. వైష్ణవీ డెయిరీ ద్వారా టీటీడీకి కల్తీనెయ్యి సరఫరా అయ్యేలా సహకరించినందుకు ఈ నజరానా ఇచ్చారు. సిట్ విచారణ మొదలయ్యాక ఈ విషయం గుర్తించి, తనిఖీల సందర్భంగా 34 లక్షల నగదును సిట్ సీజ్ చేసింది. కమిషన్ ఏజెంట్ ద్వారా మేనేజ్‌మెంట్‌పి.పి.శ్రీనివాసన్ అనే కమిషన్ ఏజెంటుకు కూడా భోలే బాబా డెయిరీ నుంచి 31.40 లక్షల నగదు అందింది. చెన్నైలో ఉండే మదరమ్ దేవాసి అనే హవాలా ఏజెంటు ద్వారా ఆయనకు ఈ డబ్బు చేరింది. ఈ డబ్బును శ్రీనివాసన్‌తో పాటు కల్తీనెయ్యికి అన్ని విధాలుగా సహకరించిన టీటీడీలోని అధికారులు, ఉద్యోగులకు ఇవ్వాలని భోలే బాబా నిర్వాహకులు పంపించారు.

కంపు కొడుతోందని నాడే చెప్పాం!

- శ్రీవారి పవిత్ర లడ్డూ ప్రసాదంలో నెయ్యి సువాసన కూడా రాలేదు
- ఒక్కపూట నిల్వ ఉంటేనే కంపు కొట్టింది
- కౌంటర్లలోనే పిండి పిండి అయిపోయింది
- తిరుమల లడ్డూ కల్తీ నెయ్యిపై నెటిజన్ల చర్చ
- పాత పోస్టులు మళ్లీ వైరల్ చేస్తున్న భక్తులు

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో తిరుమల శ్రీవారి పవిత్ర లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి వినియోగించంపై సామాజిక మాధ్యమాల్లో విస్తృత చర్చ జరుగుతోంది. లడ్డూ నాణ్యతపై 2020-23 మధ్యకాలంలో తాము ఎన్నో ఫిర్యాదులు.. పోస్టులు చేశామని పలువురు నెటిజన్లు అప్పట్లో చేసిన పోస్టులను మళ్లీ వైరల్ చేస్తున్నారు. తాజాగా సిట్ నివేదికలో లడ్డూకు వాడిన నెయ్యి కల్తీ జరిగిందని స్పష్టం చేయడంతో, సిట్ నివేదికలోని అంశాలను ప్రస్తావిస్తూ తమ పాత పోస్టులను నెటిజన్లు మళ్లీ తెరపైకి తెస్తున్నారు. నాణ్యత లేని నెయ్యితో లడ్డూల తయారీపై నాడు ప్రజలు, భక్తులు ఫిర్యాదులు చేసిన పోస్టులు ఇప్పుడు పెద్ద ఎత్తున వైరల్ అవుతున్నాయి. దర్యాప్తు జరగకముందే లడ్డూలో నెయ్యి నాణ్యతపై తాము టీటీడీ పాలకమండలికి అనేక రూపాల్లో ఫిర్యాదులు చేశామని, సామాజిక మాధ్యమాల్లోనూ ఆ ఫిర్యాదులను పోస్టు చేశామని పలువురు నెటిజన్లు గుర్తు చేస్తున్నారు. కంపు కొడుతోందని ఆనాడే ఫిర్యాదు చేశామని, ఒక్కపూట నిల్వ ఉంటేనే వాసన వస్తోందని చెప్పామని తెలిపారు.





ఒక్కొక్కరిది ఒక్కొక్క గోడు!

- 'లడ్డూ నాణ్యంగా లేదు. పొడి అయిపోతోంది. నెయ్యి సువాసన, నాణ్యత అస్సలు లేదు. అన్నప్రసాదం బాగోలేదు' - 2022, మార్చి 24న ఓ భక్తుడి ఆవేదన.
- 'లడ్డూ ప్రసాదం కొద్దిగా రుచి చూసినా వళ్లంతా దద్దుర్లు వస్తున్నాయి. నెయ్యి పక్కా కల్తీగా ఉంది. మహాప్రభో సరి చేయండి' - 2022, మే 29న మరో భక్తుడి గోడు.
- 'తిరుపతి లడ్డూను ముక్కు దగ్గర పెట్టుకున్నా వాసన రావడం లేదు. లడ్డూలకు వెళ్లాల్సిన నెయ్యిని కూడా నాకేస్తున్నారా?' - 2021, మార్చి 13న వెంకన్న భక్తుడి ఆగ్రహం.
- 'ప్రసాదంలో నెయ్యి మాయం. ఏడుకొండలపై వెంకటేశుని నామం మారుమోగడం లేదు'- 2023, మే21న ఓ భక్తుని వేదన.
- 'గడిచిన మూడేళ్ల నుంచి లడ్డూ క్వాలిటీ బాగోవడం లేదు. కౌంటర్లో ఇచ్చినప్పుడే పొడి అయిపోతోంది' - ఓ భక్తుడి ఆందోళన.
- లడ్డూలో నెయ్యి వాసనే లేదని నాటి టీటీడీ చైర్మన్లు.. సుబ్బారెడ్డి, భూమనలకే నేరుగా ఫిర్యాదులు చేసినా ఎలాంటి ఉపయోగం లేకుండా పోయిందని, ఎన్ని ఫిర్యాదులు చేసినా టీటీడీ పాలకమండలి పట్టించుకున్నదే లేదని మరికొందరు భక్తులు వాపోయారు.
- ఉద్దేశపూర్వకంగా నెయ్యి కల్తీ జరిగిందని నెటిజన్లు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- 2022లోనే సీఎఫ్‌టీఆర్ఐ ల్యాబ్ నివేదికలో కల్తీ నెయ్యి గురించి నాటి టీటీడీ పెద్దలకు సమాచారం ఉందని, సిట్ చార్జిషీట్‌లో కూడా పేర్కొన్నారని, ఉద్దేశపూర్వకంగానే తిరుమల లడ్డూ పవిత్రతను దెబ్బతీసేందుకు కల్తీకి పాల్పడ్డారని మరికొందరు భక్తులు పోస్టులు పెడుతున్నారు.
- కోట్ల మంది భక్తుల అభిప్రాయాలను, ఫిర్యాదులను పట్టించుకోకుండా నాటి పాలకమండలి, అధికారులు మహాపాపం చేశారని నెటిజన్లు మండిపడుతున్నారు.



రూల్స్ ఉల్లంఘన.. ప్రజలకు అసౌకర్యం

- మాజీ మంత్రి జోగి రమేష్‌పై కేసు

విజయవాడ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి జోగి రమేష్‌పై ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. మాజీ సీఎం జగన్ ర్యాలీ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించి, ప్రజలకు అసౌకర్యం కలిగించారని ఈ కేసు నమోదు చేశారు. టీడీపీ శ్రేణులు జోగి ఇంటిపై దాడి చేయడంతో జగన్ శుక్రవారం పరామర్శకు వచ్చారు. ఆయనకు స్వాగతం పలకడానికి, తన బలాన్ని చూపించడానికి జోగి జనసమీకరణ చేశారు. యువకులు రహదారులపై ద్విచక్రవాహనాలతో ప్రమాదకర స్టంట్లు వేశారు. ర్యాలీలు నిర్వహించి వాహనదారులు, ప్రజలకు అసౌకర్యం కలిగించారు. దీనిపై ఎస్ఐ రవివర్మ చేసిన ఫిర్యాదుపై పోలీసులు క్రైం నంబరు76/2026తో బీఎన్ఎస్ 223, 189(2), 292, 125(2), 126(2), 132 రెడ్‌విత్ 190, పోలీసు చట్టంలోని 32, క్రిమినల్ లా అమెండ్‌మెంట్ చట్టంలోని 7(1)(ఎ), 188, 143, 290, 336, 341, 353 రెడ్‌విత్ 149 కింద కేసు నమోదు చేశారు.

జోగి మాటల్లో తప్పేముంది?

- చంద్రబాబుకు కూడా చిప్ పోయిందేమో.. వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ
- మాజీ మంత్రి జోగికి పరామర్శ



విజయవాడ /ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలపై దాడులు చూస్తుంటే మంత్రి లోకేశ్‌కే కాదు చంద్రబాబుకు కూడా చిప్ పోయిందనిపిస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ విమర్శించారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో మాజీ మంత్రి జోగి రమేశ్‌ను ఆయన శనివారం పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఆటవిక రాజ్యం నడుస్తోందని, జోగి ఇంట్లో ఉన్న వారందర్నీ మట్టుబెట్టాలనుకోవడం దుర్మార్గమని అన్నారు. ఈ దాడి క్షణికావేశంలో జరిగింది కాదని, పైనుంచి వచ్చిన ఆదేశాల మేరకు జరిగిందేనని చెప్పారు. చిప్ పోయిందని అంటే తప్పా? అంటూ జోగి వ్యాఖ్యలను సమర్థించారు. బుర్ర పాడై ఇంగిత జ్ఞానం కోల్పోతేనే దాడుల ఆలోచనలు వస్తాయన్నారు. అంబటి, జోగి ఇళ్లపై దాడి చేయడం సరైన పనా? టీడీపీ తప్ప ఎవరూ బతకకూడదా? అని ప్రశ్నించారు. దాడులను అడ్డుకోవాల్సిన పోలీసులు, దాడి చేసినవారితో కలిసి నడుచుకుంటూ రావడం ఏమిటన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి సంస్కృతి ఇప్పటి వరకు లేదన్నారు. ప్రభుత్వం మీ చేతిలోనే ఉంది కాబట్టి తప్పు చేస్తే శిక్షించండి అంటూ సలహా ఇచ్చారు. ఇక తిరుపతి లడ్డూ విషయంలో స్పందిస్తూ.. చంద్రబాబు చెప్పిందే వేదం అనుకుంటే ఎలా? ఆయనేమైనా మహర్షా అన్నారు. దేవుడితో రాజకీయాలు వద్దని, తప్పు చేస్తే, తప్పు మాట్లాడితే దేవుడు తప్పకుండా శిక్షిస్తాడని అన్నారు. లడ్డూ వ్యవహారంలో వన్ మ్యాన్ కమిటీ ఎందుకని, కూటమిలోని మూడు పార్టీల నుంచి ముగ్గురితో కూటమి కమిటీ వేసుకుని ఏదొక నివేదిక ఇచ్చుకోండంటూ వ్యంగ్యంగా సూచించారు. పవన్ సనాతన ధర్మం ఏమిటో, ఆయన ఏం మాట్లాడుతున్నాడో తెలుసుకుంటే మంచిదన్నారు. ఆయన మాటల్ని ప్రజలు అందరూ చూస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం చెందిందంటూ విమర్శించారు. విలేకరుల సమావేశంలో మాజీ మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, జోగి రమేశ్, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 ,
RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.